ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల
ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ
పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో
ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
తాడేపల్లిగూడెం
: fb.com/vaartha Digital

Published from Tadepalligudem, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupati, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Srikakulam

16-3-2026 సోమవారం సంపుటి: 32 సంచిక: 44 పేజీలు: 8+4 వెల: 6.50

## కోడ్ ముందటి తాయిలాలపై ఏం చేయలేం: సిఇసి

## కాన్షీరామ్‌కు భారతరత్న ఇవ్వాలి: రాహుల్ గాంధీ

5లో

# మోగిన 'పాంచ్' నగారా

ఏప్రిల్ 9న కేరళ, అసోం, పుదుచ్చేరి
23న తమిళనాట ఒకే దఫా ఎన్నికలు
బెంగాల్‌లో రెండు విడతలుగా పోలింగ్
8 అసెంబ్లీ ఉప ఎన్నికలు కూడా 23నే, మే4న ఓట్ల లెక్కింపు

**న్యూఢిల్లీ, మార్చి 15:** దేశంలో మరో ఎన్నికల సంగ్రామం మొదలైంది. పశ్చిమ బెంగాల్, తమిళనాడు, అసోం, కేరళ రాష్ట్రాలతోపాటు కేంద్ర పాలిత ప్రాంతం పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. వీటితోపాటు ఆరు రాష్ట్రాల్లో 8 అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించింది. ఆదివారం ఢిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశంలో కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల >>2


ఆదివారం మీడియాతో సిఇసి జ్ఞానేశ్ కుమార్


ఆదివారం ఇరాన్‌లోని ఇస్ఫహాన్ అణుకేంద్రంపై దాడి జరిగిన దృశ్యం

# మండుతున్న మధ్యప్రాచ్యం

ఇరాన్ ఇస్ఫహాన్ అణుకేంద్రంపై ఇజ్రాయెల్-యుఎస్ దాడులు
ఇరాక్‌లోని అతిపెద్ద ఆయిల్ రిఫైనరీపై ఇరాన్ దాడి
సౌదీ, యుఎఇ ఎయిర్‌పోర్టుల్లో సేవల నిలిపివేత

**టెహ్రాన్/జెరూసలెం/వాషింగ్టన్, మార్చి 15:** పశ్చిమాసియా దేశాల్లో నెలకొన్న యుద్ధవాతావరణం రానురాను తీవ్రతరం అవుతోంది. దీనికితోడు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ సోషల్‌మీడియా వేదికగా చేస్తున్న రెచ్చగొట్టే వ్యాఖ్యలు పరిస్థితిని మరింత తీవ్రతరంచేస్తున్నాయి. ఇదిలా ఉంటే ఆదివారం కూడా ఇజ్రాయెల్, అమెరికా దేశాలు సంయుక్తంగా ఇరాన్‌కు అత్యంత కీలకంగా ఉన్న ఇస్ఫహాన్ అణుస్థావరంపై దాడులుచేసాయి. అలాగే ఇరాన్ కీలక సమాచారంసేకరించేస్పేస్ స్టేషన్‌ను కూడా ధ్వంసంచేసాయి. టెహ్రాన్‌నగరంపైనా రెండుదేశాలు దాడులుచేసాయి. ఇరాన్ అణుస్థావరాన్ని పూర్తిగా ధ్వంసంచేసామని ఇజ్రాయెల్‌ప్రకటించింది. అలాగే ఖర్గ్ ద్వీపంపై సరదాగాకూడా అవసరమైతే మా సైన్యం దాడులుచేస్తుందని చెపుతూ ఇరాన్‌ను ఇప్పటికే పూర్తిగా నిర్వీర్యం చేసామని ట్రంప్ చెపుతూ ఇకపై ఇరాన్‌లో ప్రజాప్రభుత్వమే ఏర్పాటవుతుందని చెప్పారు. ఇప్పటికే ఇరాన్ సుప్రీం కమాండర్ మొజ్తబా ఖమైనీపై 93 కోట్ల రివార్డుప్రకటించిన అమెరికా ఆతడు ఇప్పటికి బతికి ఉన్నా గుర్తుపట్టలేని స్థితిలో గాయపడి ఉన్నాడంటూ అమెరికా చేసిన ప్రకటనలకు మద్దతుగా భారత్ నిఘా వర్గాలు కూడా బతికున్న మాట నిజమే కానీ అచేతనావస్థలో ఉన్నట్లు జాతీయ మీడియాలో కథనాలు వెలువడటం ఇరాన్‌ను మరింత కలవపరపరిచింది. ఈపరిస్థితి ఇలా ఉంటే ఇరాన్ తాజాగా >>2

# 'ఆదరణ'తో చేయూత

బిసి వర్గాల వృత్తి కార్మికులకు ఆధునిక పరికరాల పంపిణీ
మైక్రో ఎంట్రప్రెన్యూర్లుగా వెనుకబడిన వర్గాలు
సాస్కి నిధులతో రెసిడెన్షియల్ స్కూళ్లు
సీఎం చంద్రబాబు



**విజయవాడ, మార్చి 15, ప్రభాతవార్త ప్రతినిధి :** బీసీ వర్గాలకు చెందిన వృత్తికార్మికులకు ఆదరణ -3 ద్వారా ఆధునిక పరికరాల పంపిణీకి చర్యలు తీసుకుంటున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు.బీసీ వర్గాలను మైక్రో ఎంట్రప్రెన్యూర్లుగా, ఎంఎస్ఎంఈలుగా తీర్చిదిద్దేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఎక్స్ వేదికగాను,సీఎంవో కార్యాలయం విడుదల చేసిన సమాచార పత్రంలోను సీఎం చంద్రబాబు తెలిపారు.వృత్తికార్మికుల పనితనంలో నైపుణ్యాన్ని వృత్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు,సూక్ష్మ,చిన్న,మధ్యతరగతి పారిశ్రామిక వ్యవస్థ ద్వారా బిసి వర్గాలకు అవకాశాలు పెంచుతామన్నారు.ఉత్పత్తులకు దేశీయ,అంతర్జాతీయ స్థాయిలో మార్కెటింగ్ కల్పిస్తామన్నారు.కీలకంగా ఆదరణ -3 పథకం ద్వారా కులవృత్తుల వారీగా ఆధునిక పరికరాలను పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. రెసిడెన్షియల్ పాఠశాలలు, హాస్టళ్ల నిర్మాణంతో పాటు అక్కడ సురక్షిత తాగునీటి కోసం ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు.
రూ.60 కోట్ల సాస్కి నిధులతో రెసిడెన్షియల్ పాఠశాలలు, హాస్టళ్ల నిర్మాణం చేపట్టాలని సీఎం సూచించారు. 814 బీసీ సంక్షేమ హాస్టళ్లలో రూ.17 కోట్ల వ్యయంతో మార్చిలోగా ఆర్వో ప్లాంట్లను ఏర్పాటు చేస్తామని అధికారులు తెలిపారు. దీంతో పాటు హాస్టళ్లలో శానిటేషన్ తో పాటు విద్యార్థులకు అందించే ఆహార నాణ్యతపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని సీఎం స్పష్టం చేశారు. విద్యార్థుల ఆరోగ్యం, విద్యా బోధన సహా అన్ని అంశాల్లోనూ బెస్ట్ ప్రాక్టీసెస్ అనుసరించాలని సూచనలు ఇచ్చారు. బీసీ విద్యార్థులకు విద్యాపరమైన అంశాల పర్యవేక్షణకు అపార్ ఐడీలను నమోదు చేసి అనుసంధానం చేయాలని సీఎం ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్మాణంలో ఉన్న బీసీ భవనాలను పూర్తి చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఉన్న 6 మహాత్మా జ్యోతిరావు పూలే రెసిడెన్షియల్ స్కూళ్లను జూనియర్ కాలేజీలుగా మార్చాలని సీఎం ఆదేశించారు. బీసీ హాస్టళ్లు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో నెట్ జీరో కాన్సెప్టు కూడా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతీ నియోజకవర్గంలోనూ బీసీ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటుకు ఆలోచన చేస్తున్నామని ముఖ్యమంత్రి అన్నారు. రాష్ట్రంలో బీసీ స్టడీ సర్కిళ్లను తదుపరి స్థాయికి తీసుకెళ్లేలా కార్యాచరణ చేపట్టాలన్నారు. వెనుకబడిన వర్గాలకు కూటమి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని వారికి ప్రయోజనం కలిగేలా పథకాలు రూపొందించాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. పేదరిక నిర్మూలనలో పి4 కార్యక్రమం ఫలితాలను ఇస్తోంది ఉగాది 2025న ప్రారంభించిన పి4 కార్యక్రమం (ప్రభుత్వప్రైవేట్‌ప్రజల భాగస్వామ్యం), జనాభాలో అత్యంత పేదరికంలో ఉన్న 20 మందిని పైకి తీసుకురావడానికి ప్రభుత్వం, పరిశ్రమ మరియు సమాజాలను ఏకం చేయడం ద్వారా "పేదరికం లేని సమాజం" అనే లక్ష్యాన్ని ముందుకు తీసుకువెళ్తోందన్నారు. లక్ష మందికి పైగా "మార్గదర్శులు" 10.30 లక్షల "బంగారు కుటుంబాలను" దత్తత తీసుకుని, ప్రతి కుటుంబాన్ని పేదరికం నుండి విముక్తి చేయడానికి కృషి చేస్తున్నారు. ఈ కార్యక్రమాలన్నీ కలిసి కుటుంబ భద్రతను మరియు గౌరవాన్ని బలోపేతం చేశాయి. ఈ పునాదిని ఏర్పాటు చేసుకుని, ఇప్పుడు ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ యువతకు ఉద్యోగాలను సృష్టించడం, నైపుణ్యాలను పెంపొందించడం మరియు స్థిరమైన జీవనోపాధిని కల్పించడంపై దృష్టి సారిస్తోంది. ఉద్యోగ సృష్టితో పాటు, తగ్గుతున్న సంతానోత్పత్తి మరియు జనాభా పెరుగుదల యుగంలో సమర్థవంతమైన మానవ వనరుల నిర్వహణపై నా ప్రభుత్వం దృష్టి సారించింది. జపాన్ మరియు దక్షిణ కొరియా నుండి యూరప్ వరకు ప్రపంచవ్యాప్తంగా తగ్గుతున్న సంతానోత్పత్తి రేట్లు జనాభాను పునర్నిర్మించాయి మరియు స్థిరమైన అభివృద్ధిని పునర్నిర్వచించాయి. భారతదేశం యొక్క సగటు వయస్సు 28 సంవత్సరాలుగా పోలిస్తే ఆంధ్రప్రదేశ్ ఈ మార్పు దశలో ఉంది. నిజమైన వృద్ధి మానవ మూలధనాన్ని పెంపొందించడంలో ఉంది.

# నేటి నుంచి టెన్త్ పరీక్షలు

హాజరు కానున్న 6,40,916 మంది విద్యార్థులు

**విజయవాడ,మార్చి15,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం ఈ నెల 16 నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షలు 2026 ప్రారంభం కానున్నాయి. ప్రధాన పరీక్షలన్నీ మార్చి 30వ తేదీ వరకు జరగుతాయి. రాష్ట్ర వ్యాప్తంగా 6,40,916 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. వీరి కోసం 3,415 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇప్పటికే విద్యాశాఖ హాల్ టికెట్లను కూడా విడుదల చేసింది. విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు సులువుగా చేరుకోవడానికి వీలుగా హాల్ టికెట్లపై క్యూ ఆర్ కోడ్‌ను ముద్రించారు. ఈ క్యూ ఆర్ కోడ్‌ను మొబైల్ ఫోన్‌తో స్కాన్ చేస్తే పరీక్ష కేంద్రానికి ఎలా చేరుకోవాలో, >>2

## తిరుమలలో పురాతన
# మండపాలకు కొత్త రూపు



మలివిడతలో రాతి స్తంభాలు, పైకప్పులు పటిష్టం

**తిరుమల,మార్చి 15ప్రభాతవార్తప్రతినిధి:** సహజశిలాసంపదను పరిరక్షించే కోణంలో తిరుమల వెంకన్న ఆలయంలోపల మండపాలను పూర్తిస్థాయిలో పటిష్టం చేసేందుకు టిటిడి అధికారులు ఆలోచన మొదలుపెట్టారు. ఇప్పటికే ఏడుసంవత్సరాల క్రిందట ఆలయంలోని రంగనాయకుల మండపంలో రాతిస్తంభాలు భక్తులకు స్పష్టంగా కనిపించేలా విద్యుత్ వెలుగులు ఏర్పాటుచేసిన విషయం విదితమే. ఆ తరువాత మండపాలు బాగోగులు పట్టించుకోలేదు.. మళ్ళీ ఇప్పుడు టిడిపి కూటమి ప్రభుత్వం ఏర్పాటుతో ఆలయ పరిరక్షణ, పురాతనమండపాల ప్రాశస్త్యం భవిష్యత్‌తరలాకు తెలియజేసేలా తీర్చిద్దాలని నిర్ణయించారు. సిఎంచంద్రబాబునాయుడు ఆదేశాలతో టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, ఇఒ ముద్దాడ రవిచంద్ర, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి ప్రత్యేక దృష్టి సారించారు. దేవదేవుని ఆలయంలోపల ఉన్న పురాతన మండపాల పరిరక్షణపై ఇప్పటికే ఓ నిర్ణయం.తీసుకున్నారు. పురాతన మండపాల్లోని రాతి స్తంభాలు, రాతి పైకప్పును శుభ్రపరచడంతో పాటు పగుళ్లను శాస్త్రీయపద్ధతుల్లో సరిచేసి సంరక్షించేందుకు పూణేకు చెందిన ఓ సంస్థ ముందుకు వచ్చింది. పూర్తిగా విరాళం రూపంలో ఈ పనులు చేపట్టేందుకు ఆ ట్రస్టు సిద్ధమైంది. ఇటీవల ఈ పనులకు బోర్డు కూడా ఆమోదం తెలిపింది. ఆలయంలోని రంగనాయక మండపం, కళ్యాణోత్సవ మండపం, పాత పరకామణి మండపాల్లో పురాతన రాతి స్తంభాలు, రాతి ఉపరితలం,ఇతర రాతి నిర్మాణాలను కొన్ని రకాల రసాయనాలతో శుభ్రపరచడంతోపాటు పగుళ్లను అరికట్టి సంరక్షించేలా పూణేకు చెందిన లార్డ్‌వేంకటేశ్వర ఛారిటబుల్, రిలీజియస్ ట్రస్టు (ఎల్వీసీఆర్టీ) ముందుకొచ్చింది. మండపాల పునరుద్ధరణ దిశగా చర్యలతోబాటు ఇందుకయ్యే వ్యయం మొత్తం ఆట్రస్టు భరిస్తుంది. ఈ ట్రస్టు ప్రస్తుతం అలిపిరి పాదాల మండపాన్ని >>2

## ఎంపి పుట్టా మహేష్ సహా
# ఆరుగురికి డ్రగ్స్ పాజిటివ్


పట్టుబడిన మాదకద్రవ్యాలు

రోహిత్ రెడ్డి ఫామ్‌హౌస్‌లో సంచలనం సృష్టించిన వీకెండ్ పార్టీ
పాజిటివ్ వచ్చిన వారిలో మాజీ ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి, విజయ్ కృష్ణ కౌశిక్, అర్జున్ రెడ్డి ప్రభృతులు
మహేష్ సహా ఎనిమిదిమందికి స్టేషన్ బెయిల్


మీడియాతో ఈగల్ ఫోర్స్ ఎస్పీ గిరిధర్

**ప్రభాతవార్త, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి ఫాంహౌజ్‌పై ఈగిల్ టీమ్ దాడుల్లో డ్రగ్స్ పట్టివేత సంఘటన జిల్లాలో ఒక్కసారిగా ప్రకంపనలు సృష్టించాయి. శనివారంరాత్రి నుంచి ఈగిల్ టీమ్, పోలీసులు జరిపిన సంయుక్త దాడుల్లో గన్, డ్రగ్స్ సంస్కృతి వెలుగులోకి వచ్చింది. పైలెట్ రోహిత్‌రెడ్డి, ఆయన >>2

## చంచల్‌గూడ జైలుకు రోహిత్ రెడ్డి 2లో



## గుంటూరులో లిక్విడ్ గంజాయి
# ముఠా అరెస్ట్

**గుంటూరు మార్చి 15 ప్రభాత వార్త ప్రతినిధి :** గుంటూరుజిల్లాలో గంజాయి, మాదక ద్రవ్యాల కార్యకలాపాలకు పాల్పడే ముఠాల పై జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఉక్కుపాదం మోపారు. పాత గుంటూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని వస్త్ర నగర్ ఖాళీ స్థలంలో లిక్విడ్ గంజాయి కార్యకలాపాలు నిర్వహిస్తున్నారన్న సమాచారంతో పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి ఒకలీటర్ లిక్విడ్ గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే గుంటూరు నగరానికి చెందిన షేక్ మహబూబ్ భాషా గంజాయికి అలవాటు పడి సులువుగా డబ్బు సంపాదించాలని >>2

## పెద్ద పులి సంచారంపై హనుమాన్ బృందాలు అప్రమత్తం

సురక్షితంగా బంధించేందుకు 10 బృందాలు: డి.సిఎం పవన్ 2లో



2లో

# నేడు 'అమరజీవి' 58 అడుగుల విగ్రహావిష్కరణ

# 24x7 గ్యాస్ కష్టాలే!

పల్లె నుంచి పట్టణం దాకా అంతా హాహాకారాలు
సర్వర్లు మొరాయిస్తుండడంతో నిలిచిపోతున్న బుకింగ్‌లు
ఒటిపి రాదు.. సిలిండర్ కదలదు
రూ.5వేలిస్తే బ్లాక్‌లో ప్రత్యక్షం



**హైదరాబాద్, మార్చి 15, ప్రభాతవార్త:** పశ్చిమాసియాలో యుద్ధ ప్రభావంతో రాష్ట్రంలో ప్రజలు, చిరు వ్యాపారులకు గ్యాస్ కష్టాలు రోజు రోజుకూ తీవ్రమవుతున్నాయి. వంట గ్యాస్ కొరత లేదని ప్రభుత్వం ఎంత భరోసా ఇచ్చినా, అధికారులతో ఎన్ని రివ్యూలు చేసినా రాష్ట్రంలో సామాన్యులకు వంట గ్యాస్ కష్టాలు మాత్రం తీరడం లేదు. ప్రస్తుత పరిస్థితుల్లో పట్టణం నుంచి పల్లె దాకా ప్రజలు వంట గ్యాస్ కష్టాలు వెంటాడుతున్నాయి. ఏజెన్సీలు, గోడౌన్ల దగ్గర ఖాళీ సిలిండర్లు దర్శనమిస్తున్నాయి. సర్వర్లు మొరాయించడంతో గ్యాస్ బుకింగ్‌లు నిలిచి పోయాయి. టోల్ ఫ్రీ, కస్టమర్ కేర్ నెంబర్లు కనెక్ట్ కావడంలేదు. అదృష్టం కొద్దీ కనెక్ట్ అయినా ఓటిపిలు జనరేట్ కావడంలేదు. ఓటిపి లేకుండా ఏజెన్సీలు డెలివరీ చేయడంలేదు. ఇప్పటికే బుకింగ్ ప్రాసెస్ కంప్లీట్ అయ్యి ఓటిపి వచ్చినా రీఫిల్లింగ్ సిలిండర్లు అందడంలేదు. స్టాక్ వచ్చాకనే ఇస్తామంటూ డీలర్లు సర్ది చెప్తున్నారు. ఏజెన్సీలు ఒక చోట, గోడౌన్లు మరో చోట ఉండడంతో జనం నిత్యం చక్కర్లు కొడుతున్నారు. స్టాక్ ఎప్పుడొస్తుందో విని యోగదారులకు తెలియదు, వచ్చాక బినామీ, బోగస్ పేర్లతో ఎవరికి డెలివరీ అవుతున్నాయో అర్థం కావడంలేదు. ఇదే సమయంలో సందట్లో సడేమియా అన్నట్లుగా అక్రమార్కులు బ్లాక్ మార్కెట్‌లో గ్యాస్‌ను అధికధరలకు విక్రయించి సొమ్ము >>2

## దుబాయ్ ఎయిర్‌పోర్టుపై
# ఇరాన్ దాడి

**దుబాయి, మార్చి 15:** అమెరికా-ఇజ్రాయెల్ కూటమి, ఇరాన్ మధ్య దాడులు తీవ్రస్థాయికి చేరాయి. ఆదివారం ఇరాన్ జరిపిన క్షిపణి దాడులతో దుబాయ్, కువైట్ నగరాలు దద్దరిల్లాయి. దుబాయ్‌లోని ప్రధాన ఆర్థిక కేంద్రాలు, మెరీనా, అల్ సుఫూహ్ వంటి నివాస ప్రాంతాలలో భారీ పేలుడు శబ్దాలు వినిపించాయి. దుబాయ్ ఎయిర్‌పోర్టు సమీపంలో క్షిపణి శకలాలు పడటంతో విమాన రాకపోకలకు అంతరాయం కలిగింది. భద్రతా కారణాల దృష్ట్యా దుబాయ్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ కార్యకలాపాలను తాత్కాలికంగా నిలిపివేసినట్లు అధికారులు ప్రకటించారు.


ఆదివారం హైదరాబాద్‌లోని కావూరి నివాసంలో ఆయన చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న సిఎం చంద్రబాబు

## దివంగత కేంద్ర మంత్రి కావూరి సాంబశివరావు కుటుంబానికి సిఎం చంద్రబాబు పరామర్శ

**విజయవాడ,మార్చి15,ప్రభాతవార్తప్రతినిధి:**ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన కేంద్ర మాజీ మంత్రి కావూరు సాంబశివరావు కుటుంబ సభ్యుల్ని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు పరామర్శించారు. హైదరాబాద్ లో కావూరు నివాసానికి వెళ్లిన సీఎం.. ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడిన ఆయన కేంద్ర మంత్రిగా, ప్రజాప్రతినిధిగా కావూరు సాంబశివరావు అందించిన సేవల్ని గుర్తు చేసుకున్నారు. కావూరి అయిదు పర్యాయాలు ఎంపీగా, కేంద్రమంత్రిగా రాష్ట్రాభివృద్ధికి చేసిన కృషిని ఈ సందర్భంగా చంద్రబాబు కొనియాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజనకు అంగీకరించని కావూరి తుదివరకు అదే మాటపై ఉన్నారన్నారు. ఏపీని పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు శ్రమించారన్నారు.

# నేటి నుంచి టెన్త్ పరీక్షలు

>> ఎంత టైమ్ పడుతుందో డిస్ ప్లే అవుతాయి. అలాగే విద్యార్థులు తమ హాల్ టికెట్లను చూపించి ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించే వెసులుబాటును విద్యాశాఖ కల్పించింది. పల్లె వెలుగు, ఆల్ట్రా పల్లె వెలుగు, సిటీ ఆర్డినరీ బస్సుల్లో ఈ అవకాశం ఉంటుంది. హాల్ టికెట్లను కండక్టర్లకు చూపించి ఫ్రీ గా పరీక్షా కేంద్రాలకు చేరుకోవచ్చు. ఇప్పటికే పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. విద్యార్థులకు ఆయా తేదీల్లో ప్రతి రోజూ పరీక్ష ఉదయం 9.30 గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం 12.45 గంటల వరకు కొనసాగుతుంది. విద్యార్థులు మాత్రం ఎగ్జామ్ సెంటర్‌లలోకి ఉదయం 8.30 గంటల నుంచే పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తారు. ఈసారి పరీక్షలకు ఒక్క నిమిషం నిబంధన ఎత్తివేసింది. దీంతో ఆలస్యంగా వచ్చిన విద్యార్థులను గరిష్ఠంగా అరగంట వరకు అనుమతిస్తారు. అయితే ప్రత్యేక పరిస్థితుల్లో మాత్రమే ఈ వెసులుబాటు కల్పిస్తామని అధికారులు తెలిపారు. చివరి నిమిషంలో గందరగోళానికి గురికాకుండా అరగంట ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని అధికారులు సూచించారు. ఇక పరీక్షలు ముగిసిన తర్వాత ఏప్రిల్ 4వ తేదీ నుంచి పదోతరగతి పరీక్షల జవాబుపత్రాల మూల్యాంకనం ప్రారంభం అవుతుంది. నెలాఖరుకు ఫలితాలు వెల్లడించే అవకాశం ఉంది. ఎపి పదో తరగతి పబ్లిక్ పరీక్షల 2026 పూర్తి టైమ్ టేబుల్‌ను గమనిస్తే మార్చి 16న ఫస్ట్ లాంగ్వేజ్. మార్చి 18న సెకండ్ లాంగ్వేజ్‌మార్చి 21న ఇంగ్లిష్ పరీక్ష (మార్చి 20 నుంచి 21కి పరీక్ష తేదీ మారింది). మార్చి 23న మ్యాథమెటిక్స్, మార్చి 25న ఫిజికల్ సైన్స్, మార్చి 28న బయాలాజికల్ సైన్స్ పరీక్ష, మార్చి 30న సోషల్ స్టడీస్ పరీక్ష, మార్చి 31న ఫస్ట్ లాంగ్వేజ్ (పేపర్ 2) పరీక్ష, ఏప్రిల్ 1న ఒకేషనల్ కోర్సు పరీక్ష జరుగుతాయి.

## గుంటూరులో లిక్విడ్ గంజాయి ముఠా అరెస్ట్

>> అరకు వెళ్లి కొండలరావు, ఓ మైనర్ వద్ద నుండి లిక్విడ్ గంజాయిని కొనుగోలు చేశాడు. అక్కడ కొనుగోలు చేసిన లిక్విడ్ గంజాయిని గుంటూరుకు తీసుకొని వచ్చి అతను త్రాగుతూ, కొంత అమ్ముకునేవాడు. ఈ క్రమమంలో గుంటూరుకు చెందిన షేక్ మహబూబ్ భాషా, అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన తామిలి కొండల రావు, మరో మైనర్ ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా గుంటూరు జిల్లా ఈస్ట్ డిఎస్పి అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ గంజాయి మహమ్మారిని కూకటివేళ్ళతో పెకలించి, నిర్మూలించడానికి పటిష్ట ప్రణాళికలు రూపొందించామని, పోలీస్ స్టేషన్ స్థాయిలో ప్రత్యేక పోలీస్ బృందాలను నియమించామని అన్నారు. ఈగల్ టీంతో సమన్వయం చేసుకుంటూ గంజాయి విక్రయం, వినియోగం, సరఫరా చేసే వారి పై నిఘా పెట్టి కఠిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. తరచుగా గంజాయి కేసుల్లో నిందితులుగా ఉన్న వారిపై పీడీ యాక్ట్ ప్రయోగించడం , నూతన ఎన్ డి పి ఎస్ చట్టం ప్రకారం కఠినంగా శిక్షి స్తామని హెచ్చరించారు. ఈ కేసులో నిందితులను అరెస్ట్ చేయడంలో ప్రతిభ కనబరిచిన గుంటూరు ఈస్ట్ డీఎస్పీ అబ్దుల్ అజీజ్ , పాత గుంటూరు సిఐ వెంకట ప్రసాద్, సిబ్బంది మోహన్, నూరుద్దీన్, రామరావులను గుంటూరు జిల్లా ఎస్పి అభినందించినారు.

# 24x7 గ్యాస్ కష్టాలే!

>> చేసుకుంటున్నారు. పశ్చిమాసియాలో ముదురుతున్న యుద్ధం భారతీయ వంట గదుల్లో మంటలు పుట్టిస్తోంది. ఇరాన్-అమెరికా మధ్య ఘర్షణలతో చమురు, సహజవాయువు సరఫరా వ్యవస్థలు దెబ్బతినడంతో సామాన్యుల వంట గ్యాస్ భయం ఇప్పుడు బ్లాక్ మార్కెట్ వ్యాపారులకు వరంగా మారింది. గతంలో ఎన్నడూ లేని విధంగా దేశవ్యాప్తంగా ఎల్‌పిజి సిలిండర్ల కొరత ఏర్పడటంతో అక్రమ విక్రయదారులు సిలిండర్ ధరను ఆకాశానికి తీసుకెళ్లారు. ప్రస్తుతం హైదరాబాద్‌తోపాటు రాష్ట్ర వ్యాప్తంగా గ్యాస్ బ్లాక్ మార్కెట్ దందా జోరందుకుంది. ఎల్‌పిజి గ్యాస్ సిలిండర్ రూ.2 వేల వరకు, కమర్షియల్ గ్యాస్ ధర రూ.3 వేల నుంచి 5 వేల వరకు విక్రయిస్తున్నట్లు సమాచారం. ఒకప్పుడు వెయ్యి రూపాయలకే దొరికే సిలిండర్ నేడు బ్లాక్‌లో రూ.5వేలకు అమ్ముడవుతోంది. సిలిండర్లు సరిపడా ఉన్నాయని అధికారులు చెబుతున్నప్పటికీ ఏజెన్సీల్లో నో స్టాక్ అంటూ చెబుతున్నారని వినియోగదారులు వాపోతున్నారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఏజెన్సీల ముందు సిలిండర్ల కోసం వినియోగదారులు క్యూలో నిల్చోవాల్సిన దుస్థితి నెలకొంది. మరోవైపు హోటల్స్, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, మెస్‌లు సిలిండర్లు లేక మూసుకోవాల్సిన పరిస్థితి వచ్చిందని నిర్వాహకులు వాపోయారు. హైదరాబాద్‌లోని చిక్కడపల్లిలో ఓ ఫాస్ట్ ఫుడ్ సెంటర్ నిర్వాహకుడు కట్టెలతోనే వంటకాలు సిద్ధం చేసుకోవాల్సి వచ్చింది. అధికారులు ఇప్పటికైనా స్పందించి ఏజెన్సీల బ్లాక్ దందాను అరికట్టాలని ఎల్‌పిజి వినియోగదారులు డిమాండ్ చేస్తున్నారు. సిలిండర్లు సరిపడా ఉన్నప్పుడు బుక్ చేసినా పది రోజుల గడిచినా ఎందుకు రావడం లేదని ప్రశ్నిస్తున్నారు. గృహ అవసరాలకు కేటాయించిన ఎల్‌పిజి గ్యాస్ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు ఉపయోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పౌరసరఫరాలశాఖ హెచ్చరిస్తోంది. హోటళ్లు, రెస్టారెంట్లలో డొమెస్టిక్ సిలిండర్ల వినియోగాన్ని అరికట్టేందుకు పౌరసరఫరాలశాఖ అధికారులు, డిటిలు, ఎస్‌ఐలతో కూడిన అయిదు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసింది. ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్న వినియోగదారులకు సకాలంలో, నిర్దేశిత పరిమాణంలో గ్యాస్ సరఫరా చేయాలని, ఆస్పత్రులు, వసతి గృహా లకు నిబంధనల మేరకు సరఫరా కొనసాగించాలని స్పష్టం చేస్తోంది. ఈ నేపథ్యంలో గ్యాస్ వినియోగదారులు అధికారిక ఛానెళ్ల ద్వారానే బుకింగ్ చేసుకోవాలని, బ్లాక్ మార్కెట్‌ను ప్రోత్సహించవద్దని ప్రభుత్వం విజ్ఞప్తి చేస్తోంది.

## శంఖవరం మండపం మధ్య పెద్దపులి తిష్ట ఐదు బృందాలతో నిరంతరం పర్యవేక్షణ..

**కాకినాడ, మార్చి15,ప్రభాతవార్త ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి.** కాకినాడ జిల్లాలో గత 16 రోజులుగా పలు గ్రామాల్లో సంచరిస్తూ అటవీ అధికారులకు సవాల్ గా మారింది. రాజవొమ్మంగి, ఏలేశ్వరం, ప్రత్తిపాడు మండలాల నుండి శంఖవరం మండలం లోకి ప్రవేశించి గైరంపేట, తాడువాయి, అచ్చంపేట పరిసర ప్రాంతాల్లో సంచరించింది. శనివారం సాయంత్రం 600 మీటర్ల చెరువు వీదుకోని, మూడు కిలోమీటర్ల ప్రయాణం అనంతరం పెద్దపులి శనివారం రాత్రి శంకవరం గ్రామ సమీపంలో గల ఊరకొండపై తిష్ట వేసింది. ఆదివారం మధ్యాహ్నం కొండ దిగి తాళ్లపాలెం పంపా రిజర్వాయర్ వైపు అడుగులు వేసింది. తాళ్లపాలెం వైపు ప్రయాణించి యూటర్న్ తీసుకుని శంఖవరం మండపం మధ్యలో గల బ్రిడ్జి వద్ద తిష్ట వేసింది. ఉదయం నుండి కత్తిపూడి- రౌతులపూడి రహదారిపై వాహనాలను మళ్లించి ట్రాఫిక్‌ను నియంత్రించారు. అటవీ శాఖ పులి కదలికలను పర్యవేక్షి ంచేందుకు రెండు డ్రోన్ బృందాలు, ఒక విహెచ్‌ఎఫ్ సిగ్నల్ ట్రాకింగ్ బృందం, రెండు డార్టింగ్ బృందాలు మరియు రక్షణ బృందాలు ఎన్ ఎస్ టి ఆర్ రాజమహేంద్రవరం తో ఘటనాస్థలంలో ఉండి బృందాల పనితీరును పర్యవేక్షి స్తున్నామని అదికారులు తెలిపారు. మండపం తాళ్లపాలెం, కొండ గైరంపేట అన్నవరం పరిసర ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీ శాఖ సూచనలు పాటించాలన్నారు. స్థానిక టిడిపి నేత పర్వత సురేష్, ఎంపీపీ పర్వత రాజబాబులు, పులి కదలికలపై తాసిల్దార్ తాతారావు అన్నవరం ఎస్సై శ్రీ హరి బాబు డిఎఫ్ఓ రామచంద్ర రావు

# మోగిన 'పాంచ్' నగారా

>> చేశారు. పశ్చిమబెంగాల్‌లో రెండు దశల్లో ఏప్రిల్ 23, ఏప్రిల్ 29న పోలింగ్ నిర్వహించనున్నారు. తమిళనాడులో అక్టోబర్ 23న పోలింగ్ జరుగనుంది. అసోం, కేరళ, పుదుచ్చేరిల్లో ఒకే దశలో ఏప్రిల్ 23న పోలింగ్ నిర్వహించనున్నట్లు కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. వీటితోపాటు గోవా, కర్ణాటక, నాగాలాండ్, త్రిపురల్లో ఏప్రిల్ 9, గుజరాత్, మహారాష్ట్రలో ఏప్రిల్ 23న పోలింగ్ జరుగనుంది. అన్ని రాష్ట్రాల ఓట్ల లెక్కింపు మాత్రం మే 4న జరుగనుందని కేంద్ర ఎన్నికల కమిషనర్లు జ్ఞానేశ్ కుమార్, సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషిలు వివరించారు. ఎన్నికల షెడ్యూల్ విడుదల నేపథ్యంలో ఆయా రాష్ట్రాల్లో ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తుందని పేర్కొన్నారు. శాంతియుత వాతావరణంలో ఎన్నికల ప్రక్రియ ముగిసేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామని, ఎన్నికల ప్రక్రియలో హింసాత్మక ఘటనలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## నేడు 'అమరజీవి' 58 అడుగుల విగ్రహావిష్కరణ

**విజయవాడ,మార్చి15,ప్రభాతవార్తప్రతినిధి:**ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి వేదికగా తెలుగు జాతి ఆత్మగౌరవ ప్రతీకగా నిలిచే ఒక అద్భుత ఘట్టం ఆవిష్కృతం కానుంది. అమరజీవి పొట్టి శ్రీరాములు 125వ జయంతిని పురస్కరించుకొని.. 58 అడుగుల భారీ కాంస్య విగ్రహాన్ని సోమవారం, మార్చి 16వ తేదీన ప్రారంభించనున్నారు. అమరావతిలోని శాఖ మూరులో ఏర్పాటు చేసిన ఈ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పి.వి.ఎన్. మాధవ్ ముఖ్య అతిథులుగా హాజరు కానున్నారు. తెలుగు ప్రజల కోసం ప్రత్యేక రాష్ట్రాన్ని కాంక్షిస్తూ పొట్టి శ్రీరాములు చేసిన 58 రోజుల ఆమరణ నిరాహార దీక్షకు నివాళిగా, ఈ విగ్రహాన్ని సరిగ్గా 58 అడుగుల ఎత్తుతో రూపొందించారు. దీనికి "స్టాచ్యూ ఆఫ్ శాక్రిఫైస్ అని అమరజీవి పొట్టి శ్రీరాములు మెమోరియల్ ట్రస్ట్ నామకరణం చేసింది. త్వరలోనే ఈ త్యాగ శిల్పం ప్రాంగణంలో అద్భుతమైన రీతిలో స్మృతివనం విస్తరిస్తామని అమరజీవి పొట్టి శ్రీరాములు మెమోరియల్ ట్రస్ట్ అధ్యక్షులు పారేపల్లి దూండీ రాకేష్ వెల్లడించారు.

## నలుగురు నిందితులకు బెయిల్ రద్దు

### చంద్రబాబు కాన్వాయ్‌పై దాడి కేసులో హైకోర్టు తీర్పు

**విజయవాడ,మార్చి15,ప్రభాతవార్తప్రతినిధి:** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రతి పక్ష నేతగా ఉన్న సమయంలో ఆయన కాన్వాయ్‌పై జరిగిన రాళ్ల దాడి కేసులో హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. ఈ కేసులోని మొదటి నలుగురు నిందితులకు గతంలో నందిగామ కోర్టు మంజూరు చేసిన బెయిల్‌ను ఉన్నత న్యాయస్థానం రద్దు చేసింది. తీర్పు కాపీ అందిన వారం రోజు ల్లోగా సంబంధిత మేజిస్ట్రేట్ ముందు లొంగి పోవాలని నిందితులను ఆదేశించింది. ఇదే కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న వైసీపీ ఎమ్మెల్సీ మొండితోక అరుణ్ >> కుమార్, ఆయన సోదరుడు జగన్మోహనరావుతో పాటు మరికొందరికి షరతులతో కూడిన ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. 2022 నవంబర్ 5న కృష్ణా జిల్లా నందిగామలో "బాదుడే బాదుడు" కార్యక్రమంలో భాగంగా చంద్రబాబు పర్యటిస్తుండగా, ఆయన కాన్వాయ్‌పై రాళ్ల దాడి జరిగింది. ఈ ఘటనలో చంద్రబాబు చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ మధుసూధనరావు గాయపడ్డారు. ఆయన ఫిర్యాదు మేరకు నందిగామ పోలీసులు కేసు నమోదు చేశారు. ఆ తర్వాత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, ఈ ఘటనపై ప్రత్యేక బృందాలతో లోతుగా దర్యాప్తు చేపట్టారు. చంద్రబాబును హత్య చేసేందుకే ప్రణాళికతో దాడి చేశారని తేల్చిన పోలీసులు, కేసులో హత్యాయత్నం నేరపూరిత కుట్ర వంటి సెక్షన్లను చేర్చారు. ఈ కేసులో 2024 నవంబర్ 23న అరెస్ట్ అయిన నిందితులు సజ్జనరావు, కార్తీక్, కిశోర్, శ్రీనివాసరావులను పోలీసులు నందిగామ కోర్టులో హాజరుపరిచారు. అయితే, హత్యాయత్నం వంటి తీవ్రమైన సెక్షన్లు వర్తించవని పేర్కొంటూ న్యాయమూర్తి వారికి బెయిల్ మంజూరు చేశారు. ఈ తీర్పును సవాలు చేస్తూ నందిగామ సీఐ లక్ష్మ నాయుడు హైకోర్టును ఆశ్రయించారు. పోలీసుల తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదనలు వినిపించారు. విచారణ జరిపిన జస్టిస్ వెంకట జ్యోతిర్మయి, నందిగామ కోర్టు ఇచ్చిన బెయిల్ ఉత్తర్వులను రద్దు చేస్తూ తీర్పు ఇచ్చారు. బెయిల్ పొందిన వారు పాస్‌పోర్టులను దర్యాప్తు అధికారికి అప్పగించాలని, చార్జిషీటు దాఖలు చేసే వరకు ప్రతి ఆదివారం ఐవో ముందు హాజరుకావాలని స్పష్టమైన షరతులు విధించారు.

# ఎంపి పుట్టా మహేష్ సహా ఆరుగురికి డ్రగ్స్ పాజిటివ్



>> రాత్రి 7:30 గంటలకు సమయంలో తమకు డ్రగ్స్ పార్టీకి సంబంధించిన సమాచారం అందిందని తెలిపారు వెంటనే మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని అజిత్ నగర్ రెవెన్యూ లో గల తాండూర్ మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి ఫామ్ హౌస్కు వెళ్లి ఈగల్ టీం ఎస్ఓటి పోలీసులు కలిసి ఫామ్ హౌస్ పై దాడులు నిర్వహించగా ఫామ్ హౌస్ లో మొత్తం 11 మంది తో పార్టీ జరుపుతున్నట్లు తెలిసింది అందులో 11 మందికి టెస్ట్ నిర్వహించగా ఆరుగురికి పాజిటివ్ వచ్చిందని పేర్కొన్నారు పాజిటివ్ వచ్చిన వారిలో మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి ఆంధ్రప్రదేశ్కు చెందిన అధికార పార్టీ టిడిపి ఏలూరు ఎంపీ పుట్ట మహేష్ కుమార్ యాదవ్. విజయ్ కృష్ణ కౌశిక్ రవి తిరువీడుల అర్జున్ రెడ్డి నమిత్ శర్మ మోరవినేని రమేశ్ లకు డ్రగ్స్ పాజిటివ్ వచ్చినట్లు ఆయన తెలిపారు 11 మందిపై కేసు నమోదు చేసి విచారించారు రోహిత్ రెడ్డి స్నేహితుడు కౌశిక్ రెడ్డి సిమ్లా నుండి గుర్తు తెలియని వ్యక్తి దగ్గర డ్రగ్స్ కొనుగోలు తెచ్చారని తెలిపారు అయితే అందరికి డ్రగ్స్ పంచిన తర్వాత రెండు కొకైన్ ప్యాకెట్లు రోహిత్ రెడ్డి పిఏ సిల్వర్ శరత్ కుమార్ దగ్గర స్వాధీనం చేసుకున్నట్లు వారు తెలిపారు

ముగ్గురికి మినహా ఎనిమిది మందికి బేల్ మంజూరు.....

డ్రెస్ కేసులో మొత్తం 11 మంది పై కేసు నమోదు కాగా ముగ్గురికి మినహా ఎనిమిది మందికి స్టేషన్ బెయిల్ మంజూరు చేసినట్లు పోలీసులు తెలిపారు ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి, కౌశిక్ రెడ్డి నమిత్ రెడ్డి లకు బెల్ నిరాకరించారు రేపటినుండి రేపటినుండి ఆంధ్రప్రదేశ్ లో పార్లమెంట్ సమావేశాలు ఉండడంతో ఏలూరు ఎంపీ మహేష్ కుమారి యాదవ్ కు ప్రియాంక రెడ్డి లకు షరతులతో కూడిన బేలు మంజూరు చేసినట్లు వారు పేర్కొన్నారు.

సంచలనాలకు అడ్డగా మారిన రోహిత్ రెడ్డి ఫామ్ హౌస్....

గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు టిఆర్ఎస్ ఎమ్మెల్యేలను ఓ స్వామీజీ కొనుగోలు చేసి పార్టీ ఫిరాయింపుల వ్యవహారం మొయినాబాద్ మండలంలోని ఈ ఫామ్ హౌస్ లోనే జరిగింది అప్పట్లో ఎమ్మెల్యేల కొనుగోలు వ్యవహారం తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించింది ఇప్పుడు మరోసారి రోహిత్ రెడ్డి ఫామ్హౌస్ రెండు రాష్ట్రాల్లో సంచలనానికి నిలయమైందని పలువురు అంటున్నారు తెలంగాణ రాష్ట్రంలో గంజాయి డ్రగ్స్ వంటి మారకద్రవ్యాల నిషేధం పై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిక్కచ్చిగా వ్యవహరిస్తున్నారని పలువురు అంటున్నారు కానీ ఈ డ్రగ్స్ వ్యవహారం కాస్త సినీ రంగం నుండి రాజకీయ రంగు పూసుకుంది మరి ఈ వ్యవహారంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎలా వ్యవహరిస్తుందో చూడాలని పలువురు అంటున్నారు .

## వేసవిసెలవులకు ముందే తిరుమల కిటకిట

### - వెంకన్న సర్వదర్శనానికి 24గంటలు

**తిరుమల,మార్చి 15 ప్రభాతవార్తప్రతినిధి:** వరుససెలవులు...వారాంతంకావడంతో గత రెండురోజులుగా తిరుమల భక్తులతో కిటకిటలాడుతోంది. ఆదివారం ఉదయానికి తిరుమల భక్తజనసంద్రంగా మారింది. సాయంత్రానికి ఈ రద్దీ మరింతగా పెరిగింది. శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనార్థం లక్షమందికిపైగాభక్తులు తిరుమలకు చేరుకోవడంతో ఉదయానికి కొండ జనంతో నిండిపోయింది.

తిరుమలలో వైకుంఠం-1,2 క్యూకాంప్లెక్స్‌లు నిండిపోయి భక్తుల క్యూలైన్లు శిలాతోరణం వరకు చేరాయి. టిటిడి అధికారులు ముందస్తుగా అన్ని ఏర్పాట్లు సిద్ధంచేసి శ్రీవారి సేవకులతో భక్తులకు నిరంతరాయంగా సేవలందిస్తున్నారు. కంపార్టుమెంట్లలో ,క్యూలైన్లలో ఉన్న భక్తులకు అన్నప్రసాదాలు, పాలు, టీ శ్రీవారిసేవకులు పంపిణీ చేస్తున్నారు. సాయంత్రం వరకు 44వేలమంది భక్తులకు మహాలఘు దర్శనం చేయించారు.

# మండపాలకు కొత్త రూపు

>> శాస్త్రీయ పద్ధతిలో పునర్నిర్మాణ పనులు మొదలుపెట్టారు. రంగనాయక మండపంలోని నాలుగు స్తంభాలను ఇప్పటికే ప్రయోగాత్మకంగా పైలెట్ బేసిస్ శుద్ధి చేయడంతో వాటి రూపం అద్భుతంగా మారిందని భక్తులు చెబుతున్నారు. ఈ ఫలితాలు చూసిన తరువాత ఈ ప్రాజెక్ట్‌కు ఆమోదం లభించింది. ప్రత్యేక రసాయనాలతో స్తంభాల పై పేరుకుపోయిన జిడ్డు, నల్లటి మరకలను తొలగిస్తారు. ఆధునిక సిమెంట్ వాడకాన్ని పక్కన పెట్టి.. సంప్రదాయ పద్ధతిలో సున్నపు గారతో పగుళ్లకు మరమ్మతులు చేయనున్నారు. వకుళమాత పోటులో వేడి ప్రభావం తగ్గించేందుకు హీట్ షీల్డ్స్, మెరుగైన ఎగ్జాస్ట్ వ్యవస్థను ఏర్పాటు చేస్తారు.


ఆదివారం హైదరాబాద్‌లో హెచ్‌జె దొర కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న ఎపి సిఎం చంద్రబాబు

## హెచ్ జె దొర కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎపి సిఎం చంద్రబాబు

**విజయవాడ,మార్చి15,ప్రభాతవార్తప్రతినిధి:**ఇటీవల మృతి చెందిన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ డీజీపీ హెచ్ జే దొర కుటుంబ సభ్యులను ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు పరామర్శించారు. హైదరాబాద్ లోని ఆయన నివాసానికి వెళ్లిన ముఖ్యమంత్రి.. దొర చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఉమ్మడి రాష్ట్రంలో ఏపీ పోలీసు విభాగంలో కీలక బాధ్యతల్లో పని చేసిన ఆ శాఖను ఉన్నత శిఖరాలపై నిలిపేందుకు హెచ్ జే దొర చేసిన కృషిని గుర్తుచేసారు.

# పుట్టా మహేశ్ వ్యవహారంపై సిఎం చంద్రబాబు తీవ్ర ఆగ్రహం

### ఆయనకు నోటీసులివ్వాలని ఎపి టిడిపి అధ్యక్షుడికి, పార్లమెంటరీ పార్టీ నేతకు ఆదేశం

### పార్టీ కార్యక్రమాలకు దూరం పెట్టాలని ఆదేశం

**విజయవాడ,మార్చి 15,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ పుట్టా మహేశ్ వ్యవహారంపై ఏపీ సీఎం చంద్రబాబు తీవ్ర అసహనాన్ని వ్యక్తం చేసారు. డ్రగ్స్ అంశంలో పుట్టా ఈ స్థాయిలో ఆరోపణలు ఎదుర్కోవడం చాలా ఆందోళన కలిగించే విషయమని వ్యాఖ్యానించారు. పార్టీ కార్యకలపాల్లోగాను. ప్రభుత్వ అంశాల్లోగాని పుట్టా పాల్గొనకూడదని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఆ దిశలో ఆయన టీడీపీ పార్లమెంటరీ పార్టీ నాయకుడు లావు కృష్ణదేవరాయులకు, ఏపీ టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఆదేశాలు జారీ చేసారు. పుట్టాపై ఉన్న అభియోగాలు చట్టపరంగా పరిష్కారమయ్యే వరకు ఆయన అధిష్టానం ఆదేశాలకు అనుగుణంగా వ్యవహరించాలని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. మొయినాబాద్ డ్రగ్స్ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ వ్యవహారంపై ఏపీ సీఎం చంద్రబాబు ఈ వ్యవహారంపై ఆరా తీసారు. ఆ వెంటనే మహేశ్‌పై వచ్చిన ఆరోపణలను చంద్రబాబు సీరియస్ అంశంపై పరిగణించాలన్నారు. పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండాలని ఎంపీ మహేష్‌ను పార్టీ అధిష్ఠానం ఆదేశించింది. ఆరోపణలకు సంబంధించి వివరణ కోరుతూ పుట్టా మహేశ్‌కు నోటీసులు ఇవ్వాలని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌ను చంద్రబాబు ఆదేశించారు ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ డ్రగ్స్ కేసులో పట్టుబడిన అంశంపై నివేదిక ఇవ్వాలని పల్లా శ్రీనివాస్‌ను సీఎం చంద్రబాబు ఆదేశించారు డ్రగ్స్ వంటి ఘటనల్లో ఎవరు ఉన్నా ఉపేక్షించేది లేదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. వ్యక్తులు, నేతలు చేసే తప్పులకు పార్టీ నష్టపోయే పరిస్థితి రానివ్వనని సీఎం చంద్రబాబు తేల్చి చెప్పారు. డ్రగ్స్ కేసులో అరెస్టైన పుట్టా మహేశ్‌కు స్టేషన్ బెయిల్ లభించడంతో విడుదలయ్యారు.

## చంచల్‌గూడ జైలుకు రోహిత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, మార్చి15:**రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపిన మొయినాబాద్ డ్రగ్స్ కేసులో విచారణను పోలీసులు వేగవంతం చేశారు. ఫామ్‌హౌస్‌లో డ్రగ్స్ పార్టీలో పట్టుబడిన బిఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి, రితేష్ రెడ్డి, నమిత్ శర్మలను జడ్జి ముందు హాజరుపరిచారు. రోహిత్‌రెడ్డితో పాటు మిగతా ఇద్దరికి ఉప్పర్‌పల్లి మేజిస్ట్రేట్ 14 రోజుల పాటు రిమాండ్ విధించారు. దీంతో రోహిత్‌రెడ్డితో పాటు మిగతా ఇద్దరిని కూడా పోలీసులు చంచల్‌గూడ జైలుకు తరలించారు. మొయినాబాద్‌లో డ్రగ్స్ కేసులో ఇరురాష్ట్రాల రాజకీయ నాయకులు ఉండడం సంచలనంగా మారింది. ఈగిల్ బృందం జరిపిన పరీక్షల్లో తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి, ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ కుమార్, రితేశ్ రెడ్డి, నమిత్‌శర్మ, కౌశిక్, అర్జున్ రెడ్డిలకు పాజిటివ్ వచ్చిందని ఎస్పీ గిరిధర్ వెల్లడించారు. పాజిటివ్ వచ్చిన పైలట్ రోహిత్‌రెడ్డి(ఫామ్ హౌజ్‌ను దుర్వినియోగం చేసినందుకు), రితేష్‌రెడ్డి (అక్రమంగా రివాల్వర్ కలిగి ఉన్నందుకు), నమిత్‌శర్మ(రివాల్వర్‌తో కాల్పులు జరిపినందుకు) లను పోలీసులు ఉప్పర్‌పల్లిలో జడ్జిముందు హాజరుపరిచారు. ఆ ముగ్గురికి మెజిస్ట్రేట్ రిమాండ్ విధించడంతో చంచల్‌గూడ జైలుకు తరలించారు. ఫామ్‌హౌస్‌లో రోహిత్, టిడిపి ఎంపీ పుట్టా మహేశ్, రితేశ్, నమిత్ సహా మొత్తం 11 మంది డ్రగ్స్ కేసులో పట్టుబడ్డారు. ఇదిలా ఉండగా మహేశ్‌కు స్టేషన్ బెయిల్ లభించింది.

## పెద్ద పులి సంచారంపై హనుమాన్ బృందాలు అప్రమత్తం

### సురక్షితంగా బంధించేందుకు 10 బృందాలు : డిసిఎం పవన్

**విజయవాడ.మార్చి 15.ప్రభాతవార్తప్రతినిధి:** రాజమండ్రి పరిసర ప్రాంతాల్లో జనావాసాల మధ్య సంచరించి ప్రజలను భయభ్రాంతులకి గురి చేసిన పెద్ద పులి మరోసారి జనావాసాలకు సమీపంగా వస్తున్నట్టు అటవీ శాఖ అధికారులు గుర్తించారు. గత నెలలో కూర్మాపురం వద్ద బంధించి నిపుణుల సూచన మేరకు పులి మెడలో రేడియో కాలర్ వేసి సురక్షితంగా అటవీ ప్రాంతంలో వదిలిపెట్టగా అది తిరిగి జనావాసల వైపు అడుగులు వేస్తోంది. ఈ మేరకు అటవీశాఖ అధికారులకు రేడియో కాలర్ ట్రాకింగ్ సిస్టం నుంచి సందేశం అందగా, విషయాన్ని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి (అటవీ పర్యావరణ శాఖలు ) పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకువచ్చారు. విషయం తెలిసిన వెంటనే పవన్ కళ్యాణ్ "హనుమాన్" బృందాలను అప్రమత్తం చేయాలని అధికారులను ఆదేశించారు. పులి కదలికలను ఎప్పటికప్పుడు అంచనా వేసి దాన్ని సురక్షితంగా బంధించి విశాఖ జూ పార్క్ లో వదలాలని సూచించారు. అందుకోసం రాజమండ్రి చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ ఆధ్వర్యంలో 10 హనుమాన్ బృందాలను ప్రత్యేకంగా నియమించారు. పులి మెడలో ఉన్న రేడియో కాలర్ ట్రాకింగ్ సిస్టం సందేశాల ఆధారంగా పులి తిరిగి జనావాసాల మధ్యకు రాక ముందే సురక్షితంగా పట్టుకోవాలని తెలిపారు. పులి కదలికలపై సమీప ఆవాసాల ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ ప్రాణనష్టం, జంతు నష్టం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ మొత్తం ప్రక్రియ పర్యవేక్షణ బాధ్యతను పీసీసీఎఫ్ పి .వి. చలపతిరావుకి అప్పగించారు. ప్రజలు భయాందోళనకు గురి కావాల్సిన అవసరం లేదని, హనుమాన్ బృందాలు సమర్థవంతంగా పని చేస్తున్నాయని తెలిపారు.

## వారం - వర్జ్యం

16-03-2026, సోమవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఫాల్గుణమాసం, ఉత్తరాయణం
శిశిర ఋతువు, కృష్ణపక్షం, పూర్వాభాద్ర కార్తె
ద్వాదశి ఉ.9.38
ధనిష్ఠ పూర్తి
వర్జ్యం : ఉ.10.00-11.38
దు.మ. 12.41-1.29,
మ.3.06-3.54
రాహుకాలం - ఉ.7.30-9.00

## వార్తాఫలం

**మేషం:** ఉపయోగపడవని భావించిన పత్రములకు కొన్ని కీలక నిర్ణయముల వలన విలువ ఏర్పడుతుంది.

**వృషభం:** అన్ని రంగాలలోనూ అభివృద్ధి బాగుంటుంది. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని చేసే కార్యక్రమాలు ఉపయోగపడుతుంటాయి.

**మిథునం:** సంతృప్తికి మించినది లేదని నమ్ముతారు. ఇతరులకు బోధచేస్తారు. అందరి సలహాలు వింటారు. వాహనసౌఖ్యం.

**కర్కాటకం:** మీ మనస్సుకు తోచిందేచేస్తారు. బంధువులను కలిసి కష్టసుఖాలను పంచుకుంటారు. ప్రయాణాలు.

**సింహం:** ఇతరుల ఈర్ష్యా అసూయలు మీపై ప్రభావం చూపకుండా జాగ్రతలు పాటించండి. క్రయవిక్రయాలలో లాభాలు.

**కన్య :** చేపట్టిన పనులలో జాప్యం జరిగినా చివరికి పూర్తిచేస్తారు. కోపతాపాలకు దూరంగా ఉండటం మంచిది.

**తుల :** గృహోపకరణాలు, శుభకార్యాలు మొదలగు వాటికి అధికంగా ధనం ఖర్చుచేస్తారు. మిత్రుల కలయిక.

**వృశ్చికం:** దూరప్రాంతాల నుండి విలువైన సమాచారం అందుకుంటారు. జీవిత భాగస్వామి సలహాతో నూతన కార్యక్రమాలు చేపడతారు.

**ధనుస్సు:** ప్రత్యర్థుల పోటీదారుల నుండి ఊహించిన విధంగానే పోటీలు ఎదురవుతాయి. నూతన విద్యావకాశాలు.

**మకరం:** విద్యార్థినీ, విద్యార్థులు మేధస్సుకు పదును పెట్టి, విద్యాపరంగా అభివృద్ధిని సాధిస్తారు. మిత్ర వర్గం పెరుగుతుంది.

**కుంభం:** తాత్కాలిక అవసరాలకన్నా భవిష్యత్తుకు తత్సంబంధిత విషయ వ్యవహారాలకు ప్రాముఖ్యతనిస్తారు.

**మీనం:** రాజు కన్నా ! మొండివాడు బలవంతుడన్న సామెత గుర్తుకు వచ్చే విధంగా ప్రవరిస్తారు. వాహన సౌఖ్యం.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



# పుంగనూరులో గుండెలవిసే విషాదం

## బైక్ ఇంజిన్ నుంచి వెలువడిన విషవాయువు పీల్చి ఒకే కుటుంబంలో నలుగురు మృతి

మదనపల్లె క్రైమ్ మార్చి 15 ప్రభాతవార్త: అన్నమయ్య జిల్లా పుంగనూరు పట్టణంలోని త్యాగరాజు వీధిలో పెను విషాదం చోటుచేసుకుంది. అజాగ్రత్త ఒక నిండు కుటుంబాన్ని బలితీసుకుంది. ద్విచక్ర వాహనం నుంచి వెలువడిన కార్బన్ మోనాక్సైడ్ విషవాయువును పీల్చడంతో ఒకే ఇంట్లో నలుగురు మృతి చెందారు. త్యాగరాజు వీధికి చెందిన మురళి, రేవతి దంపతులు నివాసం ఉంటున్నారు. మురళి వృత్తిరీత్యా నాయి బ్రాహ్మణుడు. ఇటీవల ఆతను తన బజాజ్ సీటీ 100 బైక్‌ను రిపేర్ నిమిత్తం మెకానిక్ వద్దకు తీసుకెళ్లారు. ఇంజిన్ బోర్ చేయించిన అనంతరం రాత్రంతా వాహనాన్ని స్టార్టింగ్‌లో ఉంచాలని మెకానిక్ సూచించడంతో శనివారం రాత్రి బైక్‌ను ఇంటిలో స్టార్టింగ్ లో ఉంచాడు. ఆ గదిలో తండ్రి రామచంద్రయ్య (75), కుమారుడు కార్తీక్ (14), కవల కుమార్తెలు చరిత (7), చందన (7) లు నిద్రిస్తుండగా గది తలుపులు మూసి మురళి దంపతులు మిద్దె పైన మరో గదిలో నిద్రించడానికి వెళ్లారు. ఇల్లు చాలా ఇరుగ్గా ఉండటం, గాలి బయటకు వెళ్లే మార్గం లేకపోవడంతో బైక్ సైలెన్సర్ నుంచి వెలువడిన కార్బన్ మోనాక్సైడ్ గది అంతా వ్యాపించింది. గదిలో నిద్రిస్తున్న రామచంద్రయ్య, కార్తీక్, చరిత, చందన ఆ విషవాయువును పీల్చి ఊపిరాడక వారు నిద్రలోనే ప్రాణాలు విడిచారు. మురళి, రేవతి దంపతులు ఇంటి పైన ఉన్న గదిలో పడుకోవడంతో వారు ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. ఉదయం కిందకు వచ్చి చూసేసరికి నలుగురు అపస్మారక స్థితిలో పడి ఉండటంతో నిర్ఘాంతపోయారు. బండి సైలెన్సర్ నుంచి వచ్చే విషవాయువు నలుగురు ప్రాణాలు తీస్తుందని గ్రహించక చేసిన పొరపాటుకు ఆ దంపతులు కన్నీరు మున్నీరుగా విలపించారు. సమాచారం అందుకున్న పుంగనూరు పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాలను పరిశీలించి, క్లూస్ టీమ్ ద్వారా ఆధారాలు సేకరిస్తున్నారు. మూసి ఉన్న గదిలో పెట్రోల్ వాహనాన్ని ఎక్కువ సేపు స్టార్ట్ చేసి ఉంచడం వల్లే ఈ ఘోరం జరిగిందని ప్రాథమికంగా నిర్ధారించారు. ఒకే కుటుంబంలో నలుగురు మృతి చెందడంతో త్యాగరాజు వీధిలో విషాద ఛాయలు అలముకున్నాయి. ఏడేళ్ల కవల ఆడపిల్లలు చరిత, చందనల మృతి స్థానికులను కలచివేస్తోంది. నిన్నటి వరకు ఆ వీధిలో సందడి చేసిన ఆ చిన్నారి పాపలు, ఇప్పుడు విగతజీవులుగా పడి ఉండటం చూసి త్యాగరాజు వీధి కన్నీరుమున్నీరవుతోంది. వృద్ధాప్యంలో కొడుకుకు తోడుగా ఉండాల్సిన తండ్రి, చేతికి అందివచ్చిన కొడుకు, కళ్లముందు తిరిగే ఆడబిడ్డలు.. ఇలా ఒకేసారి నలుగురు దూరమవ్వడంతో ఆ ఇంట్లో విషాద ఛాయలు అలముకున్నాయి. మృతదేహాలను పుంగనూరు ఆసుపత్రికి తరలించిన పోలీసులు శవ పరీక్షలు అనంతరం కుటుంబ సభ్యులు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పుంగనూరు సిఐ తెలిపారు.

## 20న తిరుమలకు సిఎం చంద్రబాబు

- 21న మనవడు దేవాన్ష్ పేరున విరాళాలు



తిరుమల, మార్చి 15 ప్రభాతవార్త ప్రతినిధి: ముఖ్యమంత్రి చంద్రబాబు కుటుంబంతో కలసి 20వతేదీ శుక్రవారం సాయంత్రం తిరుమలకు రానున్నట్లు సమాచారం. 21న మనవడు నారా దేవాన్ష్ పుట్టినరోజు సందర్భంగా కుటుంబ సభ్యులు భువనేశ్వరి, కుమారుడు, మంత్రి లోకేశ్, కోడలు బ్రాహ్మణి, మనవడు దేవాన్ష్ ఇతర కుటుంబ సభ్యులతో కలసి కులదైవమ్ శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకోనున్నారు. ఆ తరువాత మాతృశ్రీ తరిగొండ వెంగ మాంబ అన్నప్రసాద భవనంకు చేరుకుని రూ.44లక్షల విరాళాలం దిస్తారు. ఆ రోజంతా దేవాన్ష్ పేరున భక్తులకు అన్న ప్రసాద వితరణ చేయనున్నారు. ఇందులో స్వయంగా సిఎం చంద్రబాబు కుటుంబం పాల్గొని భక్తులకు అన్నప్రసాదం వితరణ చేస్తారు. చంద్రబాబు పర్యటనకు తిరుమల పద్మావతి అతిథిగృహంలో పూర్తిస్థాయిలో ఏర్పాట్లు, భద్రతను కట్టుదిట్టం చేస్తున్నారు. 21న తిరుమలలోనే సిఎం టిటిడి అభివృద్ధిపై, తిరుమల విజన్ 2047 పనితీరుపై సమీక్షించే అవకాశం ఉంటుందని తెలుస్తోంది.

## 69 లక్షల మంది రైతులకు కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలు

### ప్రభుత్వం టెండర్ ఉత్తర్వులు జారీ



రాజంపేట, మార్చి 15 ప్రభాత వార్త: రాష్ట్రంలో కొత్త పట్టాదార్ పాస్ పుస్తకాలు రైతులకు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎట్టకేలకు ముందడుగు వేసింది. పూర్తి సెక్యూరిటీ ఫీచర్లతో, దొంగ పాస్ పుస్తకాలు రాకుండా ప్రతి రైతుకు సంబంధించిన పూర్తి వివరాలతో పట్టాదార్ పాస్ పుస్తకాలు అందజేస్తామని ఇప్పటికే సిఎం చంద్రబాబు పలుమార్లు ప్రకటించిన విషయం తెలిసిందే. తాజాగా రాష్ట్రవ్యాప్తంగా 69.83 లక్షల మంది రైతులకు పట్టాదార్ పాస్ పుస్తకాలు అందజేసేందుకు ఆదివారం రెవెన్యూ శాఖ టెండర్ ఉత్తర్వులు జారీ చేసింది. సిసిఎల్ఏ రాష్ట్ర అడిషనల్ సెక్రటరీ జె.వెంకట మురళి ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. టెండర్ల ప్రక్రియ సోమవారం నుంచి ప్రారంభం అవుతుందని ఉత్తర్వులలో పేర్కొన్నారు. వైసిపి హయంలో అప్పటి సిఎం జగన్మోహన్ రెడ్డి ఫోటోలతో రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేశారు. దీన్ని టిడిపి పూర్తిగా వ్యతిరేకించింది. ఒకరి ఆస్తుల పై సిఎం ఫోటోలు ఏమిటని విమర్శించింది. దీనికి తోడు దొంగ పాస్ పుస్తకాల ముద్రణ, అసమగ్ర సమాచారం ఉండడంతో చంద్రబాబు నాయకత్వంలోని కూటమి సర్కార్ పూర్తి వివరాలతో కొత్త పాస్ పుస్తకాలు అందించేందుకు నిర్ణయం తీసుకుంది. రాష్ట్రములోని 28 జిల్లా కేంద్రాలకు కొత్త పాస్ పుస్తకాలను సరఫరా చేసేలా టెండర్లను పిలిచింది.

## అత్యుత్తమ ఫలితాలు సాధించండి

### బిసి హాస్టళ్ళు, ఎంజెపి స్కూళ్ళ విద్యార్థులకు మంత్రి సవిత పిలుపు



సచివాలయం, మార్చి 15 ప్రభాతవార్త: నేటి నుంచి ప్రారంభం కానున్న 10వ తరగతి పరీక్షలకు హాజరయ్యే బిసి హాస్టళ్ళు, ఎంజెపి స్కూళ్ళ విద్యార్థులకు రాష్ట్ర బిసి, ఇడబ్ల్యుఎస్ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత శుభా కాంక్షలు తెలిపారు. ఎలాంటి ఆందోళనకు, మానసిక ఒత్తిడికి గురికావద్దని, మానసిక ప్రశాంతతో పరీక్షలు రాసి, అత్యుత్తమ ఫలితాలు రాబట్టాలని పిలుపు నిచ్చారు. 13,604మంది బిసి హాస్టళ్ళు, ఎంజెపి స్కూళ్ళ విద్యార్థులు హాజరవు తున్నారని వారిలో బిసి హాస్టళ్ళ విద్యార్థులు 8,068 మంది, ఎంజెపి స్కూళ్ళ విద్యార్థులు 5,536మంది ఉన్నారన్నారు. 10వ తరగతి విద్యార్థుల కోసం కూటమి ప్రభుత్వం ఉచిత బస్సు సౌకర్యం కల్పించిం న్నారు. పరీక్షా కేంద్రాలకు హాల్ టిక్కెట్‌తో ముందుగాను చేరుకోవాలన్నారు. విద్యార్థులకు ఆరోగ్య భద్రతతో కూడిన విద్య అందించడమే సిఎం చంద్రబాబు నాయుడు లక్ష్యమన్నారు. గతేడాది ఎంజెపి స్కూళ్ళ ద్యార్థులు 10 పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించారన్నారు. ఈ ఏడాది కూడా ఎంజెపి విద్యార్థులు, బిసి హాస్టళ్ళ విద్యార్థులు వందశాతం మేర ఉత్తీర్ణత శాతం సాధించి కూటమి ప్రభుత్వ లక్ష్యాలను నెరవేర్చాలని మంత్రి ఆకాంక్షించారు. డిబిసిడబ్ల్యుఓలు, ఇతర సిబ్బంది పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల వెంటే ఉండాలని, పరీక్షలు అవ్వగానే వారిని తిరిగి హాస్టళ్ళకు, ఎంజెపి స్కూళ్ళకు క్షేమంగా తీసుకురావాలని మంత్రి సవిత ఆదేశించారు.

## ఉజ్వల భవితకు బీజం వేసేవి టెన్త్ పరీక్షలు

### - కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు



శ్రీకాకుళం, మార్చి 15 ప్రభాతవార్త: పదవ తరగతి పరీక్షల్లో విద్యార్థులు అందరూ మంచి ఉత్తీర్ణత సాధించాలని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు కోరారు. పదవ తరగతి పరీక్షలు అంటే బాల, బాలికలకు ఎప్పుడూ ప్రత్యేకమే అని, తొలిసారి ఓ పోటీ పరీక్ష స్థాయి హడావిడి ఉండటం సహజం అని అన్నారు. సమయాని కన్నా ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకుని ఎలాంటి ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా పరీక్షలను రాయాలని తెలిపారు. వేసవి ఎండల దృష్ట్యా ఆరోగ్యంపై ఎలాంటి ప్రభావం చూపకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. పరీక్షల సమయంలో తగిన నిద్ర, మంచి ఆహారం ఉండేలా తల్లితండ్రులు చూసుకోవాలని అన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద కూడా త్రాగునీటి సదుపాయం పూర్తిగా ఉండేలా చూడాలని జిల్లా విద్యా శాఖ అధికారులకు తెలిపారు. శ్రీకాకుళం జిల్లాలో పరీక్షా నిర్వహణ తీరును జిల్లా విద్యా శాఖ అధికారితో చరవాణిలో సమీక్ష నిర్వహించి అడిగి తెలుసుకున్నారు. మొత్తంగా 145 కేంద్రాలలో 28,598 మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్ష రాస్తున్నట్టు కేంద్ర మంత్రికి వివరించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది రాకుండా ప్రశాంత వాతావరణం ఏర్పాటు చెయ్యాలని రామ్మోహన్ నాయుడు కోరారు. జిల్లాలోని విద్యార్థులు అందరూ తమ ఉజ్వల భవిష్యత్‌కు బీజం వేసే ఎస్.ఎస్.సి పరీక్షలలో మంచి ఉత్తీర్ణత సాధించి రాష్ట్ర స్థాయిలో పేరు నిలబెట్టాలని ఆకాంక్షించారు.

## ఓటర్ల జాబితా సవరణ నిరంతర ప్రక్రియ

### - బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్. మాధవ్



విజయవాడ, మార్చి 15 ప్రభాతవార్త ప్రతినిధి: ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) అనేది ప్రతి ఏటా జరిగే నిరంతర ప్రక్రియ అని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్. మాధవ్ స్పష్టం చేశారు. కొత్త ఓటర్ల నమోదు, అభ్యంతరాల తొలగింపు ప్రక్రియ జరుగుతూ ఉంటుందన్నారు. ఆదివారం విజయవాడలో ఎస్ఐఆర్‌పై ఎపి బిజెపి ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి వర్క్ షాప్ జరిగింది. ఈ సందర్భంగా మాధవ్ మాట్లాడుతూ ఎస్ఐఆర్ అనేది బిజెపి లేదా కేంద్ర ప్రభుత్వం కొత్తగా తెచ్చిన పథకం కాదని తెలిపారు. ఇది 2002 నుండి అమల్లో ఉందని గుర్తు చేశారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కూడా ఇది జరిగిందని వివరించారు. ఈసారి ఆధునిక టెక్నాలజీ వినియోగించడం వల్ల ఓటర్ల జాబితాలో అనర్హుల తొలగింపు ప్రక్రియ పారదర్శకతతో జరుగుతోందని చెప్పారు. బీహార్ ఎన్నికల సమయంలో దీనిపై పెద్ద ఎత్తున చర్చ జరిగిందని గుర్తు చేశారు. ప్రతిపక్షాలు దీనిపై అనవసర రాద్ధాంతం చేశాయని చెప్పుకొచ్చారు. పార్లమెంటులో ఈ అంశంపై స్పష్టతనిస్తూ ప్రతిపక్షాల విమర్శలను కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా తిప్పికొట్టారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ప్రధానంగా ఎస్ఐఆర్‌పై చర్చించామన్నారు. న్యూఢిల్లీలోని ఎలక్షన్ కమిషనర్ కార్యాలయం ముందు గత మూడు రోజులుగా ధర్నా జరుగుతోందని తెలిపారు. ఇప్పటికే నాలుగు రాష్ట్రాల్లో ఈ ప్రక్రియ పూర్తయిందని, మరో 22 రాష్ట్రాల్లో ఏప్రిల్ 1వ తేదీ నుంచి ఈ మహత్తర కార్యక్రమం ప్రారంభం కాబోతుందని చెప్పారు.

## ఎంపి పుట్టా మహేశ్ రాజీనామా చేయాలి

### - మాజీ మంత్రి, వైసిపి నేత కాకాణి గోవర్ధన్

విజయవాడ, మార్చి 15 ప్రభాతవార్త ప్రతినిధి: డగ్స్ పార్టీలో పట్టుబడిన ఏలూరు టిడిపి ఎంపి పుట్టా మహేశ్‌కు పదవిలో కొనసాగే నైతిక అర్హత లేదని వైసిపి నేత, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శించారు. తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. పుట్టా మహేశ్‌ను రక్షించడానికి స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబే రంగంలోకి దిగారని, డ్రగ్స్ మాఫియాను ఆయనే పెంచి పోషిస్తున్నారని ఆరోపించారు. సామాన్యుడికి ఒక రూల్, ప్రజాప్రతినిధికి మరో రూల్ ఉండకూడదని ఆయన స్పష్టం చేశారు. హైదరాబాద్ శివారు మొయినాబాద్‌లోని బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డికి చెందిన ఫామ్‌హౌస్‌లో జరిగిన వీకెండ్ పార్టీలో డ్రగ్స్ కలకలం సృష్టించిన సంగతి తెలిసిందే. ఈ పార్టీలో పుట్టా మహేశ్ డ్రగ్స్ తీసుకున్నట్లు ఈగిల్ ఫోర్స్ పోలీసులు అధికారికంగా ప్రకటించారు. ఈ ఘటన ఎపి రాజకీయాల్లో పెద్ద దుమారం రేపింది. ఈ నేపథ్యంలో కాకాణి మాట్లాడుతూ, 'చంద్రబాబు బ్రాండ్ అంటేనే డ్రగ్స్ బ్రాండ్' అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

## పార్లమెంటరీ సభ్యత్వాన్ని రద్దు చేయాలి

### - సిపిఐ(యం) రాష్ట్ర కమిటీ డిమాండ్

విజయవాడ, మార్చి 15 ప్రభాతవార్త ప్రతినిధి: హైదరాబాద్ శివారులోని ఫామ్‌హౌస్‌లో డ్రగ్స్ కేసులో పట్టుబడిన ఏలూరు ఎంపి పుట్టా మహేష్‌కుమార్ యాదవ్ పార్లమెంటరీ సభ్యత్వాన్ని రద్దు చేయాలని సిపిఐ(యం) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. దీనికి సంబంధించి ఆదివారం సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఓ ప్రకటన విడుదల చేశారు. మహేష్‌కుమార్‌పై తెలుగుదేశం పార్టీ చర్య తీసుకొని డ్రగ్స్ నివారణలో తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని సిపిఐ(యం) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేస్తున్నదని పేర్కొన్నారు. బాధ్యతాయుత ఎంపీ స్థానంలో ఉన్న పుట్టా మహేష్ డ్రగ్స్ పార్టీలో పాల్గొనడం ద్వారా తన పదవిని దుర్వినియోగం చేశారని ధ్వజమెత్తారు. తక్షణం ఆయనను పార్లమెంటరీ సభ్యత్వానికి అనర్హుడిగా ప్రకటించాలని కేంద్ర ప్రభుత్వాన్ని సిపిఐ(యం) డిమాండ్ చేస్తున్నదని పేర్కొన్నారు. డ్రగ్స్ నియంత్రిస్తున్నామని ప్రచారం చేసుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం తమ పార్టీకి చెందిన ఎంపీ డ్రగ్స్ సేవించినట్లు తెలంగాణా పోలీసులు నిర్ధారించడంపై రాష్ట్ర ప్రజలకు వివరణ ఇవ్వాలని కోరారు.

## ఎంపి పుట్టా మహేష్‌పై చర్యలు తీసుకోండి



విజయవాడ, మార్చి 15 ప్రభాతవార్త ప్రతినిధి: మొయినాబాద్ డ్రగ్స్ పార్టీలో ఏలూరు ఎంపి పుట్టా మహేష్ దొరకడం సిగ్గుచేటని పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అభిప్రాయపడ్డారు. ఆయనను తక్షణం అరెస్ట్ చేయాలన్నారు. ఈ మేరకు ఆమె ఒక ప్రకటన విడుదల చేసారు. ఢిల్లీలో పార్లమెంట్ జరుగుతుంటే ఈ ఎంపి ఇక్కడ కొకైన్‌తో విందు చిందు చేస్తున్నాడన్నారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉండి ఇదెక్కడి భాద్యతారాహిత్యం? అని ప్రశ్నించారు. డ్రగ్స్ టెస్ట్‌లో పాజిటివ్ వచ్చింది కదా.. ఇప్పుడు చంద్రబాబు ఎం చర్యలు తీసుకుంటారు? డ్రగ్స్ తీసుకుంటూ పట్టబడ్డ ఎంపి సమాజానికి ఏం మెసేజ్ ఇస్తున్నాడు? యువత డ్రగ్స్ వాడాలని ఎంపి ఎంకరేజ్ చేస్తున్నారా? అని షర్మిల ప్రశ్నించారు. ఓట్లేసి గెలిపించిన ఏలూరు ప్రజలకు ఎంపి ఏం సమాధానం చెప్తారు? ఎంపీ పదవి నుంచి పుట్టా మహేష్‌ను వెంటనే తొలగించాలన్నారు. సిఎంకు చిత్తశుద్ధి ఉంటే ఎంపిని పార్టీ నుంచి వెంటనే సస్పెండ్ చేయాలన్నారు. డ్రగ్స్‌పై నిజంగా ఉక్కుపాదం మోపితే ఎంపిపై చర్యలు తీసుకొని చంద్రబాబు చిత్తశుద్ధి నిరూపించుకోవాలన్నారు.

## గో హత్యల నివారణకు మే 3 నుండి ఆమరణ దీక్ష

### - యుగ తులసి ఫౌండేషన్ ఛైర్మన్ శివకుమార్

తిరుమల, మార్చి 15 ప్రభాతవార్తప్రతినిధి: దేశవ్యాప్తంగా గోసం రక్షణతో బాటు గోహత్యల నివారణే ధ్యేయంగా యుగ తులసి ఫౌండేషన్ కృతనిశ్చయంతో పనిచేస్తోందని ఛైర్మన్ శివకుమార్ వెల్లడించారు. గో హత్య నివారించాలని ప్రధాన ఆశయంతో తెలంగాణలో గోవధను పూర్తిగా నిషేధించాలని డిమాండ్ చేస్తూ ఖైరతాబాద్‌లోని త్రిశక్తి హనుమాన్ దేవాలయంలో మే 3వ తేదీ నుండి ఆమరణ నిరాహార దీక్ష చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ ధర్మ పోరాటంలో విజయం చేకూరాలని, గోమాతను రాజ్యమాతగా గుర్తించాలని కోరుతూ ఆదివారం ఉదయం శ్రీవారి పాదాల చెంత సంకల్పం చేసుకున్నానన్నారు. 'గోమాత రక్షణ కోసం నా ప్రాణాలైనా అర్పించ డానికి సిద్ధంగా ఉన్నా, ఈ ఆమరణ దీక్ష ప్రభుత్వం కళ్ళు తెరిపించే వరకు కొనసాగుతుందని శివకుమార్ తెలిపారు. ఆదివారం టిటిడి మాజీ బోర్డు సభ్యుడు, యుగతులసీ ఫౌండేషన్ వ్యవస్థాపక ఛైర్మన్ శివకుమార్ అనుచరులు మదన్‌రెడ్డి, జనార్ధన్ రావు, బలవంత్ రెడ్డి, జితేందర్ రెడ్డి, వనిత రెడ్డితో కలసి తిరుమలకు చేరుకున్నారు. శ్రీ వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు.



## శేషాచలం అడవులు జీవవైవిధ్యం నిలయం

తిరుమల, మార్చి 15 ప్రభాతవార్త ప్రతినిధి: శేషాచలం కొండలు నిలయమైన రాయలసీమ జిల్లాల్లోని తిరుమలగిరులు అరుదైన జీవవైవిధ్యానికి నిలయంగా మారాయి. ప్రపంచంలోనే అత్యంత విలువైన ఎర్రచందనం సంపద విస్తారంగా ఉంది. ఈ అడవిలో ఎర్రచందనం, చందనం వృక్షాలు సహజంగా పెరిగేవిగా గుర్తింపు పొందాయి. పలురకాల వృక్ష జంతుజాతులకు నిలయంగా మారింది. చిరుతలు, జింకలు, విషసర్పాలు, తోడేళ్లు, రేసు కుక్కలు, పునుగు పిల్లులు, అడవి ఉడతలు, పచ్చనాగుపాము, ఔషధ వృక్షాలు, మొక్కలు, సరీసృపాలు, సెలయేళ్ళు వంటివి ఈ శేషాచలంలో ప్రకృతి సౌందర్యం. శేషాచలం అడవులు తిరుమలలోని అవ్వాచారికోన, మామండూరు, కాకులకోన, గరుడాద్రివనం పేర్లతో అరుదైన వృక్షాలు, ఔషధమొక్కలను సంరక్షణకు టిటిడి ఇప్పటికే రూ4.25 కోట్లు వెచ్చించి దివ్యఔషధవనాన్ని అభివృద్ధి చేస్తోంది. ఇందులో పలు రకాల ఔషధవృక్షాలు ఉంటాయి. తిరుమలలో పాపవినాశనం, గోగర్భమ్, శిలాతోరణం, శ్రీవారి పాదాలు ప్రాంతాల్లో వనాలను అభివృద్ధి చేస్తున్నారు.

## వివేకా హత్య కేసులో భారతిని విచారించాలి

- సిబిఐ దర్యాప్తుపై సునీతారెడ్డి అసంతృప్తి
- కీలక ఆధారాలను కూడా పట్టించుకోలేదు
- అందరూ మాకు అన్యాయం చేశారని ఆవేదన




పులివెందుల, మార్చి 15 ప్రభాతవార్త: మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సిబిఐ) లోతుగా విచారణ చేపట్టలేదని, కీలక ఆధారాలను కూడా పట్టించుకోలేదని ఆయన కుమార్తె వైఎస్ సునీత రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. ఆదివారం వైఎస్ వివేకానంద రెడ్డి 7వ వర్ధంతి సందర్భంగా పులివెందుల పట్టణంలోని వివేకా సమాధి వద్ద కుటుంబ సభ్యులతో కలిసి ఆమె ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి నివాళులు అర్పించారు. అనంతరం మీడియా సమావేశంలో సునీతరెడ్డి తన తండ్రి హత్య కేసుకు సంబంధించిన ఆధారాలను ప్రజెంటేషన్ రూపంలో వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, హత్య కేసులో కీలక నిందితులపై తాను పలుమార్లు వివరాలు చెప్పినా సిబిఐ వాటిని సీరియస్‌గా తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. హత్యకు ముందు, తరువాత నిందితుల మధ్య జరిగిన ఫోన్ సంభాషణలు, సందేశాలు చాలా కీలకమని, ముఖ్యంగా కిరణ్ యాదవ్ హత్యకు ముందు మరియు తర్వాత అనేక మందితో ఫోన్‌లో మాట్లాడినట్టు ఆధారాలు ఉన్నాయని తెలిపారు. సాక్షి పత్రికలో వివేకానంద రెడ్డి గుండెపోటుతో మరణించారని వార్త రావడానికి ఒక నిమిషం ముందు కిరణ్ యాదవ్‌కు అర్జున్ రెడ్డి మెసేజ్ పంపినట్లు తాను సిబిఐకి వివరాలు అందజేసినప్పటికీ వాటిపై సరైన విచారణ జరగలేదన్నారు. కిరణ్ యాదవ్ ఇచ్చిన స్టేట్‌మెంట్‌ను రాసుకుని వచ్చారని మాత్రమే భావించి సిబిఐ విచారణ ముగించిందని, నిందితుల మధ్య హత్య అనంతరం జరిగిన ఫోన్ కాల్స్, మెసేజ్‌లను కూడా సమగ్రంగా పరిశీలించలేదని ఆరోపించారు. ఈ కేసులో మరిన్ని ఆధారాలు సమర్పించాలని కోరినప్పుడు తన వద్ద ఉన్న అదనపు ఆధారాలను కోర్టుకు, సిబిఐకి కూడా అందజేసినప్పటికీ వాటిపైనా విచారణ జరగలేదని సునీత పేర్కొన్నారు. కేసులో పూర్తి నిజాలు బయటపడాలంటే మాజీ సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి సతీమణి వైఎస్ భారతిని విచారించాలని ఆమె డిమాండ్ చేశారు. తండ్రి హత్యకు న్యాయం కోసం తాను ఈ స్థాయిలో పోరాడుతున్నప్పటికీ ఇప్పటికీ న్యాయం జరగలేదని, అందరూ నాకు అన్యాయం చేశారని అయినప్పటికీ తన పోరాటం చివరి వరకు కొనసాగుతుందని సునీత రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్ర మంలో సునీత భర్త రాజశేఖర్ రెడ్డి, వైఎస్ ప్రతాప్ రెడ్డి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## తిరుమల సమాచారం



## తిరుమలేశునికి రెండు బ్రహ్మోత్సవాలు

- సెప్టెంబర్ 15నుండి సాలకట్ల బ్రహ్మోత్సవాలు
- అక్టోబర్ 12నుండి నవరాత్రి బ్రహ్మోత్సవాలు

తిరుమల, మార్చి 15 ప్రభాతవార్త ప్రతినిధి: కలియుగ వైకుంఠం తిరుమల క్షేత్రంపై కొలువైన ఏడుకొండల వేంకటేశ్వరస్వామికి ఈ ఏడాది రెండు బ్రహ్మోత్సవాలు టిటిడి నిర్వహించనుంది. నిత్యం ఎన్నో రకాల సేవలు, కైంకర్యాలు దేవదేవునికి జరుగుతుంటాయి. సంవత్సరానికోసారి జరిగే తొమ్మిదిరోజుల బ్రహ్మోత్సవాలకు ఎంతో ప్రాముఖ్యత వుంది. ఈ ఏడాది అధికమాసం రావడంతో శ్రీవారికి రెండు బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. చాంద్రమానం ప్రకారం ప్రతి మూడవ సంవత్సరం అధికమాసం వస్తుంది. ఇలా వచ్చిన సందర్భంలో కన్యామాసం (భాద్రపదంలో) సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవం, ఆశ్వయుజంలో దసరా నవరాత్రుల్లో నవరాత్రి బ్రహ్మోత్సవాలు టిటిడి నిర్వహిస్తుంది. సెప్టెంబర్ 15వ తేదీ మంగళవారం నుండి 23వ తేదీ బుధవారం వరకు సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలు, తిరిగి అక్టోబర్ 12వ తేదీ సోమవారం నుండి 20వ తేదీ మంగళవారం వరకు నవరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహించేలా తిరుమల తిరుపతి దేవస్థానం ఆగమసలహామండలి, అర్చకులు నిర్ణయించారు. ఆలయ మాఢవీధుల్లో వాహన సేవలను, నిత్యకైంకర్యాలను అర్చకస్వాములు వేదమంత్రోచ్చరణల నడుమ వైఖానస ఆగమోక్తంగా జరిపించేందుకు ముహూర్తం ఖరారుచేశారు. ప్రతి ఏడాది శ్రీవారి బ్రహ్మోత్సవాలకు లక్షలమంది భక్తులు దేశవిదేశాల నుంచి ఏడుకొండలకు చేరుకుని వివిధ అలంకారాలలో పలు వాహనాలపై వేంచేసి భక్తకోటికి దర్శనమిచ్చే ఆపదమొక్కుల వాడిని కన్నులారా వీక్షించి ముగ్ధులవుతారు. బ్రహ్మోత్సవాలు జరిగే అన్ని రోజుల్లో సర్వదర్శనం మినహాయించి మిగిలిన అన్ని ఆర్జితసేవలు, ప్రత్యేక దర్శనాలు రద్దుచేస్తారు. సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలకు సెప్టెంబర్ 14వ తేదీ సోమవారం సాయంత్రం అంకురార్పణం, 15న సాయంత్రం ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుడతారు. ప్రతిరోజూ ఉదయం వాహనసేవ 8గంటలకు ప్రారంభమవుతుంది. రాత్రి వాహనసేవ 7గంటలకు జరిపిస్తారు. తొలివాహన సేవగా 15వ తేదీ రాత్రి పెద్దశేషవాహన సేవ మొదలవుతుంది. సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో సెప్టెంబర్ 19వ తేదీ శనివారం గరుడవాహన సేవ, 22న రథోత్సవం, 23న చక్రస్నాన మహోత్సవం ముఖ్య ఘట్టాలు. అలాగే నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో ధ్వజారోహణం, ధ్వజావరోహణం ఉండవు. అక్టోబర్ 11వ తేదీ ఆదివారం రాత్రికి అంకురార్పణ, 12వ తేదీ సోమవారం బంగారుతిరుచ్చితో బ్రహ్మోత్సవాలు ఆరంభమవుతాయి. తొలివాహనంగా పెద్దశేషవాహన సేవ ఊరేగనుంది. అక్టోబర్ 16వ తేదీ శుక్రవారం గరుడసేవ జరగనుంది. 17న పుష్పకవిమానం, 19న స్వర్ణరథం, 20న ఉదయం చక్రస్నానంతో ముగుస్తాయి. టిటిడి బోర్డు, టిటిడి అధికారులు అన్ని ఏర్పాట్లు చేసేలా ప్రణాళికలు రూపొందించుకుంటారు.



## రేపు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

### నేడు విఐపి బ్రేక్ సిఫార్సులు తేవద్దు... రేపు బ్రేక్ దర్శనాలు రద్దు

తిరుమల, మార్చి 15 ప్రభాతవార్త ప్రతినిధి: తెలుగునూతన సంవత్సరం ఉగాది పర్వదినం పురస్కరించుకుని రేపు మంగళవారం తిరుమల ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో జరిగే అష్టదళపాద పద్మారాధన సేవ, విఐపి బ్రేక్ రద్దుచేశారు. నేడు బ్రేక్ దర్శనాలకు సిఫార్సులు తేవద్దని టిటిడి విజ్ఞప్తి చేసింది. రేపు విఐపి బ్రేక్ దర్శనం రద్దయ్యింది. ఈనెల 19న గురువారం తెలుగు నూతన సంవత్సరం "పరాభవనామ" ఉగాది పర్వదినం పురస్కరించుకుని ముందు వచ్చే మంగళవారం రేపు ఉదయం ఆగమోక్తంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం చేపట్టనున్నారు. టిటిడి పాలకమండలి పెద్దలు, ఆలయ అర్చకులు, అధికారులు మహాయజ్ఞులా ఈ కార్యక్రమంలో పాల్గొని ఆలయం అంతటా సుగంధపరిమళ ద్రవ్యంతో శుద్ధి చేస్తారు. ఏడాదిలో నాలుగుసార్లు ఉగాది ఆస్థానం, ఆణివార ఆస్థానం, బ్రహ్మోత్సవాలు, వైకుంఠ ఏకాదశి పర్వదినాల ముందు మంగళవారాల్లో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం విశేషం.

**రెండు రోజులు బ్రేక్‌కు సిఫార్సులు తేవద్దండి:** తిరుమలలో 19వతేదీ ఉగాది పర్వదినం ఆస్థానం శాస్త్రోక్తంగా జరగనుంది. రేపు ఆలయ శుద్ధి కార్యక్రమంతో విఐపి బ్రేక్ దర్శనాలు రద్దయ్యాయి. ఈ సందర్భంగా నేడు, తిరిగి 18వ తేదీ విఐపి బ్రేక్ దర్శనాలకు సిఫార్సులేఖలు స్వీకరించబడవు.



## శ్రీవారి సేవలో మిస్ఇండియా హర్నాజ్‌సందు

తిరుమల, మార్చి 15 ప్రభాతవార్త ప్రతినిధి: తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో ప్రజలందరికీ మంచి జరగాలని, అందరూసంతోషంగా ఉండాలని స్వామివారిని వేడుకున్నట్లు ప్రముఖులు తెలిపారు. ఆదివారం ఉదయం విఐపి బ్రేక్‌లో 2021 మిస్ఇండియా హర్నాజ్‌సందు, సినీనటి మాళవిక మోహన్ వేర్వేరుగా ఆలయంలోనికి చేరుకున్నారు. వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.



## రాష్ట్ర ప్రజలకు శుభాలు కలగాలి: మంత్రి డోలా

తిరుమల, మార్చి 15 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పాలనలో ప్రజలకు సంక్షేమ పథకాలు విజయవంతంగా అందుతున్నాయని, ప్రతి ఒక్కరూ ఆనందంగా ఉన్నారని రాష్ట్ర మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి తెలిపారు. ఆదివారం ఉదయం కుటుంబంతో కలసి తిరుమలకు చేరుకున్న ఆయన ఉదయం శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయ అదికారులు స్వామివారి దర్శనం చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు.

వార్త

మనస్సును ఆరోగ్యకరమైన ఆలోచనలతో నింపండి. అవే జీవితాన్ని సుఖమయం చేస్తాయి.

-విల్‌కిన్స్

# కారుణ్య మార్గం

తీవ్రమైన నయం కాని వ్యాధితో బాధపడుతున్నవ్యక్తి జీవితం ఇక కొనసాగించలేని, అలా అని స్వచ్ఛంద మరణం పొందలేని పరిస్థితుల్లో వారి ఆత్మీయులు ఈ విషయాన్ని బయటికి చెప్పి వారి ఆకస్మిక మరణానికి దారిచూపవచ్చు. అదే వైద్య పరిభాషలో 'యుథనేసియా' అంటారు. మరణం ఎలాంటిదైనా చావలేక బతుకలేక చచ్చేటంతటి నరకబాధను అనుభవిస్తూ ఆత్మీయులకు తీవ్రవేదన కల్పిస్తున్న దశలో 'కారుణ్య మరణం కోరడం సబబే అని ప్రపంచంలోని 27 దేశాలు చట్టాలు చేశాయి. అయితే దానికీ ఎన్నో నియమ నిబంధనలు, ఆటంకాలు, అడ్డంకుల ఆలోచనలు మానవ మస్తిష్కంలో ఉదయిస్తారు. అలాంటి సంఘర్షణ ఒకటి సుప్రీంకోర్టు ధర్మాసనం ముందుకు వచ్చింది.ఎంతో కారుణ్యమున్నా ఇలాంటి సందర్భాల్లో చట్ట పరిధిలో నిర్ణయం తీసుకోవాల్సి వచ్చినప్పుడు ఎంతటి వారికైనా మనసు వ్యాద్యంగా మారి ఉంటుంది. అందుకే 13ఏళ్లకు పైగా కోమాలో ఉన్న 32 ఏళ్ల హారీష్ రాణాకు 'పరోక్ష కారుణ్య మరణాన్ని' ప్రసాదిస్తూ తీర్పు వెలువరించిన సందర్భంలో జస్టిస్ పార్థీవాలా కంటనీరు చెమ్మగిల్లింది. అంటే ఇలాంటి అంశాల్లో నిర్ణయం తప్పనిసరైనప్పుడు బాధ తప్త హృదయాలతోనే తీర్పు ఇవ్వడం జరిగే విషయమే. 'జీవితం ఎంత క్షణభంగురమో తెలిసొచ్చినా ప్రేమ, కారుణ్యం ఆధారంగానే తప్ప హేతుబద్ధత, తర్కాలతో నిర్ణయం జరుగదు. కృత్రిమ పద్ధతుల్లో జీవితాన్ని నిరర్థకంగా పొడిగించాల్సిన అవసరముండదు. ఎంత వైద్యం చేసినా సజీవంగా ఉంచామన్న పేరుకే తప్ప ఏ జీవికి చావును తప్పించలేమన్నది 'ధర్మాసనం' అభిప్రాయపడింది. ఈఅంశంపై మనకు ప్రత్యేక చట్టాలులేవు.సుప్రీంకోర్టు నిర్ణయం సంచలనాత్మకమే. మిశ్రమ అభిప్రాయాలు వెలిబుచ్చినా వైద్య చికిత్సలు కొనసాగిస్తూ మనుడకు ప్రాణం పోయడమే తప్ప ఏ వ్యక్తికీ సజావైన జీవితాన్ని ఇవ్వలేరు. రోగి కోలుకునే అవకాశం ఏమాత్రమూ లేదని ఎందరో వైద్య నిపుణులు, ఎన్నో మెడికల్ బోర్డులు తేల్చి చెప్పాయి. హారీష్ తండ్రి వైద్యంద్వారా తన కుమారుడిని బతికించుకోవాలని చూసారు. 13ఏళ్ల కోమాలో ఉన్న హారీష్‌కుకుటుంబం యావత్తు బాసటగా నిలిచారు. నిస్వార్థ సేవలు చేస్తూ హారీష్ పట్ల అంతులేని ప్రేమ చూపేవారు. తండ్రి అశోక్ రాణా తన బిడ్డపడే నరక యాతనను చూడలేక 'పరోక్ష కారుణ్య మరణం' ప్రసాదించమని సుప్రీంకోర్టును అభ్యర్థించారు. అంటే తన కుమారునికి వైద్యసేవలు నిలిపి వేసేందుకు అనుమతి అన్నమాట. ఈ పిటిషన్‌పై జస్టిస్ పార్థీవాలా, కె.వి విశ్వనాథన్‌లు ధర్మాసనం చరిత్రాత్మక తీర్పునిచ్చింది. ఈ తీర్పు మేరకు హారీష్‌కు ఒక క్రమపద్ధతిలో వైద్యాన్ని నిలిపివేసి అతడ్ని సహజ మరణం వైపునకు ప్రేరిపిస్తారు. అనంతరం అతని ప్రాణం అనంత వాయువుల్లో కలిసిపోతుంది. దేశంలో కారుణ్యమరణాన్ని కోర్టు ఆమోదించిన ప్రప్రథమ కేసు ఇదే అవుతుంది. ఎన్నో ఏళ్లుగా చర్చనీయాంశంగా ఉన్న ఇలాంటి 'యుథోనేసియా' ప్రక్రియపై 2018లో 'కామన్ కాజ్' కేసులో ప్రత్యేక పరిస్థితుల్లో పరోక్షకారుణ్య మరణాన్ని అనుమతించవచ్చునని రాజ్యాంగ ధర్మాసనం సూచించింది. అప్పట్లో 1973లో ముంబై కింగ్ అడ్వర్డ్ స్మారక మెమోరియల్ ఆసుపత్రిలో నర్సుగా పనిచేస్తున్న అరుణ శాన్‌బాగ్‌పై లైంగిక దాడిజరిగింది. పెనుగులాటలో మెదడుకు ఆక్సిజన్ సరఫరా తగ్గిపోయి కోమాలోకి వెళ్లిపోతే ఆమె నాలుగు దశాబ్దాలపాటు ఆసుపత్రిలోనే ఉండిపోయింది. 2009లో పింకీ విరానీ అనే స్నేహితురాలు ఆమెదుస్థితి చూడలేకపోతున్నందున శాన్‌బాగ్‌కు కారుణ్య మరణానికి ఆదేశాలిమ్మని కోర్టును కోరింది. ఆసందర్భాన్నే ఉదాహరణగా తీసుకొని అప్పటి ధర్మాసనం కారుణ్యమరణం సమంజసమేనని, అందుకు పూర్తి అర్హతలున్న కేసేనని వ్యక్తంచేసింది. కానీ రోగి ఆత్మబంధువులు కాకుండా స్నేహితురాలు కోర్టును ఆశ్రయించడంతో దానినిసాంకేతిక కారణాలతో అభ్యంతరం పెట్టారు. 'యుథనేసియా'పై ఒక చట్టాన్ని తీసుకురావాలని సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది.జీవించే హక్కుతోపాటు గౌరవప్రదంగా తనువు చాలించడం కూడా రాజ్యాంగంలోని ఆర్టికల్ 21రీత్యా పరిగణనలోకి తీసుకోదగినదని కోర్టు అభిప్రాయపడింది. ముందుగా హారీష్‌కు కారుణ్య మరణం ప్రసాదించే విషయంలో ఢిల్లీ హైకోర్టు తిరస్కరించింది. దాంతో అతని తల్లిదండ్రులు సుప్రీంకోర్టు తలుపు తట్టారు. పైపులద్వారా అందించే పోషకాహారం కూడా వైద్య చికిత్స కిందకే వస్తుంది కనుక వైద్యుల పరిశీలనానంతరం లైఫ్ సపోర్టు తోపాటు పోషకాహారాన్ని నిలిపివేయాలని ధర్మాసనం చెబుతోంది. తాజాగా మరో కేసులోఇక జీవించే అవకాశం లేదని వైద్యనిపుణులు భావించి 'బ్రెయిన్‌డెడ్'గా నిర్ణయించిన ఓ మహిళను ఇంటికి తీసుకెళ్తుండగా చలనం వచ్చి బతికింది.బ్రెయిన్‌డెడ్ మహిళ బతికి బట్టకట్టింది. ఆమెను ఇంటికి తీసుకెళ్తున్న అంబులెన్స్ రోడ్డు గుంతలోపడింది. మిగిలినవారు చెల్లాచెదురుగా కిందపడగా ఆమెలోకాస్తంత చలనం గమనించి ఆసుపత్రికి చేర్చి వైద్యసహాయం అందిస్తే లేచి కూర్చొంది. ఎంత అద్భుతం. మృత్యుంజయిగా పేర్కొనవచ్చు. తాజా సంఘటన మరోలా అన్వయించవచ్చు. ఈ ఉదంతం కూడా ఇకపై కారుణ్య మరణం కోసం తపించే అంశాలకు కొత్తదారి చూపించవచ్చు. అది లేకుంటే మరో మార్గాంతరం కోసం అన్వేషించనూవచ్చు. జీవచ్ఛవంలా బతుకుతున్న వారికి, వారి సేవలో అంటి పెట్టుకుని ఉండేవారికి ప్రస్తుత తీర్పు దిశానిర్దేశాన్ని సూచిస్తుంది. ఎన్నో ఏళ్లుగా చర్చల్లో ఉన్న 'యుథోనేసియా'కు కొత్త కొత్త సూచనలు బాసటగా ఉండే అవకాశం ఉంది.



ఇతరులు అనుసరించడానికి తమనే ఉదాహరణగా తీసుకోవాలని తమకు తామే ఎవరైతే అనుకుంటారో వారు అభివృద్ధి చెందలేరు.

గోల్డ్‌స్మిత్



అవినీతికి పాల్పడే వారికి చివరకు మిగిలేది ఆవేదనా, అవమానాలే!

సి. సిమ్మన్

# కాలుష్యం నుంచి స్వచ్ఛత వైపు మూసీ

**ప్రాజెక్టు విజయవంతం కావాలంటే కేవలం నిర్మాణ పనులు సరిపోవు. నగరంలోని మురుగు కాల్వలను పూర్తిగా నియంత్రించాలి. పారిశ్రామిక వ్యర్థాల విడుదలను కట్టడి చేయాలి. ప్రజల్లో కూడా పర్యావరణ అవగాహన పెంచాలి. లేదంటే భారీ వ్యయంతో చేపట్టిన ప్రాజెక్టు దీర్ఘకాలంలో ఆశించిన ఫలితాలు ఇవ్వకపోవచ్చు. మొత్తం మీద 7 వేల కోట్ల రూపాయల వ్యయంతో రూపొందుతున్న మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు హైదరాబాద్ నగర చరిత్రలో ఒక కీలక మైలురాయిగా నిలవవచ్చు. శాస్త్రీయ ప్రణాళిక, పారదర్శక అమలు, ప్రజల భాగస్వామ్యం ఉంటే మూసీ నది మళ్లీ జీవనదిగా మారే అవకాశం ఉంది. ఒకప్పుడు నగరానికి ప్రాణాధారంగా నిలిచిన మూసీ మళ్లీ అదే వైభవాన్ని సంతరించుకుంటే అది కేవలం పర్యావరణ విజయం మాత్రమే కాదు, హైదరాబాద్ నాగరికతకు కొత్త అధ్యాయం అవుతుంది.**



రామ కిష్టయ్య సంగన భట్ల

హైదరాబాద్ నగరానికి జీవనాడిగా ఒకప్పుడు ప్రవహించిన మూసీ నది, గత కొన్ని దశాబ్దాలుగా కాలుష్యం, నిర్లక్ష్యం, అశాస్త్రీయ నగరీకరణ కారణంగా కాలువల సమాహారంగా మారిపోయింది.ఒకప్పుడు నగరానికి తాగునీటి వనరుగా నిలిచిన ఈ నది ప్రస్తుతం పారిశ్రామిక వ్యర్థాలు, మురుగు నీటివల్ల తీవ్ర కాలుష్యానికి గురైంది. ఈపరిస్థితినిమార్చి మూసీని మళ్లీ పునరుద్ధరించేందుకు తెలంగాణ ప్రభుత్వం భారీ ప్రణాళికను రూపొందించింది. సుమారు 7 వేల కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టబోయే మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టుకు సంబంధించి డీటెయిల్డ్‌ప్రాజెక్ట్ రిపోర్ట్ (డిపిఆర్) సిద్ధమై అమలు దిశగాఅడుగులు వేస్తోంది. ఈ ప్రాజెక్టు కేవలం నదిని శుభ్ర పరచడమే కాదు, హైదరాబాద్ నగర పర్యావరణాన్ని మెరుగుపరచడం, వరద ప్రమాదాలను తగ్గించడం, నగర అభివృద్ధికి కొత్త దిశను చూపించడం వంటి లక్ష్యాలను ముందుంచుకుంది. మూసీనది చరిత్రను పరిశీలిస్తే, ఈ నది హైదరాబాద్ నగర నిర్మాణంలో కీలక పాత్ర పోషించింది. మూసీకి ఉపనదులైన ఈసా, ఇతర వాగులు కలిసే ప్రాంతాల్లో పూర్వం వ్యవసాయం అభివృద్ధి చెందింది. హైదరాబాద్ నగరాన్ని స్థాపించిన మహమ్మద్ కులీ కుతుబ్ షా కాలంలోనే మూసీ నగరానికి ప్రధాన జలవనరుగా ఉపయోగించబడింది. అయితే 1908 లో జరిగిన భారీ వరదలు నగరాన్ని అతలాకుతలంచేశాయి. ఆ వరదల తర్వాత నగరానికి వరదల నుంచి రక్షణ కల్పించేందుకు మోక్షగుండం విశ్వేశ్వరయ్య రూపొందించిన ప్రణాళికల ప్రకారం ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ జలాశయాలు నిర్మించబడ్డాయి. ఈ జలాశయాలు దశాబ్దాల పాటు హైదరాబాద్ నగరానికి తాగునీటి ప్రధాన వనరులుగా నిలిచాయి. కానీ 1980ల తరువాత హైదరాబాద్ వేగంగా విస్తరించడం ప్రారంభమైంది. ఐటిరంగం అభివృద్ధి, పారిశ్రామిక విస్తరణ, జనాభా పెరుగుదల కారణంగా నగరంలోమురుగు నీటి పరిమాణం పెరిగింది. నగరంలోని వందలాది కాలువలు, మురుగు కాల్వలు మూసీలోకి కలవడం ప్రారంభమైంది. ప్రస్తుతం హైదరాబాద్ నగరంలో రోజుకు సుమారు 2 వేల మిలియన్ లీటర్లకు పైగా మురుగు నీరు ఉత్పత్తి అవుతున్నదని అంచనా. అందులో గణనీయమైన భాగం సరైన శుద్ధి లేకుండానే మూసీ నదిలోకి చేరుతున్నదనే ఆందోళనలు ఉన్నాయి. ఈ సమస్యను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర ప్రణాళిక రూపొందించింది. మూసీ నది మొత్తం సుమారు 55 కిలోమీటర్ల పొడవున హైదరాబాద్ నగర పరిధిలో ప్రవహిస్తుంది. ఈ మొత్తంప్రాంతాన్ని ఐదు జోన్లుగా విభజించి అభివృద్ధి చేయాలని ప్రణాళిక రూపొందించారు. మొదటి దశలో సుమారు 20 కిలోమీటర్ల ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. ఇందులో హిమాయత్ సాగర్ నుంచి బాపూఘాట్ వరకు సుమారు 9 కిలోమీటర్ల భాగం ప్రధానంగా అభివృద్ధి చేయబడనుంది. మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టులో ప్రధానంగా నాలుగు అంశాలు కీలకంగా నిలుస్తాయి. మొదటిది కాలుష్య నియంత్రణ. నగరంలోని మురుగు కాల్వలు నదిలోకి చేరకుండా ఇంటర్ సెప్టర్ డ్రైనేజ్ వ్యవస్థ ఏర్పాటు చేయనున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా సుమారు 3,100కోట్ల రూపాయల వ్యయంతో ట్రంక్ ఇంటర్ సెప్టర్ సీవర్ వ్యవస్థ ఏర్పా



టు చేయాలని ప్రణాళిక రూపొందించారు. ఇది నగరంలోని ప్రధాన మురుగు కాల్వలను మళ్లించి శుద్ధి కేంద్రాలకు తరలిస్తుంది. రెండవది నీటి ప్రవాహాన్ని స్థిరంగా ఉంచడం. ప్రస్తుతం మూసీ నది ఎక్కువగా మురుగు నీటిపై ఆధారపడి ప్రవహిస్తున్నది. దీనికి పరిష్కారంగా గోదావరి జలాలను హైదరాబాద్‌కు తరలించే ప్రాజెక్టుల ద్వారా కొంత నీటిని మూసీ ప్రవాహానికి విడుదల చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. మల్లన్నసాగర్ నుంచి తాగునీటి సరఫరాతో పాటు మూసీ నదిని పునరుజ్జీవం చేయడానికి నీటిని మళ్లించే ప్రణాళిక కూడా సిద్ధమైంది. మూడవది పర్యావరణ పరిరక్షణ. నది తీరప్రాంతాల్లో భారీగా హరిత వనాలు, పార్కులు, ప్రజలకు విశ్రాంతి ప్రాంతాలు ఏర్పాటు చేయనున్నారు. నగరంలోని ప్రజలు నదిని ఆస్వాదించేందుకు వాకింగ్‌ట్రాకులు, సైక్లింగ్ మార్గాలు, వినోద కేంద్రాలు ఏర్పాటు చేయాలని ప్రణాళిక ఉంది. నాలుగవది పట్టణ మౌలిక వసతుల అభివృద్ధి. నది తీరాల వెంట సేవా రహదారులు, కొత్త వంతెనలు, ప్రజలకు సౌకర్యాలు ఏర్పాటు చేయనున్నారు. దీని ద్వారా నగర ట్రాఫిక్ ఒత్తిడి తగ్గుతుందని అధికారులు భావిస్తున్నారు.ఈ భారీ ప్రాజెక్టుకు నిధుల సమీకరణ కూడా ముఖ్యమైన అంశంగా మారింది. ఆసియా అభివృద్ధిబ్యాంకు నుంచి సుమారు 4,100కోట్ల రూపాయల రుణాన్ని పొందేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అదనంగా కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ నుంచి జాతీయ నది పరిరక్షణ పథకం కింద మరికొన్ని వేల కోట్ల రూపాయలు పొందేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ప్రాజెక్టు అమలు కోసం ప్రత్యేకంగా మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ అనే సంస్థను ఏర్పాటు చేశారు. ఈసంస్థ ప్రణాళిక రూపకల్పన, భూసేకరణ, నిర్మాణ పనుల పర్యవేక్షణ వంటి బాధ్యతలను నిర్వహిస్తుంది. అంతర్జాతీయ స్థాయి సలహాదారులతో కలిసి ప్రాజెక్ట్ మాస్టర్ ప్లాన్ రూపొందించబడింది. అయితే ఈప్రాజెక్టుపై కొంతమంది పర్యావరణవేత్తలు,సామాజిక సంస్థలు ఆందోళనలు వ్యక్తం చేస్తున్నాయి. ముఖ్యంగా నది తీరప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజల పునరావాసం, భూసేకరణ ప్రక్రియ, పర్యావరణ ప్రభావం వంటి అంశాలపై చర్చలు జరుగుతున్నాయి. ప్రజల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని ప్రాజెక్టును అమలుచేయాలని కొందరు కార్యకర్తలు సూచిస్తున్నారు. మరోవైపు నగరాభివృద్ధి నిపుణులు ఈ ప్రాజెక్టును హైదరాబాద్ భవిష్యత్తుకు కీలకంగా భావిస్తున్నారు. ప్రపంచంలోని అనేక నగరాలు తమనదులను పునరుద్ధరించి పర్యాటక కేంద్రాలుగా మార్చుకున్నాయి. ఉదాహరణకు లండన్‌లో థేమ్స్, అహ్మదాబాద్‌లో సబర్మతి నదీ తీర అభివృద్ధి నగరఅభివృద్ధికి దోహదపడింది. అదే తరహాలో మూసీ కూడా పునరుజ్జీవం అయితే హైదరాబాద్ నగరానికి పర్యావరణ పరంగా, ఆర్థికపరంగా పెద్ద ప్రయోజనం కలుగుతుందని విశ్లేషకులు అంటున్నారు. మూసీ నది శుద్ధి కావడం వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయి. మొదటగా నగర పర్యావరణం మెరుగుపడుతుంది.ప్రస్తుతం నదినుంచి వ్యాపిస్తున్న దుర్వాసన, దోమల సమస్యలు తగ్గే అవకాశం ఉంది. రెండవది వరదల ప్రమాదం తగ్గుతుంది. నది తీరాలను శాస్త్రీయంగా అభివృద్ధి చేస్తే భారీ వర్షాల సమయంలో నీటి ప్రవాహం సాఫీగా సాగుతుంది. మూడవది నగరానికి కొత్త వినోద ప్రాంతాలు ఏర్పడతాయి. అయితే ప్రాజెక్టు విజయవంతం కావాలంటే కేవలం నిర్మాణ పనులు సరిపోవు. నగరంలోని మురుగు కాల్వలను పూర్తిగా నియంత్రించాలి. పారిశ్రామిక వ్యర్థాల విడుదలను కట్టడి చేయాలి. ప్రజల్లో కూడా పర్యావరణ అవగాహన పెంచాలి.లేదంటే భారీ వ్యయంతో చేపట్టిన ప్రాజెక్టు దీర్ఘకాలంలో ఆశించిన ఫలితాలు ఇవ్వకపోవచ్చు. మొత్తం మీద 7 వేల కోట్ల రూపాయల వ్యయంతో రూపొందుతున్న మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు హైదరాబాద్ నగర చరిత్రలో ఒక కీలక మైలురాయిగా నిలవవచ్చు.శాస్త్రీయ ప్రణాళిక, పారదర్శక అమలు, ప్రజల భాగస్వామ్యం ఉంటే మూసీ నది మళ్లీ జీవనదిగా మారే అవకాశం ఉంది. ఒకప్పుడు నగరానికి ప్రాణాధారంగా నిలిచిన మూసీ మళ్లీ అదే వైభవాన్ని సంతరించుకుంటే అది కేవలం పర్యావరణ విజయం మాత్రమే కాదు, హైదరాబాద్ నాగరికతకు కొత్త అధ్యాయం అవుతుంది. ●

# యుద్ధాలకు బలి అవుతున్న బాల్యం

డా.కె.రమాప్రభ

ప్రపంచంలో జరుగుతున్న యుద్ధాలు కేవలం దేశాల మధ్య పోరాటాలు కావు. అవి లక్షలాది బాలల జీవితాలను, కలలను, భవిష్యత్తును ధ్వంసం చేస్తున్న మానవ విపత్తులు. ఉక్రెయిన్, గాజా, ఇరాన్ వంటి ప్రాంతాల్లో బాంబులు పడుతున్నది కేవలం భవనాలపై కాదు – బాలల భవిష్యత్తుపై. ప్రపంచంలో ఎక్కడ యుద్ధం జరిగినా మొదటగా నశించేది మానవత్వం,ఎక్కువగా నష్టపోయేదిబాల్యం. బాంబులు పడుతున్నప్పుడు కూలిపోతున్నది కేవలం భవనాలు కాదు, వేలాది బాలల కలలు, భవిష్యత్తు కూడా. ఉక్రెయిన్, గాజా, ఇరాన్ వంటి ప్రాంతాల్లో కొనసాగుతున్న యుద్ధాలు లక్షలాది పిల్లలను అనాథలుగా, శరణార్థులుగా మార్చుతున్నాయి. చదువు, ఆరోగ్యం, భద్రత వంటి ప్రాథమిక హక్కులు కూడా వారికి అందకుండాపోతున్నాయి. బాలలు యుద్ధాలకు కారణం కాకపోయినా, ప్రతి యుద్ధంలో అత్యధికంగా బాధపడుతున్నవారు వారే. అందుకే బాలల హక్కులను కాపాడటం అంటే యుద్ధాలను ఆపడం శాంతిని కాపాడటం. ప్రపంచంలో ఎక్కువ యుద్ధాలు ప్రధానంగా నాలుగు ప్రయోజనాల కోసం జరుగుతున్నాయి. మొదటిది రాజకీయ అధికారం. కొంతమంది నాయకులు విదేశీ శత్రువు" అనే భయాన్ని సృష్టించి జాతీయతను రెచ్చగొట్టి తమ అధికారాన్ని బలపరుచుకుంటారు. రెండవది ఆయుధ వ్యాపారం. ఆయుధ తయారీ సంస్థలు ప్రపంచంలో అతి పెద్ద లాభాలను పొందే రంగాల్లో ఒకటి. యుద్ధం మొదలైతే కోట్ల డాలర్ల వ్యాపారం జరుగుతుంది. మూడవది సహజ వనరులపై ఆధిపత్యం. చమురు, గ్యాస్, ఖనిజాలు, నీరు వంటి వనరుల కోసం యుద్ధాలు జరుగుతున్నాయి. నాలుగవది మతం లేదా జాతీయత. ఇవి చాలాసార్లు నిజమైనకారణాలు కాకుండా ప్రజలను యుద్ధానికి ప్రేరేపించే ఒక ముసుగుగా ఉపయోగపడతాయి. ఈ నాలుగు కారణాల్లో ఒక్కటి కూడా సాధారణ ప్రజల ప్రయోజనం కోసం కాదు. లాభం కొద్దిమందికి, నష్టం కోట్లాది మందికి. ఆధునిక యుద్ధాల్లో మరణించే వారిలో ఎక్కువ మంది సైనికులు కాదు, సాధారణప్రజలు. అందులో పెద్దభాగంబాలలే. అంతర్జాతీయ సంస్థల నివేదికల ప్రకారం ఆధునిక యుద్ధాల్లో సుమారు 90 శాతం మరణాలు సాధారణ ప్రజలవే. బాలలను కోల్పోతే మనం మన భవిష్యత్తునుకోల్పోతున్నాం. బాలల రక్తం ఎవరి లాభానికైనా ఖర్చు చేయడం మానవత్వానికే మచ్చ. బాలలు యుద్ధాలకు కారణం కాదు, కానీ ప్రతి యుద్ధంలో పెద్ద బాధితులు వారే. ఉక్రెయిన్ యుద్ధం – బాలల జీవితాలపై ప్రభావం రష్యా-ఉక్రెయిన్ యుద్ధం నాలుగేళ్లుగా కొనసాగుతోంది. దీని ప్రభావం లక్షలాది కుటుంబాలపై పడింది. నివేదికల ప్రకారం 2022 నుంచి కనీసం 3200మంది బాలలు చనిపోయారు లేదా గాయపడ్డారు. 2025లో మాత్రమే 92మంది బాలలు మరణించగా, 652 మంది గాయపడ్డారు. దేశంలోని మూడింట ఒక వంతు బాలలు మానసిక గాయాలకు గురయ్యారు. పాఠశాలలు ధ్వంసం కావడం, విద్యుత్ సౌకర్యాలపై దాడులు జరగడం వల్ల పిల్లలు చదువు, ఆరోగ్య సేవలు కోల్పోతున్నారు. చాలామంది శరణార్థులుగా మారిపోయారు. 2023 అక్టోబర్ నుంచి కొనసాగుతున్న గాజా యుద్ధం బాలలపై అత్యంత దారుణ ప్రభావం చూపింది. నివేదికల ప్రకారం 21 వేలకుపైగా బాలలు చనిపోయారు. 44 వేలకు పైగా బాలలు గాయపడ్డారు. వారిలో వేలాది మంది శాశ్వత వికలాంగులయ్యారు. 56వేలకుపైగా బాలలు తమ తల్లిదండ్రులను కోల్పోయారు. పాఠశాలలు, ఆసుపత్రులు ధ్వంసమయ్యాయి. ఆహారం లేక వేలాది బాలలు ఆకలి చావు అంచున ఉన్నారు. ఈ యుద్ధం వేలాది బాలలను అనాథలుగా, భయంతో జీవించేలా చేసింది. ప్రతి బాంబు వెనుక ఒక బాలుడి/బాలిక కల చనిపోతున్నది" ఫిబ్రవరి 2026 లో ప్రారంభమైన ఇరాన్ యుద్ధం కూడా బాలలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ప్రారంభ దాడుల్లోనే 180 నుండి 200మంది బాలలు మరణించినట్లు నివేదికలు చెబుతున్నాయి. ఒక పాఠశాలపై జరిగిన దాడిలో 168మంది బాలికలు ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం.పలుపాఠశాలలు, ఆసుపత్రులు ధ్వంసమయ్యాయి. విద్య, ఆరోగ్య సేవలు పూర్తిగా దెబ్బతిన్నాయి.ప్రపంచ సంఘర్షణల్లో బాలలపై ఆరుప్రధాన ఉల్లంఘనలు జరుగుతున్నాయి. బాలలను చంపడం లేదా గాయపరచడం, బాలలను సైనికులుగా ఉపయోగించడం, పాఠశాలలు, ఆసుపత్రులపై దాడులు,లైంగిక హింస,బాలల అపహరణ, మానవతా సహాయాన్ని నిరాకరించడం. ఇవి అంతర్జాతీయ చట్టాలకు వ్యతిరేకంఅయి నప్పటికీ యుద్ధాల్లో కొనసాగుతూనే ఉన్నాయి. ప్రపంచంలో కోట్లాది బాలలు యుద్ధ ప్రభావంలో జీవిస్తున్నారు. నివేదికల ప్రకారం ప్రపంచవ్యాప్తంగా 47.3 కోట్ల బాలలు సంఘర్షణ ప్రాంతాల్లో జీవిస్తున్నారు.ప్రతిరోజు సగటున 23 మంది బాలలుబాంబు దాడుల్లో గాయపడుతున్నారు లేదా చనిపోతున్నారు.పాఠశాలలపై దాడులు గణనీయంగా పెరిగాయి. లక్షలాది బాలలు స్కూల్‌కు వెళ్లలేకపోతున్నారు. కోట్లాది బాలలు శరణార్థులుగా మారిపోయారు. యుద్ధం వారి జీవితాలను శాశ్వతంగా మార్చేస్తోంది. యుద్ధాలు దేశాలను గెలిపించవచ్చు, కానీ బాల్యాన్ని ఎప్పుడూ ఓడిస్తాయి. యుద్ధం ఎప్పుడూ సమస్యకు పరిష్కారం కాదు. దేశాలు సంభాషణలు, చర్చలు, డిప్లమసీకి ప్రాధాన్యం ఇవ్వాలి. అంతర్జాతీయ చట్టాలను బలోపేతం చేయాలి. ఆయుధ వ్యాపారంపై నియంత్రణఉండాలి. నాయకుల జవాబుదారీతనం పెరగాలి. ప్రజలు కూడా యుద్ధాలకువ్యతిరేకంగా శాంతికోసం గొంతుఎత్తాలి.బాలలు యుద్ధాలకు కారణం కాదు.కానీవారు అత్యధిక బాధితులు.అందువల్ల వారిని 'బలి'గా కాదు,శాంతి దూతలు'గాచూడాలి. ●

# మితిమీరుతున్న 'డిజిటల్' దాడులు..

ఎక్కులూరి నాగార్జున్ రెడ్డి

డిజిటల్ విప్లవం మానవ జీవనశైలిని సమూలంగా మార్చేసింది. ప్రపంచాన్ని ఒక గ్లోబల్ విలేజ్‌గా మార్చిన సోషల్ మీడియా, భావప్రకటనా స్వేచ్ఛకు ఒక గొప్ప వేదికగా నిలిచింది. కానీ, దురదృష్టవశాత్తూ అదే వేదిక నేడు అరాచకానికి, అశ్లీలతకు, వ్యక్తిత్వ హననానికి చిరునామాగా మారుతోంది.ఒకప్పుడు సమాచార వారధిగా వెలిగిన సామాజిక మాధ్యమాలు, నేడు వేధింపుల వలయంగా మారి సామాన్యుల నుండి సెలబ్రిటీల వరకు అందరినీ భయాందోళనకు గురిచేస్తున్నాయి. ట్రోలింగ్ అనేది సోషల్ మీడియాలో ఇప్పుడు అసాధారణ సమస్యేకాదు, ఇది వ్యక్తిగత గౌరవాన్ని దెబ్బతీసే సామాజిక వ్యాధిగా మారుతోంది. ఎవరైనా తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తే చాలు. వెంటనే దాడులు మొదలవుతున్నాయి. ఫొటోలను మార్ఫింగ్ చేయడం, అసత్య కథనాలు ప్రచారం చేయడం,సెక్స్టోర్షన్ బెదిరింపులు చేయడం, ఏఐ సాయంతో తప్పుడు వీడియోలు తయారు చేసి ప్రచారం చేయడం వంటి పద్ధతులు పెరుగుతున్నాయి. కొన్ని అధ్యయనాల ప్రకారం సోషల్ మీడియాలో ఉన్న ప్రతి 8 మంది మహిళల్లో ఒకరు ఇలాంటి అశ్లీల బెదిరింపులకు గురవుతున్నారు. ప్రముఖనటి ఇటీవల కాలంలో సోషల్ మీడియాలో తనపై జరుగుతున్న దుష్ప్రచారంపై తీవ్రంగా స్పందించడం ఈ సమస్య తీవ్రతను మరోసారి వెలుగులోకి తీసుకొచ్చింది. తాను మాట్లాడని మాటలను తన పేరుతో ప్రచారం చేయడం, పాత వ్యక్తిగత సంభాషణలను వక్రీకరించి ప్రచారం చేయడం వంటి చర్యలు తన వ్యక్తిగత గౌరవాన్ని దెబ్బతీస్తున్నాయని ఆమె పేర్కొన్నారు. తప్పుడు ప్రచారాన్ని వెంటనే తొలగించాలని హెచ్చరిస్తూ చట్టపరమైన చర్యలు తీసుకుంటానని స్పష్టం చేశారు. ఇది కేవలం ఒక సెలబ్రిటీ సమస్య కాదు, సోషల్ మీడియా వేదికలో ఎవరైనా లక్ష్యంగా మారవచ్చని చెప్పడానికి ఈ ఘటన ఉదాహరణ.ఒకప్పుడు విమర్శ అంటే ఆరోగ్యకరంగా ఉండేది. కానీ,నేడు సోషల్ మీడియాలో జరుగుతున్న ట్రోలింగ్ కేవలం విమర్శలకే పరిమితం కావడం లేదు. సైబర్ స్టాకింగ్, డాక్సింగ్, ఐడెంటిటీ థెఫ్ట్, బాడీ షేమింగ్ వంటి అనేక రూపాల్లో వేధింపులు జరుగుతున్నాయి.ట్రోల్ చేయాలనుకున్న వ్యక్తి ఫోన్ నంబర్, ఇంటి చిరునామా వంటి వ్యక్తిగత వివరాలను బయటపెట్టడం ద్వారా మరింతమంది



ని దాడికి ప్రోత్సహించడం జరుగుతోంది. నకిలీ ఖాతాలు సృష్టించి అశ్లీల లేదా వివాదాస్పద కంటెంట్‌ను ప్రచారం చేయడం కూడా సాధారణంగా మారింది. ఈ దాడులు కేవలం మానసికంగా మాత్రమే కాదు,కొన్నిసార్లు భౌతిక దాడులకు కూడా దారితీస్తున్నాయి. ఇలాంటి పరిస్థితులు రాజ్యాంగం ఇచ్చిన భావప్రకటన స్వేచ్ఛపైనే ప్రతికూల ప్రభావం చూపుతున్నాయి. ఈ భయాన్ని 'చిల్లింగ్ ఎఫెక్ట్' అని పిలుస్తారు. అంటే, వ్యక్తులు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తం చేయకుండా భయపడే పరిస్థితి. ఐక్యరాజ్యసమితి నిర్వహించిన అధ్యయనాల్లో కూడా చాలా మంది మహిళా జర్నలిస్టులు ఆన్‌లైన్ వేధింపుల కారణంగా ఉద్యోగాలు వదిలేయడం, సోషల్ మీడియాకు దూరం కావడం వంటి చర్యలు తీసుకోవాల్సి వచ్చినట్లు వెల్లడైంది. సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందుతున్న కొద్దీ ట్రోలింగ్ పద్ధతులు కూడా కొత్త రూపాలను సంతరించుకుంటున్నాయి.హ్యాకింగ్, డిజిటల్ ట్రాకింగ్, వ్యక్తిగత చాట్‌లను దొంగిలించడం వంటి చర్యల ద్వారా బాధితులను మరింతగా బెదిరించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ పరిస్థితుల్లో సోషల్ మీడియా సంస్థలు కఠిన చర్యలు తీసుకోవాలని చాలా మంది కోరుతున్నా, వ్యాపార ప్రయోజనాల దృష్ట్యా అవిపూర్తిగా స్పందించడం లేదు అన్న విమర్శలు ఉన్నాయి. అందుకే వ్యక్తిగత స్థాయిలో జాగ్రత్తలు కూడా అత్యంత అవసరం. సోషల్ మీడియా ఖాతాలను ప్రైవేట్‌గా ఉంచడం, వ్యక్తిగత వివరాలను వెల్లడించకపోవడం, లొకేషన్ ట్యాగ్‌లను నివారించడం, బలమైన పాస్‌వర్డ్‌లు ఉపయోగించడం, మల్టీఫ్యాక్టర్ ఆథెంటికేషన్ వంటి భద్రతా చర్యలు తీసుకోవడం తప్పనిసరి. అంతేకాదు, వేధింపులు ప్రారంభమైన వెంటనే సంబంధిత ఖాతాలను బ్లాక్ చేయడం, స్క్రీన్‌షాట్లు భద్రపరచడం,సైబర్ క్రైమ్ అధికారులకు ఫిర్యాదుచేయడం కూడా చాలాముఖ్యం. సైబర్ నేరాలపై మనదేశంలో కఠిన చట్టాలు అమల్లో ఉన్నాయి. సైబర్ స్టాకింగ్, ఐడెంటిటీ థెఫ్ట్, ఆన్‌లైన్ వేధింపులపై కేసులు నమోదు చేయవచ్చు. 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్, 1091 మహిళల హెల్ప్‌లైన్, 14490 నేషనల్ కమిషన్ ఫర్ ఉమెన్ హెల్ప్‌లైన్ వంటి సేవలు అందుబాటులో ఉన్నాయి. ఒక గొప్ప ప్రజాస్వామ్య వేదికలాంటి సోషల్ మీడియా ద్వేషం, వేధింపులు, అసత్య ప్రచారాలకు వేదికగా మారితే సమాజానికి పెనుప్రమాదం. సోషల్ మీడియాఅనేది ఒక పదునైన కత్తి వంటిది. అది అభివృద్ధికి తోడ్పడాలి కానీ వినాశనానికి కాదు. వ్యక్తుల గౌరవం, గోప్యత గౌరవించబడినప్పుడే అది నిజమైన స్వేచ్ఛా వేదిక అవుతుంది. చట్టాల కఠిన అమలుతో పాటు, నెటిజన్లలో సామాజిక బాధ్యత పెరిగినప్పుడే ఈ 'డిజిటల్ చీకటి' తొలగిపోతుంది. ●

# ప్రజావాక్కు



## గ్యాస్ కొరత లేకుండా చూడాలి

ఇరాన్ యుద్ధ ప్రభావంతో దేశ వ్యాప్తంగా గ్యాస్ కొరత ఏర్పడింది. ఇరాన్ నుండి గ్యాస్ దిగుమతి ఆగిపోవడంతో ఈ సమస్య తలెత్తింది. కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో సరిపోనుగ్యాస్ ఉంది అంటూ సంబంధిత మంత్రి అంటున్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం కూడా స్పందించి గ్యాస్ నిల్వలపైఒక క్లారిటీ ఇస్తే బాగుంటుంది. ఏదిఏమైన ప్రజలకు ప్రభుత్వం నిర్ణయించిన ధరకే గ్యాస్ వచ్చే విధంగా రాష్ట్రప్రభుత్వం చొరవతీసుకోవాలి. తెలంగాణ, బెంగళూరులలో చాలా వరకు గ్యాస్‌లేక హోటల్స్‌లు బంద్ పెట్టుకున్నారు. వంట గ్యాస్ కూడా బుక్ కావడం లేదు. అతి కష్టంపై అయినా కూడా డెలివరీ కావడానికి రోజులు తరబడి ఎదురు చూడాల్సివస్తుంది. గ్యాస్‌ఏజెన్సీల ముందు ప్రజలు బారులుతీరి గంటల కొద్దీ లైన్‌లో వేచి ఉంటున్నారు. టిఫిన్ సెంటర్స్‌లలో కూడాధరలువిపరీతంగా పెంచుతున్నారు. దీంతోమధ్యతరగతివారుఇబ్బందిపడుతున్నారు.

- మిద్దె సురేష్,నాగర్ కర్నూల్ జిల్లా

## అభివృద్ధి నష్టం కలిగించకూడదు

మూసిరివర్ ఫ్రంట్ పేరిట మూసి పరివాహక ప్రాంతంలోని ఇండ్లు కూల్చడం అన్యాయం అయితే ఒక ప్రాంతం నుండి వాళ్ళునిరాశ్రయులు అవుతున్నారు.అంటే ఏమిటి దాని అర్థం ఆ ప్రాంతంతో వాళ్ళు చారిత్రక మానసిక భౌతిక జ్ఞాపకాలు కోల్పోతున్నారు అన్నమాట. అయితే ఏ ప్రాంతంఅయినా అభివృద్ధికావాల్సిందే. అయితే అభివృద్ధి పేరిట ప్రజలను విస్తాపితం చేయడం,అది అభివృద్ధి అనిపించుకోదు. అభివృద్ధి అనేది మనుషులతో కలిసి ఉండాలి. ప్రజలకు నష్టం కలుగని రీతిలో ఉండాలి. దీనిని ఆపడం కోసం ప్రముఖ హక్కుల కార్యకర్త మేదా పాట్కర్ నడుం బిగించడం గొప్ప మలుపు.

- భారత అవినాష్, జనగామ

## దుష్ట రాజకీయాలు

అధికార పదవిలో కూర్చోవాలనుకునేవారుమిత్రుడు, హితుడు చుట్టం అనిచూడకూడదు. ఎవరినైనా ముంచేయాలి. వంచించాలి. వ్యతిరేకించేవారిని తనవైపు తిప్పుకోవాలి.ప్రతికూల పరిస్థితులను అనుకూలంగా మార్చుకోవాలి. సినీరంగం నుంచి రాజకీయాల్లోకి వచ్చినఎన్టీఆర్‌కి ఇవేమీ తెలియవు.మంచి వారిలాగా నమ్మకస్తుల్లాగా నటిస్తూ తన వెనుక గోతులు తవ్విన వారిని కనిపెట్టలేకపోయారు.

- ఎమ్. జగన్నాథం, హైదరాబాద్

## ఇంధనం కోసం నిధులు కేటాయించాలి

నగరాల్లోని భోజనశాలలు, చిన్న తరహా పరిశ్రమలపై ప్రభావం చూపుతున్న వాణిజ్య గ్యాస్‌సరఫరా అంతరాయాలు భారతదేశ ఇంధన వ్యవస్థ బాహ్యఒత్తిళ్లకు ఎంత లోనవుతుందో స్పష్టంగా తెలియజేస్తున్నాయి.దిగుమతి చేసుకునేఇంధనాలపై మన దేశం ఎంతగా ఆధారపడి ఉందో ఈపరిస్థితి ఎత్తిచూపుతోంది. సౌర, పవన, జీవవాయువు వంటి పునరుత్పాదక ఇంధన వనరులపై మనం ముందే స్థిరమైన పెట్టుబడులు పెట్టి ఉంటే, సుదూర ప్రాంతాల్లో జరిగే భౌగోళిక రాజకీయ మార్పుల వల్ల మన ఆర్థిక వ్యవస్థ ఇంతగా ప్రభావితమయ్యేది కాదు. వికేంద్రీకృత జీవవాయువు వ్యవస్థలు, భవనాలపై సౌర విద్యుత్ ఉత్పాదన వంటి స్వచ్ఛ ఇంధన పరిష్కారాలు వంట గ్యాస్‌కు నమ్మకమైన స్థానిక ప్రత్యామ్నాయాలుగా నిలుస్తాయి. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం పునరుత్పాదక ఇంధన మౌలిక సదుపాయాల కోసం బడ్జెట్‌లో మరిన్ని నిధులను కేటాయించాలి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## ప్రజాపాలనా.. ప్రగతి ప్రణాళిక

తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం ప్రకటించే సంక్షేమ పథకాలపై పేద తెలంగాణ ఉద్యమకారులు వెయ్యి కళ్లతో ఎదురు చూస్తున్నారు.విద్య, వైద్యం,రైతులు,రేషన్ కార్డులు,ఇందిరమ్మ ఇల్లు, రాజీవ్ యువవికాసం ఉద్యోగస్తులు, వికలాంగులు, మహిళలు, అన్ని వర్గాల ప్రజలు ప్రభుత్వం ప్రకటించే సంక్షేమ పథకాల కోసం తెలంగాణ ఉద్యమకారులు ఎదురుచూస్తున్నారు. తెలంగాణ ఉద్యమకారుల కృషిఫలితంగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలోఉద్యమకారులను గుర్తించి సన్మానించాలి.ఉద్యోగ తెలంగాణ ఉద్యమకారులకు స్పెషల్ స్టేట్ ఇంక్రిమెంట్ అమలు చేయాలి.

- ఈదునూరి వెంకటేశ్వర్లు, వరంగల్ జిల్లా

## ఉద్యోగాల కోత

ఇప్పటి వరకు ఇంజినీరింగ్ విద్య చదివిన వారందరూ అధిక జీతాలకు ఆశపడి సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలకు ఎగబడి దేశ విదేశాలలో ఉద్యోగాలు సంపాదించుకున్నారు. ఇంకా ఎంతో మంది ఎదురు చూస్తున్నారు.ఏటాలక్షల మందిదేశవ్యాప్తంగా ఇంజినీర్లు పుట్టుకు వస్తున్నారు.వీరందరికి ఉద్యోగాలు దొరకక ప్రయివేటు సంస్థలలోను చిన్నదో పెద్దదో ఎంతో కొంత జీతానికి పని చేస్తున్నారు. పెద్ద పెద్ద సాఫ్ట్‌వేర్ కంపెనీల ఈమధ్య తమ సీనియర్ ఉద్యోగులను వేలసంఖ్యలో తొలగిస్తున్నారు.

- ఎం. నాగరాజు, కరీంనగర్‌జిల్లా

గమనిక : ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# ‘కోడ్’ ముందటి తాయిలాలపై ఏంచేయలేం

## ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ స్పష్టీకరణ - నాలుగు రాష్ట్రాలు, పుదుచ్చేరి ఎన్నికల షెడ్యూల్ విడుదల

**న్యూఢిల్లీ, మార్చి 15:** ఎన్నికల కోడ్ అమల్లోకి రాకముందు తీసుకున్న విధానపరమైన నిర్ణయాలపై తాము జోక్యం చేసుకోలేమని కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (సిఇసి) జ్ఞానేశ్ కుమార్ స్పష్టం చేశారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటనకు ముందు, కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు జనరంజక పథకాల ప్రకటనపై సిఇసి స్పందిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. అలాగే పార్లమెంట్‌లో అభిశంసన తీర్మానం నోటీసు ఇవ్వడంపై స్పందించాలన్న మీడియా ప్రశ్నకు నో కామెంట్ అంటూ జ్ఞానేశ్ కుమార్ సమాధానమిచ్చారు. ఆదివారం ఢిల్లీలో ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్, కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధూ, వివేక్ జోషీలు మీడియా సమావేశంలో తమిళనాడు (234), పశ్చిమ బెంగాల్ (294), కేరళ (140), అస్సాం (126)తోపాటు పుదుచ్చేరి (30) రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదల చేశారు. పాండా (గోవా), బాగల్‌కోట్, దావణగెరె సౌత్ (కర్ణాటక), కొరిడాంగ్ (నాగాలాండ్), ధర్మనగర్ (త్రిపుర), ఉమ్రేథ్ (గుజరాత్), రహురి, బారామతి (మహారాష్ట్ర) అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలు జరగనున్నాయి. పుదుచ్చేరితోపాటు నాలుగు రాష్ట్రాల శాసనసభల పదవీకాలం మే, జూన్‌లలో వేర్వేరు తేదీల్లో ముగియనుంది. ఆయా రాష్ట్రాల్లో ఇప్పటికే ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను పూర్తి చేశాం, క్షేత్ర స్థాయి పరిస్థితులను పర్యవేక్షించేందుకు ఆయా రాష్ట్రాల్లోనూ ఇటీవల పర్యటించినట్లు వివరించారు. పారదర్శక, నిష్పాక్షికంగా ఎన్నికల కోసమే ఎస్ఐఆర్ నిర్వహిస్తున్నాం. ఓటరు అవగాహన కార్యక్రమాల అధికారులు, యువ ఓటర్లతో మాట్లాడాం“ అని జ్ఞానేశ్ కుమార్ తెలిపారు. పారదర్శక, నిష్పాక్షికంగా ఎన్నికలు జరిగేలా ఏర్పాట్లు చేశామని చెప్పారు. ఎన్నికలు హింస, ప్రలోభాలకు తావు లేకుండా నిర్వ హిస్తామని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సీఈసీ జ్ఞానేశ్ కుమార్ విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా తొలిసారి ఓటు వేయనున్న యువత ప్రజాస్వామ్య పండుగలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఆయా రాష్ట్రాల్లో ఎన్నికల షెడ్యూల్ ఇలా ఉంది.




**అసోం:** అసెంబ్లీ పదవీ కాలంలో మే 21తో ముగియనుంది. 126 స్థానాలున్న అసోంలో 9 ఎస్సీ, 19 ఎస్టీ రిజర్వ్ స్థానాలు కాగా, మార్చి 16వ తేదీ సోమవారం ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. 23వరకు నామినేషన్లు కాగా, 24న నామినేషన్ల పరిశీలన, 26 వరకు నామినేషన్ల ఉపసంహారణకు గడువు విధించారు. అసోంలో 2,50,21,408 మంది ఓటర్లుండగా, 31,486 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఏప్రిల్ 9న పోలింగ్ జరుగనుంది. మే 4న ఓట్ల లెక్కింపు, అదే రోజు ఫలితాలు ప్రకటన చేయనున్నారు. మే 6వ తేదీనాటికి ఎన్నికల ప్రక్రియ ముగియనుంది.

**కేరళ:** అసెంబ్లీ పదవీ కాలం మే 24తో ముగియనుంది. 140 స్థానాలున్న కేరళలో 14 ఎస్సీ, 2 ఎస్టీ సీట్లు రిజర్వు కాగా, మార్చి 16వ తేదీ సోమవారం ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. 23వరకు నామినేషన్లు కాగా, 24న నామినేషన్ల పరిశీలన, 26 వరకు నామినేషన్ల ఉపసంహారణకు గడువు విధించారు. కేరళలో 2,71,06,059 మంది ఓటర్లుండగా, 30,471 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఏప్రిల్ 9న పోలింగ్ జరుగనుంది. మే 4న ఓట్ల లెక్కింపు, అదే రోజు ఫలితాలు ప్రకటన చేయనున్నారు. మే 6వ తేదీనాటికి ఎన్నికల ప్రక్రియ ముగియనుంది.

**తమిళనాడు:** అసెంబ్లీ పదవీ కాలం మే 11తో ముగియనుంది. 234 స్థానాలున్న తమిళనాడులో 44 ఎస్సీ, 2 ఎస్టీ సీట్లు రిజర్వు కాగా, మార్చి 30 ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుంది. ఏప్రిల్ 6 వరకు నామినేషన్లకు ఆఖరి గడువు కాగా, ఏప్రిల్ 7న పరిశీలన, ఏప్రిల్ 9వ తేదీ లోపు నామినేషన్ల ఉపసంహారణకు ఎన్నికల కమిషన్ అవకాశం కల్పించింది. ఇక తమిళనాడులో 5,67,74,436 మంది ఓటర్లుండగా 75,032 పోలింగ్ సెంటర్లు ఏర్పాటు చేశారు. ఏప్రిల్ 23న పోలింగ్ జరుగనుంది. మే 4న ఓట్ల లెక్కింపు, అదే రోజు ఫలితాలు ప్రకటన చేయనున్నారు. మే 6వ తేదీనాటికి ఎన్నికల ప్రక్రియ ముగియనుంది.

**పశ్చిమ బెంగాల్:** అసెంబ్లీ పదవీ కాలం మే 8తో ముగియనుంది. 294 స్థానాలున్న పశ్చిమబెంగాల్‌లో 68 ఎస్సీ, 16 ఎస్టీలకు రిజర్వు కాగా, తొలి దశలో 152 నియోజకవర్గాల్లో పోలింగ్ నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి మార్చి 30 నోటిఫికేషన్ విడుదల ఏప్రిల్ 6 వరకు నామినేషన్ల దాఖలు అవకాశముంది.

## ‘కాన్షీరామ్‌కు భారత రత్న ఇవ్వాలి’

### ప్రధాని మోడీకి లేఖ రాసిన రాహుల్‌గాంధీ



**న్యూఢిల్లీ, మార్చి 15:** బహుజన్ సమాజ్ పార్టీ వ్యవస్థాపకుడు కాన్షీరామ్‌కు మరణానంతరం భారతరత్న పురస్కారం ప్రదానం చేయాలని ప్రధాని నరేంద్ర మోడీని లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ కోరారు. ఈ మేరకు ఆదివారం ఆయన ప్రధాని లేఖ రాశారు. కాన్షీరామ్‌జయంతిని పురస్కరించుకుని, ఆయన సేవలను స్మరించుకుంటూ ఈ విజ్ఞప్తిచేస్తున్నట్లు పేర్కొన్నారు. భారత రాజకీయాల స్వరూపాన్నే కాన్షీరామ్ మార్చారని రాహుల్‌గాంధీ తన లేఖలో కొనియాడారు. ఉద్యమాల ద్వారా బహుజనుల్లో, పేదల్లో రాజకీయ చైతన్యం నింపారని తెలిపారు. బహుజనుల ఓటు, గళం, ప్రాతినిధ్యం ఎంతో ముఖ్యమని గుర్తుచేశారని, ఈ దేశం అందరిదీ అని చాటిచెప్పారనివివరించారు. ఆయన కృషివల్లే ఎందరో అణగారిన వర్గాల ప్రజలు రాజకీయాలను న్యాయం, సమానత్వం సాధించే మార్గంగా చూడటం ప్రారంభించారని లేఖలో రాశారు. ప్రతి భారతీయుడికి రాజ్యాంగం సమానత్వం, గౌరవం, భాగస్వామ్యం కల్పించిందని, ఆ హామీలను సమాజంలో అట్టడుగున ఉన్నవారికి అందించేందుకు కాన్షీరామ్ తన జీవితాన్ని అంకితం చేశారని రాహుల్ కీర్తించారు. ఇటీవల లక్నోలో జరిగిన ‘సామాజిక్ పరివర్తన్ దివస్’ కార్యక్రమంలోనూ ఈ డిమాండ్‌కు బలమైన మద్దతు లభించిందని ప్రధానికి రాసిన లేఖలో ప్రస్తావించారు. 2027లో యుపి అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో రాహుల్ ఈ అంశాన్ని లేవనెత్తడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. కాన్షీరామ్‌కు భారతరత్న ప్రకటించడంఆయన దేశానికి చేసినసేవలకు దక్కే నిజమైన గౌరవమని రాహుల్‌గాంధీ ప్రధాని రాసిన లేఖలో అభిప్రాయపడ్డారు.

## కొత్తప్యాసింజర్ రిజర్వేషన్ వ్యవస్థకు రైల్వే శ్రీకారం!

**న్యూఢిల్లీ,మార్చి 15:** భారతీయ రైల్వేల్లో సుమారు 40 ఏళ్లుగా వినియోగంలో ఉన్న పాత టికెట్ రిజర్వేషన్ సాఫ్ట్‌వేర్‌కు రైల్వే శాఖ వీడ్కోలు చెబుతోంది. దాని స్థానంలో అత్యంత వేగవంతమైన, ఆధునిక టెక్నాలజీతో కూడిన కొత్త ప్యాసింజర్ రిజర్వేషన్ సిస్టమ్‌ను అందుబాటులోకి తేనుంది. ఈ కొత్త వ్యవస్థ ఏప్రిల్ నుంచి జూన్ మధ్య కాలంలో దేశవ్యాప్తంగా ప్రారంభం కానుంది. ప్రస్తుతం ఉన్న సిస్టమ్ తరచూ నెమ్మదిగా పనిచేయడం, తత్కాల్ బుకింగ్ సమయంలో క్రాష్ అవ్వడం వంటి సమస్యలతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో పీఆర్ఎస్ ఆధునికీకరణ ఫేజ్ 2 పేరుతో ఈ ప్రాజెక్టును చేపట్టారు. రైల్వే మంత్రిత్వ శాఖ కింద పనిచేసే సెంటర్ ఫర్ రైల్వే ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ ఈ కొత్త వ్యవస్థను అభివృద్ధి చేస్తోంది. ప్రస్తుతం ఈ సిస్టమ్ టెస్టింగ్ దశలో ఉందని, ఏప్రిల్‌జూన్ మధ్యలో లైవ్‌లోకి వస్తుందని క్రిస్ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. కొత్త సిస్టమ్ ద్వారా టికెట్ బుకింగ్ సామర్థ్యం భారీగా పెరగనుంది. ప్రస్తుతం నిమిషానికి 25 వేలు టికెట్లు మాత్రమే బుక్ చేయగలుగుతుండగా, కొత్త వ్యవస్థతో నిమిషానికి లక్షకు పైగా టికెట్లు బుక్ చేయవచ్చు. అలాగే, టికెట్ ఎంక్వైరీల సామర్థ్యం కూడా నిమిషానికి 4 లక్షల నుంచి 40 లక్షలకు (పది రెట్లు) పెరగనుంది. ఈ ఆధునికీకరణ కోసం సుమారు రూ.1,000 కోట్లు ఖర్చు చేస్తున్నారు. ఇందులో భాగంగా సైబర్ దాడులు, బాట్‌ల నుంచి రక్షణ కల్పించేందుకు రూ.600 కోట్లతో ఇండియన్ రైల్వేస్ ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ ఆపరేషన్స్ సెంటర్‌ను కూడా ఏర్పాటు చేస్తున్నారు. ఈ మార్పులతో ప్రయాణికులకు టికెట్ బుకింగ్ అనుభవం మరింత వేగంగా, సులభంగా, సురక్షితంగా మారుతుందని అధికారులు భావిస్తున్నారు.

# విజయ్‌కి డిప్యూటీ సిఎం, 80 టికెట్లు ఆఫర్

## ఎన్డీయేలో చేరాలని బిజెపి సంప్రదింపులు



**చెన్నై మార్చి 15:** తమిళనాడు, పశ్చిమ్ బెంగాల్, కేరళ, అసోం రాష్ట్రాలు, పుదుచ్చేరి కేంద్రపాలిత ప్రాంతం ఎన్నికలకు షెడ్యూల్ విడుదలయిన నేపథ్యంలో తమిళనాడులో తమిళగ వెట్రి కళగం (టీవీకే), బీజేపీల మధ్య పొత్తులపై వార్తలు మరోసారి చక్కర్లు కొడుతున్నాయి. టీవీకే అధ్యక్షుడు విజయ్‌కు ఉపముఖ్యమంత్రి పదవిని బీజేపీ ఆఫర్ చేసినట్లు జాతీయ మీడియా కథనాలు వెలువడ్డాయి. విజయ్ ఎన్డీయేలో చేరికపై చర్చలు తుది అంకానికి చేరుకున్నట్లు బీజేపీ వర్గాలు తెలిపాయి. టీవీకేకు 80 సీట్లు ఇచ్చేందుకు సిద్ధమైనట్లు వెల్లడించాయి. డిప్యూటీ సీఎం పోస్ట్ ఆఫర్ చేశామని, విజయ్ మాత్రం సీఎం పదవిపై దృష్టి పెట్టారని చర్చల్లో ఇది కీలకంగా మారిందని చెప్పాయి. ఈ విషయంపై ఇప్పటివరకు అటు బీజేపీ, ఇటు టీవీకే నుంచి ఎలాంటి స్పష్టత రాలేదు. బీజేపీ, డీఎంకేలకు తాము సమాన దూరంలో ఉంటామని, ఎవరితోనూ పొత్తులు ఉండవని విజయ్ ఇప్పటికే తేల్చి చెప్పిన సంగతి తెలిసిందే. అయినాసరే, దీనిపై ప్రచారం జరుగుతూనే ఉండటం గమనార్హం. తమిళనాడులో ఇళయ దళపతి , నటుడు విజయ్‌కు ఉన్న భారీ అభిమానులే టీవీకే పట్ల బీజేపీ ఆసక్తికి ప్రధాన కారణం. వీరు ఎన్నికల ఫలితాలపై గణనీయమైన ప్రభావాన్ని చూపవచ్చని కమలనాథులు భావిస్తున్నారు. అనేక నియోజకవర్గాల్లో కనీసం రెండు శాతం ఓట్లను ప్రభావితం చేయగలరు. అందువల్లనే విజయ్‌తో సంప్రదింపులకు కాషాయ పార్టీ అనేక మార్గాలను అన్వేషించినట్లు తెలుస్తోంది. ఇందులో ఓ రాష్ట్రానికి చెందిన డిప్యూటీ సీఎం సంధానకర్తగా వ్యవహరిస్తున్నారు. ఎలాగైనా టీవీకేను తమ కూటమిలో చేర్చుకోవాలని బీజేపీ ప్రయత్నాలు చేస్తోంది. ఈ ఆఫర్ రాజకీయంగా ముఖ్యమైంది అయినప్పటికీ, విజయ్ సలహాదారులు మాత్రం వద్దని వారిస్తున్నారు. కూటమిలో చేరడం వల్ల రాజకీయ ప్రత్యామ్నాయంగా స్థాపించిన టీవీకే విశ్వసనీయత దెబ్బతింటుందని భావిస్తున్నారు. జాతీయ పార్టీతో జతకట్టడం వల్ల విజయ్, టీవీకే అంచనా వేసిన స్వతంత్ర ఇమేజ్ తగ్గిపోతుందనేది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కరూర్ తొక్కిసలాట కేసులో సీబీఐ విచారణకు విజయ్ ఢిల్లీ వెళ్లడంతో ఆయన బీజేపీ నేతలను కలుస్తారనే ప్రచారం జరిగింది. కానీ, వీటిని టీవీకే తోసిపుచ్చింది.

## బాబ్ ఎల్‌మాండెబ్ జలసంధిమూసేస్తాం: హౌతీల హెచ్చరిక



**సనా, మార్చి 15:** ఇరాన్‌తో అమెరికా, ఇజ్రాయెల్ యుద్ధం కారణంగా ఇప్పటికే కీలకమైన హార్మూజ్ జలసంధి మూసుకుపోగా ఇప్పుడు ప్రపంచ వాణిజ్యానికి మరో ముప్పు పొంచి ఉంది. ఇరాన్ మిత్రపక్షమైన యెమెన్‌లోని హౌతీ రెబల్స్ ఎర్ర సముద్రంలోని ‘బాబ్ ఎల్‌మాండెబ్’ జలసంధిలో వాణిజ్య నౌకలపై దాడులు పునఃప్రారంభిస్తామని తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. దీంతో ఒకేసారి రెండు ప్రధాన సముద్ర మార్గాలు స్తంభించిపోయే ప్రమాదం ఏర్పడింది. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ సైనిక చర్యకు ప్రతిస్పందనగానే హౌతీలు ఈ బెదిరింపులకు దిగుతున్నారు. హార్మూజ్ మార్గం మూసుకుపోవడంతో, అనేక వాణిజ్య నౌకలు ప్రత్యామ్నాయంగా “బాబ్ ఎల్‌మాండెబ్” మీదుగా ప్రయాణిస్తున్నాయి. ఫలితంగా ఈ మార్గంలో నౌకల రద్దీ ఒక్కసారిగా పెరిగింది. ఇదే అదనుగా దాడులకు దిగితే ప్రపంచ సరఫరా గొలుసుపై తీవ్ర ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తమవుతోంది. హౌతీల నాయకుడు అబ్దుల్‌మాలిక్ అల్ హౌతీ మాట్లాడుతూ అవసరమైతే చర్యలకు దిగేందుకు తమ వేళ్లు ట్రిగ్గర్‌పైనే ఉన్నాయని హెచ్చరించారు. క్షిపణులు, డ్రోన్లతో దాడికి సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. ఫిబ్రవరి చివరి నుంచి హౌతీలు హెచ్చరికలు చేస్తున్నప్పటికీ, ఇప్పటివరకు ఎలాంటి కొత్త దాడులు జరిగినట్లు నిర్ధారణ కాలేదు. ప్రపంచ కంటైనర్ వాణిజ్యంలో దాదాపు 30 శాతం బాబ్ ఎల్‌మాండెబ్, సూయజ్ కాలువ మార్గం గుండానే సాగుతుంది. ఈ నేపథ్యంలో, ఇప్పటికే పలు అంతర్జాతీయ షిప్పింగ్ కంపెనీలు తమ నౌకలను ఆఫ్రికా చుట్టూ సుదీర్ఘ మార్గంలో మళ్లిస్తున్నాయి. మరోవైపు, అమెరికాకు చెందిన విమానవాహక నౌక ఈ ప్రాంతంలోకి ప్రవేశిస్తుండటం హౌతీల తదుపరి చర్యలకు పరీక్షగా నిలవనుంది. ఎర్ర సముద్రాన్ని, గల్ఫ్ ఆఫ్ ఆడెన్ మరియు హిందూ మహాసముద్రంతో కలిపే ఈ జలసంధి ప్రపంచ వాణిజ్యానికి వెన్నెముక వంటిది. ప్రపంచ మొత్తం వాణిజ్యంలో దాదాపు 12 శాతం ఈ మార్గం గుండానే జరుగుతుంది. రోజుకు సుమారు 8.8 మిలియన్ బ్యారెళ్ల చమురు మరియు సహజ వాయువు ఇక్కడి నుంచే రవాణా అవుతాయి. యూరప్ మరియు ఆసియా ఖండాల మధ్య ప్రయాణించే నౌకలు సూయెజ్ కాలువను చేరుకోవాలంటే ఈ మార్గం తప్పనిసరి. ఒకవేళ ఈ జలసంధి మూతపడితే నౌకలు ఆఫ్రికా ఖండం చుట్టూ కేప్ ఆఫ్ గుడ్ హోప్ మీదుగా ప్రయాణించాల్సి ఉంటుంది. దీనివల్ల రవాణా సమయం అదనంగా 15 నుండి 20 రోజులు పెరుగుతుంది. ప్రయాణ దూరం పెరగడం వల్ల ఇంధన ఖర్చులు, బీమా ప్రీమియంలు భారమై, వస్తువుల ధరలు ఆకాశాన్ని తాకుతాయి.

## లూనాజ్ ఆయిల్ రిఫైనరీపై డ్రోన్ల దాడులు!

**బాగ్దాద్, మార్చి 15:** ఉత్తర ఇరాక్‌లోని ఎర్బిల్ నగరంలో డ్రోన్ దాడి కలకలం సృష్టించింది. లానాజ్ ఆయిల్ రిఫైనరీ లక్ష్యంగా జరిగిన ఈ దాడిలో అక్కడ భారీగా మంటలు చెలరేగాయి. ఆకాశమంత ఎత్తున దట్టమైన నల్లటి పొగ అలుముకున్న వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ ఘటన నేపథ్యంలో రిఫైనరీలో చమురు ఉత్పత్తిని అధికారులు తాత్కాలికంగా నిలిపివేశారు. కుర్దిస్థాన్ ప్రాంత ఇంధన వనరుల మంత్రిత్వ శాఖ తెలిపిన వివరాల ప్రకారం ఆదివారం ఉదయం నాటికి మంటలను అదుపులోకి తెచ్చినప్పటికీ, పనులు ఇంకా మొదలుకాలేదు. దాడి వల్ల జరిగిన నష్టాన్ని అధికారులు అంచనా వేస్తున్నారు. అప్పటివరకు రిఫైనరీ కార్యకలాపాలు పునరుద్ధరించే అవకాశం లేదని సమాచారం. మరోవైపు, ఇరాక్ రాజధాని బాగ్దాద్‌లోని అమెరికా రాయబార కార్యాలయంపై కూడా దాడులు జరిగాయి. ఎంబసీ ప్రాంగణంలోని హెలిప్యాడ్, రాడార్ వ్యవస్థ లక్ష్యంగా సూసైడ్ డ్రోన్లు, మిస్సైళ్లతో దాడులు చేసినట్లు సమాచారం. ఈ ఘటనలో కార్యాలయ ప్రాంగణంలో మంటలు చెలరేగి ఆస్తి నష్టం వాటిల్లింది. అమెరికా, ఇజ్రాయెల్ దళాలు ఇరాన్‌పై దాడులు మొదలుపెట్టిన తర్వాత బాగ్దాద్‌లోని ఎంబసీపై దాడి జరగడం ఇది రెండోసారి. బాగ్దాద్ విమానాశ్రయం వద్ద ఉన్న అమెరికా దౌత్య కార్యాలయం, మిలిటరీ స్థావరాలను లక్ష్యంగా చేసుకుని నిరంతరం డ్రోన్ దాడులు జరుగుతున్నాయి. ఇరాన్ మద్దతు గల ఇస్లామిక్ రెసిస్టెన్స్ ఇన్ ఇరాక్ గ్రూపు ఈ దాడులకు బాధ్యత వహిస్తూ ప్రకటనలు చేస్తోంది. తాజా ఉద్రిక్తతల నేపథ్యంలో అమెరికా తన రాయబార కార్యాలయ సిబ్బందిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించింది.

# ఆచూకీలేని యాయిర్ నెతన్యాహు

## ప్రధాని కుమారుడి అదృశ్యంపై కలవరం



టెల్ అవీవ్, మార్చి 15: పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు కమ్ముకున్న వేళ ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెన్యామిన్ నెతన్యాహు కుటుంబంపై సోషల్ మీడియాలో రకరకాల ప్రచారాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా నెతన్యాహు పెద్ద కుమారుడు యాయిర్ నెతన్యాహు గత వారం రోజులుగా సోషల్ మీడియాలో ఎక్కడా కనిపించకపోవడం ఇప్పుడు చర్చనీయాంశం అయింది. ఎప్పుడూ చురుకుగా ఉంటూ, విపక్షాలపై విరుచుకుపడే యాయిర్ క్లిష్ట సమయంలో మౌనంగా ఉండటం పలు అనుమానాలకు తావిస్తోంది. యాయిర్ నెతన్యాహు ఎక్స్ వేదికగా రోజుకు సగటున 30 నుంచి 40 పోస్టులు చేస్తుంటారు. అలాంటిది ఈనెల 8వ తేదీ తర్వాత ఆయన నుంచి ఒక్క పోస్ట్ కూడా రాలేదు. ఈనెల 9న ఒక చిన్న రీపోస్ట్ తప్ప, ఆయన సొంతంగా ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదు. ఒకవైపు నెతన్యాహు ఆరోగ్యంపై, ప్రాణహానిపై ఇరాన్ అనుకూల మీడియా వార్తలు ప్రసారం చేస్తున్న వేళ, యాయిర్ ఇలా మాయం అవ్వడం కుటుంబంలో ఏదైనా విషాదం జరిగిందా అనే పుకార్లకు దారితీసింది. ప్రస్తుతం యాయిర్ నెతన్యాహు అమెరికాలోని మయామిలో నివసిస్తున్నట్లు సమాచారం. ఇరాన్‌ఇజ్రాయెల్ యుద్ధం ముదురుతున్న నేపథ్యంలో అమెరికాలోని ఇజ్రాయెల్ ప్రముఖుల కుటుంబ సభ్యులకు భద్రతా ముప్పు పొంచి ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అమెరికా మాజీ నిఘా అధికారి ఒకరు మాట్లాడుతూ ఇలాంటి ఉద్రిక్త సమయాల్లో యాయిర్ వంటి వ్యక్తులు బహిరంగంగా తిరగడం లేదా సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండటం ప్రమాదకరమన్నారు.

# కమర్షియల్ సిలిండర్ల పంపిణీ షురూ: కేంద్రం వెల్లడి

**న్యూఢిల్లీ, మార్చి 15:** దేశవ్యాప్తంగా వంటగ్యాస్ సరఫరాపై ఒత్తిడి పెరుగుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. 29 రాష్ట్రాలు మరియు కేంద్రపాలిత ప్రాంతాల్లో వాణిజ్య ఎల్‌పీజీ సిలిండర్ల పంపిణీ ప్రక్రియ ప్రారంభమైందని పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ సుజాతా శర్మ వెల్లడించారు. గ్యాస్ సిలిండర్ల నిల్వ, నల్లబజారు విక్రయాలను అరికట్టడానికి దేశవ్యాప్తంగా ఆకస్మిక తనిఖీలు, దాడులను ముమ్మరం చేసినట్లు ఆమె పేర్కొన్నారు. దేశంలో గృహావసరాలకు సరిపడా వంటగ్యాస్ నిల్వలు ఉన్నాయని, వినియోగదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. స్టాక్ తగినంతగా ఉన్నప్పటికీ, కొందరు అనవసరంగా ముందస్తు బుకింగ్‌లు చేస్తున్నారని, దీనివల్ల సరఫరా వ్యవస్థపై అనవసర ఒత్తిడి పడుతోందని సుజాతా శర్మ తెలిపారు. ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికావద్దని ఆమె కోరారు. మరోవైపు పెట్రోల్, డీజిల్ సరఫరాపై కూడా ప్రభుత్వం భరోసా ఇచ్చింది. భారత్ వద్ద తగినంత ముడి చమురు నిల్వలు ఉన్నాయని, దేశీయ రిఫైనరీలు పూర్తి సామర్థ్యంతో పనిచేస్తున్నాయని అధికారులు తెలిపారు. దేశవ్యాప్తంగా ఇంధన కొరత ఏర్పడకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని, ఎక్కడా సరఫరాకు ఆటంకం కలగదని మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది.

# తాలిబన్ స్థావరంపై పాక్ వైమానిక దాడి

**కాందహార్, మార్చి 15:** పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు తీవ్ర స్థాయికి చేరుకుంటున్నాయి. తాజాగా ఇరు దేశాల మధ్య కొత్త టెన్షన్ వచ్చి పడింది. ఆఫ్ఘనిస్థాన్‌లోని కాందహార్ ప్రాంతంలో తాలిబన్ సంబంధిత స్థావరంపై పాకిస్థాన్ వైమానిక దాడి చేసింది. ఇటీవలి డ్రోన్ దాడులకు ప్రతీకారంగా ఈ దాడి చేసినట్లు పాకిస్థాన్ పేర్కొంది. గత కొన్ని రోజులుగా పాకిస్థాన్‌లోని వివిధ నగరాలపై అనేక డ్రోన్లు కనిపించాయని చెపుతున్న పాక్ సైన్యం డ్రోన్‌లను సకాలంలో అడ్డగించామని, అవి తమ లక్ష్యాలను చేరుకోకుండా నిరోధించాయని పేర్కొంది. విచ్ఛిన్నమయ్యాక భూమి మీద పడిపోతున్న డ్రోన్ శిథిలాలు కొన్ని ప్రాంతాలలో నష్టాన్ని కలిగించాయని వెల్లడించింది. క్వెట్టాలో శిథిలాల వల్ల ఇద్దరు పిల్లలు గాయపడగా, కోహాత్, రావల్పిండిలలోనూ అనేక మంది గాయపడ్డారని తెలిపింది. ఈ సంఘటనపై తీవ్రంగా స్పందించిన పాకిస్థాన్ ఈ దాడులు జరిపినట్లు చెబుతున్నారు. దేశంలోని పౌరులను,

భద్రతా స్థావరాలను లక్ష్యంగా చేసుకోవడం పాకిస్థాన్ సైన్యం తీవ్రంగా మండిపడింది. డ్రోన్ దాడులు ఆఫ్ఘనిస్థాన్ కాందహార్‌లోని సైనిక స్థావరానికి సంబంధించినవని పాకిస్థాన్ ఆరోపించింది. తత్ఫలితంగా, పాకిస్థాన్ ఆ స్థావరాన్ని లక్ష్యంగా చేసుకుని వైమానిక దాడి ప్రారంభించింది. తాజా నివేదికల ప్రకారం డ్రోన్ కార్యకలాపాలను గుర్తించిన తర్వాత ముందు జాగ్రత్త చర్యగా ఇస్లామాబాద్ చుట్టూ ఉన్న వైమానిక ప్రాంతాన్ని తాత్కాలికంగా మూసివేశారు. ఈ సంఘటన రెండు దేశాల మధ్య సంబంధాలను మరింత దెబ్బతీస్తుందని భావిస్తున్నారు. తాలిబాన్ అనుబంధ యోధులు ఉపయోగించే కాందహార్‌లోని సాంకేతిక సౌకర్యాలు, ఆయుధ డిపోలను లక్ష్యంగా చేసుకుని పాకిస్థాన్ ఆపరేషన్ జరిగింది. కాందహార్‌లో జరిపిన దాడులపై కాబూల్ నుంచి ఇప్పటి వరకు ఎలాంటి సమాచారం అందలేదు.

# మంటల్లో పశ్చిమాసియా

## ఇస్ఫహాన్ అణుస్థావరంపై అమెరికా ఇజ్రాయెల్ దాడులు!



**టెహ్రాన్, మార్చి 15:** ఇరాన్ దేశానికి చెందిన అత్యంత కీలకమైన అణుకేంద్రంపై ఇజ్రాయెల్, అమెరికా దేశాలు వైమానిక దాడులకు పాల్పడ్డాయి. అణుకేంద్రం ఉన్న ఇస్ఫహాన్ నగరంపై అమెరికాఇజ్రాయెల్ విమానాలు విరుచుకుపడుతున్నాయి. ఆదివారం ఉదయం నుంచి ఇస్ఫహాన్‌లోని వివిధ ప్రదేశాల్లో భారీ పేలుళ్లు వినిపించాయని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. చాలాచోట్ల భారీ ఎత్తున నల్లపొగ ఆకాశాన్ని కమ్మేసింది. అమెరికాఇజ్రాయెల్ యుద్ధ విమానాలు చాలా తక్కువ ఎత్తులో ఎగురుతూ దాడులు చేసినట్లు స్థానికులు చెబుతున్నారు. అదేవిధంగా పశ్చిమ టెహ్రాన్‌లోని ఇరాన్ స్పేస్ రిసెర్చ్ సెంటర్‌పై కూడా అమెరికా ఇజ్రాయెల్ దళాలు దాడులు చేశాయి. ఇరాన్ తనకు అవసరమైన శాటిలైట్ ఇంటెలిజెన్స్ మ్యాపింగ్ సమాచారాన్ని అక్కడి నుంచే సేకరిస్తుంది. ఇదిలావుంటే ఇరాన్‌పై దాడులకు అమెరికా తన వద్ద ఉన్న బి52 బాంబర్ విమానాన్ని పంపినట్లు తెలుస్తోంది. ఇది దాదాపు 38 టన్నుల బాంబులను తీసుకెళ్లగలదు. దీనికి సంబంధించిన వీడియోను సెంట్రల్ కమాండ్ తన ఎక్స్ ఖాతాలో పోస్టు చేసింది. ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లో ఆదివారం ఉదయం దాదాపు 20 నిమిషాల వ్యవధిలోనే 20 భారీ పేలుళ్లు వినిపించినట్లు స్థానికులు వెల్లడించారు. ముఖ్యంగా నగరంలోని ఎయిర్‌పోర్టు వద్ద ఇవి చోటు చేసుకున్నట్లు చెబుతున్నారు.

## నెతన్యాహు మరణంపై వార్తలు ఫేక్: ఇజ్రాయెల్



**జెరూసలేం, మార్చి 15:** ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుకు సంబంధించిన ఓ వార్త నెట్టింట వైరల్‌గా మారింది. యుద్ధంలో ఆయన ప్రాణాలు కోల్పోయారంటూ నెట్టింట ప్రచారం జరుగుతోంది. శుక్రవారం నెతన్యాహు తన ‘ఎక్స్’ ఖాతాలో పోస్టు చేసిన విడియోనే ఈ ఊహాగానాలకు కారణం. తాజాగా ఆయన కార్యాలయం దీనిపై స్పందిస్తూ.. అవన్నీ ఫేక్ అని కొట్టిపారేసింది. అసలేం జరిగిదంటే.. ఇరాన్‌పై యుద్ధం గురించి నెతన్యాహు ఓ సమావేశంలో మాట్లాడారు. దానికి సంబంధించిన విడియోను ఇటీవల ఆయన ఎక్స్ ఖాతాలో పోస్టు చేశారు. ఆ విడియోలో నెతన్యాహు చేతికి ఆరు వేళ్లు ఉన్నట్లు కన్పించింది. దానిని ఎఐ విడియోగా నెటిజన్లు అభివర్ణించారు. ఈ క్రమంలో నెతన్యాహుకి ఏమైంది? అసలు ఆయన ప్రాణాలతో ఉన్నారా? వంటి అనేక ప్రశ్నలను నెటిజన్లు లేవనెత్తారు. యుఎస్ కన్జర్వేటివ్ వ్యాఖ్యాత కాండేస్ ఓవెన్స్ దీనిపై స్పందిస్తూ.. ‘బిబి ఎక్కడ? ఆయన కార్యాలయం ఎందుకు ఫేక్ ఎఐ విడియోను విడుదల చేసింది. ఎందుకు తొలగించింది. అమెరికా ప్రభుత్వం ఎందుకు ఆందోళనకు గురవుతోంది’ అని ఎక్స్ వేదికగా ప్రశ్నించారు. మరికొందరు కూడా విడియోలోని అంశాలపై ప్రశ్నలు లేవనెత్తుతూ పోస్టులు పెట్టారు. దీంతో ఇరాన్ దాడుల్లో ఆయన మృతి చెందారంటూ వార్తలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో నెతన్యాహు కార్యాలయం వీటిపై స్పందిస్తూ.. ఆయన క్షేమంగానే ఉన్నారని స్పష్టం చేసింది. దీంతో ఊహాగానాలన్నింటికీ చెక్ పడింది.

### వెంటాడతాం.. నెతన్యాహుకి ఇరాన్ వార్నింగ్

ఇదిలా ఉండగా.. ఇరాన్‌కు చెందిన ఐఆర్జీసీ నెతన్యాహుకి హెచ్చరికలు చేసింది. పిల్లల ప్రాణాలు తీసే వ్యక్తిగా ఇజ్రాయెల్ ప్రధానిని అభివర్ణించింది. ఆయన ఇంకా బతికే ఉంటే.. శక్తి మేరకు వెంటాడతామని వ్యాఖ్యానించింది. ఆయన మరణంపై వస్తున్న వార్తలు ఫేక్ అని ఇజ్రాయెల్ పేర్కొన్న కొన్ని గంటల్లో ఐఆర్జిసి ఈ హెచ్చరికలు చేయడం గమనార్హం. నెతన్యాహు బతికే ఉన్నారా అనే అంశంపై అస్పష్టంగానే ఉందని ఇరాన్ దళాలు పేర్కొన్నాయి. ఆయన మృతి చెంది ఉండొచ్చని.. లేదా కుటుంబంతో సహా దేశాన్ని వీడి ఉండవచ్చని తెలిపాయి.

## యుఎస్, ఇజ్రాయెల్ నౌకలకే హార్మూజ్ జలసంధి బంద్: ఇరాన్



**టెహ్రాన్, మార్చి 15:** హార్మూజ్ జలసంధి విషయంలో ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ కీలక వ్యాఖ్యలు చేశారు. కేవలం అమెరికా, ఇజ్రాయెల్ నౌకలకే దీనిని మూసివేసినట్లు ఓ వార్తా సంస్థ ఇంటర్వ్యూలో తెలిపారు. ఇతర దేశాల నౌకలు స్వేచ్ఛగా ప్రయాణించవచ్చని చెప్పారు. అయితే.. భద్రతా సమస్యల కారణంగా అనేక దేశాలు ముందుకు రావడం లేదని పేర్కొన్నారు. దీనికి ఇరాన్‌తో ఎటువంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. ప్రస్తుతం హార్మూజ్ జలసంధి మీదుగా అనేక చమురు ట్యాంకర్లు, నౌకలు ప్రయాణిస్తున్నాయని తెలిపారు. హార్మూజ్‌లో కృత్రిమ అడ్డంకుల కారణంగా చైనా, ఫ్రాన్స్, జపాన్ తదితర దేశాలు ఇబ్బంది పడుతున్నాయని, త్వరలో ఈ ప్రాంతానికి అవి తమ యుద్ధ నౌకలను పంపనున్నాయని ట్రంప్ ప్రకటించిన వేళ అరాగ్చీ ఈ మేరకు వ్యాఖ్యానించారు. నూతన సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ ఇటీవలి దాడుల్లో గాయపడ్డారని అమెరికా చేస్తున్న వాదనలపైనా స్పందిస్తూ.. ఆయనకు ఎటువంటి సమస్యా లేదని చెప్పారు. రాజ్యాంగం ప్రకారం మొజ్తాబా తన విధులను నిర్వర్తిస్తున్నారని తెలిపారు. తమ దేశం పటిష్ఠ స్థితిలో ఉందని, ఏ ఒక్క వ్యక్తిపైనా ఆధారపడి లేదని చెప్పారు. ఒకవేళ కీలక వ్యక్తులకు ప్రాణనష్టం సంభవించినా.. తట్టుకోగలదని చెప్పారు. పరిస్థితి అంతా అదుపులోనే ఉందన్నారు. గత నెలలో జెనీవాలో జరిగిన చర్చల సందర్భంగా.. అమెరికా ప్రతినిధులు స్టీవ్ విట్కాఫ్, కుష్నర్‌లపై తాను గట్టిగా అరిచానని, ఇరాన్ వద్ద 11 అణుబాంబులకు సరిపడా యురేనియం ఉందని బెదిరించానంటూ వచ్చిన ఆరోపణలనూ అరాగ్చీ ఖండించారు. తప్పుగా అర్థం చేసుకున్నారని, చర్చలకు సంబంధించిన వాస్తవాలు త్వరలోనే బయటకు వస్తాయని ఆశిస్తున్నట్లు తెలిపారు.

## సరదాకి కూడా ఖర్గ్ ద్వీపంపై మళ్లీ దాడులుచేస్తాం:ట్రంప్

**వాషింగ్టన్, మార్చి 15:** ఇరాన్‌తో కొనసాగుతున్న ఉద్రిక్తతల నడుమ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌కు చెందిన కీలకమైన ఖర్గ్ ద్వీపంపై సరదాకి కూడా మరికొన్ని దాడులు చేయొచ్చంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు విస్మయం కలిగించాయి. ఇప్పటికే అమెరికా జరిపిన దాడుల్లో ఖర్గ్ ద్వీపంలోని సైనిక లక్ష్యాలు చాలావరకు పూర్తిగా ధ్వంసమయ్యాయని ఆయన స్పష్టం చేశారు. తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ట్రూత్ సోషల్ లో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ అణు కార్యక్రమాలు,

క్షిపణి ముప్పులకు ప్రతిస్పందనగా ఇటీవల అమెరికాఇజ్రాయెల్ సంయుక్తంగా దాడులు ప్రారంభించాయి. ఇందులో భాగంగా మార్చి 13న ఖర్గ్ ద్వీపంపై అమెరికా వైమానిక దాడులు జరిపింది. ఈ నేపథ్యంలోనే ట్రంప్ తాజా హెచ్చరికలు జారీ చేశారు. ఇరాన్ ముడి చమురు ఎగుమతుల్లో దాదాపు 90 శాతం ఖర్గ్ ద్వీపం నుంచే జరుగుతాయి.




# థ్యాంక్యూ... మనమిత్ర!

● వాట్సాప్ గవర్నెన్స్‌కు టెన్త్ విద్యార్థుల అపూర్వ ఆదరణ ● హాయ్ అనగానే విద్యార్థుల చేతలో వాలిన హాల్ టికెట్లు ● హాల్ టికెట్ల కోసం 3.16 లక్షల హిట్లు ● 2.38 లక్షల మందికి వాట్సాప్ ద్వారా హాల్ టికెట్లు

విజయవాడ, మార్చి 15 ప్రభాతవార్త ప్రతినిధి: మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్‌ను పదో తరగతి విద్యార్థులు గణనీయంగా వినియోగించుకుని తమ హాల్ టికెట్లను లక్షల సంఖ్యలో దీని ద్వారా పొందారు. రాష్ట్రంలో మొట్టమొదటి సారిగా ప్రభుత్వం పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు తమ హాల్ టికెట్లను మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ 95523 00009 నెంబరు ద్వారా పొందే సదుపాయం కల్పించింది. ఈ సదుపాయాన్ని పదో తరగతి విద్యార్థులు పెద్ద ఎత్తున వినియోగించకుని హాల్ టికెట్లు పొందారు. మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్‌కు పదో తరగతి విద్యార్థుల నుంచి మొత్తం 3,16,990 హిట్‌లు వచ్చాయి. అలాగే 2,38,728 మంది విద్యార్థులు వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా తమ హాల్ టికెట్లను డౌన్‌లోడు చేసుకున్నారు. విద్యాశాఖ లీప్ యాప్ ద్వారా 65,477 మంది హాల్ టికెట్లు డౌన్లోడు చేసుకోగా, అత్యధికంగా ఆన్‌లైన్ వెబ్‌సైట్ ద్వారా 7,53,834 మంది హాల్ టికెట్లు పొందారు. విద్యార్థుల్లో పెరిగిన డిజటల్ స్పృహ: పదో తగరతి పబ్లిక్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థుల్లో డిజిటల్ స్పృహ పెరిగింది. గతానికంటే భిన్నంగా ఈ సారి విద్యార్థులు లక్షల సంఖ్యలో తమ హాల్ టికెట్లను డిజిటల్ రూపంలో ఆన్‌లైన్, మనమిత్ర, లీప్ యాప్‌ల ద్వారా పొందారు. గతంలో ఎక్కువ మంది నేరుగా పాఠశాలకు వెళ్లి ఫిజికల్‌గా హాల్ టికెట్లు పొందేవారు. ఇప్పుడు ఆ సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది.



# వంట గ్యాస్‌పై ఆందోళన వద్దు

- పౌరసరఫరాల శాఖ కమీషనర్ సౌరవ్ గౌర్

విజయవాడ, మార్చి 15 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్రంలో వంట గ్యాస్ విషయంలో వినియోగ దారులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పౌరసరఫరాల శాఖ కమీషనర్ సౌరవ్ గౌర్ స్పష్టం చేశారు. ప్రభుత్వాలు వంటగ్యాస్ సరఫరాకు ఆటంకం లేకుండా అవసరమైన అన్ని ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నాయని తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఎల్పీజీ కనెక్షన్లు 161.19 లక్షలు ఉన్నాయని, వాటిలో ఇండేన్ గ్యాస్ 56.86 లక్షలు, హెచ్ పీ 74.11 లక్షలు, భారత్ గ్యాస్ 30.22 లక్షలు ఉన్నాయన్నారు. రోజువారీ ఎల్పీజీ అవసరం 4,000 మెట్రిక్ టన్నులని తెలిపారు. ఈ నెల 15వ తేది అనగా ఆదివారం నాటికి మొత్తం ఎల్పీజీ స్టాక్ లభ్యత 15,699 మెట్రిక్ టన్నులు ఉందన్నారు. అంటే ఇది దాదాపు నాలుగు రోజులకు సరిపోతుందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో పరిస్థితి నియంత్రణలో ఉందని సౌరవ్ గౌర్ తెలిపారు. సోషల్ మీడియాల్లో వినియోగదారులను కొందరు తప్పుదారి పట్టిస్తున్నారని, నిరాధారమైన ప్రచారం చేస్తున్నారని ఆయన మండిపడ్డా. వంట గ్యాస్ దుర్వినియోగం నిరోధించడానికి ఓటీపీ ఆధారిత డెలివరీ అమలు చేస్తున్నట్లు తెలిపారు. పెండింగ్ బుకింగ్స్ పర్యవేక్షణ డిస్ట్రిబ్యూటర్ వారీగా, మార్కెట్ వారీగా, జిల్లా వారీగా, సేల్స్ ఏరియా వారీగా, ప్రాంతంవారీగా ఎప్పటి కప్పుడు చేస్తూ తగిన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. గృహ అవసరాలకు ప్రాధాన్యత ఇవ్వడానికి పరిశ్రమ లకు బల్క్ ఎల్పీజీ సరఫరా నిలిపివేశామన్నారు. ఆసుపత్రులు, హాస్టల్స్, ప్రభుత్వ సేవలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు.



## అన్నమయ్య సంకీర్తనలతో పులకించిన సప్తగిరులు

తిరుమల, మార్చి 15 ప్రభాతవార్త ప్రతినిధి: పదకవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యుల 523వ వర్ధంతి పురస్కరించుకుని తిరుమలలోని నారాయణగిరి ఉద్యానవనంలో ఆదివారం సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామివారి ఊంజల్‌సేవలో సప్తగిరి సంకీర్తనల గోష్టిగానంతో సప్తగిరులు పులకించాయి. ఈ కార్యక్రమానికి విచ్చేసిన అహోబిల మఠం 46వ మఠాధిపతి శఠగోప రంగనాథ యతీంద్ర మహాదేశికన్ స్వామి అనుగ్రహభాషణం చేశారు. అన్నమయ్యకు, వారి ఆచార్యపీఠమైన అహోబిల మఠానికి ఎంతో అనుబంధం ఉందని తెలిపారు. అన్నమయ్య విద్యాభ్యాసం, వేదశాస్త్రాలు అధ్యయనం ఇక్కడే సాగిందని చెప్పారు. అహోబిలం శ్రీ నరసింహస్వామివారి అనుగ్రహంతో శ్రీ తాళ్లపాక అన్నమా చార్యులు దీక్ష పొంది మంత్రోపదేశం పొందారని వివరించారు. ఈ మంత్రోప దేశంలోని 32 బీజాక్షరాలతో అన్నమయ్య 32 వేల సంకీర్తనలు రచించార న్నారు. అనంతరం అహోబిల మఠం తరఫున తాళ్లపాక అన్నమయ్య విగ్రహానికి వస్త్రం సమర్పించారు. టిటిడి అదనపు ఇఒ సి.హెచ్.వెంకయ్య చౌదరి స్వామీని శాలువాతో సత్కరించి ఆ ప్రసాదాలు అందజేశారు.

## జాతీయ లోక్ అదాలత్‌లో కడపకు ఫస్ట్ ర్యాంక్

### 1 లక్షా 3591 కేసులు పరిష్కారం

### జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సి.యామిని వెల్లడి

రాజంపేట, మార్చి 15 ప్రభాతవార్త: జాతీయ లోక్ అదాలత్ 1,03,591 కేసులు పరిష్కారంతో రాష్ట్ర స్థాయిలోనే కడప జిల్లాకు ప్రథమ స్థానం లభించి నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సి.యామిని ఒక ప్రకటనలో వెల్లడిం చారు. జాతీయ లోక్ అదాలత్‌లో జిల్లావ్యాప్తంగా 1,03,343 క్రిమినల్ కేసులు, 248 సివిల్ కేసులు, 53 ప్రీ లిటిగేషన్ కేసులు పరిష్కారమైనట్లు తెలిపారు. కేసులు పరిష్కారం ద్వారా 24 కోట్ల 1 లక్ష 72 వేల 158 రూపాయల మొత్తము కక్షిదారులకు చెల్లించినట్లు తెలిపారు జాతీయ లోక్ అదాలత్ నిర్వహించేందుకు జిల్లా వ్యాప్తంగా 23 బెంచీలు ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. జాతీయ లోక్ అదాలత్‌లో కడపలో 11720 కేసులు, పొద్దుటూరు, మైదుకూరులో 15303 కేసులు, రాజంపేటలో 7116 కేసులు, రాయచోటిలో 9635 కేసులు, బద్వేల్‌లో 8105 కేసులు, జమ్మలమడుగులో 9700 కేసులు, సిద్ధవటంలో 5070 కేసులు, రైల్వేకోడూరులో 6117 కేసులు, పులివెందులలో 8394 కేసులు, నందలూరులో 6055 కేసులు, లక్కిరెడ్డిపల్లిలో 10,093 కేసులు, కమలాపురంలో 6283 కేసులు పరిష్కాం మైనట్లు వివరించారు. జాతీయ లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారానికి తోడ్పడిన న్యాయవాదులకు, రెవెన్యూ సిబ్బందికి, పోలీసు అధికారులకు, ఇన్సూరెన్స్ అధికారులకు, బ్యాంకు అధికారులకు, చిట్ ఫండ్ ప్రతినిధులకు, లేబర్ డిపార్ట్మెంట్ అధికారులకు, మున్సిపల్ సిబ్బందికి, బిఎస్ఎన్ఎల్ వారికి, ఏపీ ఎస్పీడీసీఎల్ అధికారులకు, ఆల్ ఇండియా రేడియో కడప వారికి, రవాణాశాఖ అధికారులకు, ఎక్సైజ్ అధికారులకు, రైల్వే శాఖ అధికా రులకు, అడ్వకేట్ క్లర్కులకు, అగ్రికల్చరల్ అధికారులకు, మిగతా శాఖల అధికారులు అందరికీ జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ డాక్టర్ సి.యామిని, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబా ఫక్రుద్దీన్ కృతజ్ఞతలు తెలియజేశారు.

## కొండపల్లిలో ఉపేంద్ర దాస్‌కు ఘన స్వాగతం

విజయవాడ, మార్చి 15 ప్రభాతవార్త ప్రతినిధి: గంగోత్రి నుంచి రామేశ్వరం వరకు రోడ్డుపై సాష్టాంగ నమస్కారం చేస్తూ దండయాత్ర చేస్తున్న శ్రీ రాముని భక్తుడు ఉపేంద్ర దాస్ ఆదివారం కొండపల్లి పట్టణానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా హాజరత్ సయ్యద్ షా బుఖారి బాబా ఆస్థాన సూఫీ మత గురువు అల్తాఫ్ బాబా ఆయనకు ఘన స్వాగతం పలికారు. లోక కల్యాణం కోసం యాత్ర చేపట్టిన ఉపేంద్ర దాస్‌కు ఆశీస్సులు అందజేస్తూ వారి సంకల్పం విజయవంతం కావాలని ఆకాంక్షించారు. మూడేళ్లుగా కొనసాగు తున్న ఈ కఠోరమైన యాత్ర ఎంతో ఆధ్యాత్మికతతో కూడుకున్నదని, దారి పొడవునా భక్తులు, ప్రజలు ఆయనకు అవసరమైన సేవలు అందించాలని అల్తాఫ్ బాబా కోరారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా ఒక కోరికను తెలియ జేస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని, భారత దేశంలో అమరావతి రాజధాని నంబర్ వన్ స్థానంలో నిలవాలని ప్రార్థించ మని తెలిపారు. ఉపేంద్ర దాస్ మాట్లాడుతూ గంగోత్రి నుంచి రామేశ్వరానికి భూమిపై సాష్టాంగ నమస్కారం చేస్తూ చేస్తున్న ఈ దండయాత్ర ప్రధాన ఉద్దేశం ప్రపంచ శాంతి, లోక కల్యాణమని పేర్కొన్నారు. భారతదేశంలో హిందూ, ముస్లిం, క్రిస్టియన్ సహా అన్ని మతాల ప్రజలు సోదర భావంతో ఐకమత్యంతో జీవించాలని, దేశంలో శాంతి, సౌభాగ్యం, ఆయురారోగ్యాలు నెలకొనాలని ప్రార్థిస్తూ తన యాత్రను కొనసాగిస్తున్నానని తెలిపారు. స్థానిక భక్తులు, గ్రామస్థులు ఉపేంద్ర దాస్‌కు శుభాకాంక్షలు తెలిపి ఆయన యాత్ర విజయవంతం కావాలని ఆకాంక్షించారు.

# పేదల జీవితాలను నట్టేట ముంచుతున్న మోడీ

● ఉపాధి హామీ చట్టానికి గాంధీ పేరు తొలగించడం దారుణం ● ఉపాధి హామీ పరిరక్షణ యాత్రలో పిసిసి చీఫ్ షర్మిల




పార్వతీపురం (మన్యం జిల్లా), మార్చ్ 15 ప్రభాతవార్త: ఉపాధి హామీ పథకానికి తూట్లు పొడుస్తున్నారని పేరు మార్పు చేస్తున్నామని చెబుతూ పథకాన్ని పూర్తిగా నిర్వీరామం చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ పిసిసి అధ్యక్షురాలు వైయస్ షర్మిల విమర్శించారు. ఆదివారం ఉపాధి హామీ పరిరక్షణ యాత్ర సందర్భంగా ఆమె కురుపాం నియోజకవర్గం డంగభద్ర గ్రామంలో రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మన్రేగా పథకానికి రాష్ట్రంలో గండి పెడుతూనే ఉన్నారని, ప్రతి ఏడాది జాబ్ కార్డుల్లో కోతలు పెడుతున్నారని అన్నారు. వైయస్సార్ హయాంలో ఆనాడు రాష్ట్రంలో కోట్ల మంది ప్రజల జీవితాల్లో కరువు పని వెలుగులు నింపిందని గ్రామీణ ప్రాంత ప్రజల జీవితాల్లో మార్పు తెచ్చి రాష్ట్రంలో వలసలను పూర్తిగా అరికట్టిందని అన్నారు. ఇప్పుడు బిజెపి ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని ఖూనీ చేస్తుందని పథకం ప్రకారమే ఉపాధి హామీ చట్టాని నిర్వీర్యం చేస్తున్నారని అన్నారు. మోదీ తెచ్చిన విబిజి రాంజీ చట్టం గ్రామ స్వరాజ్యానికి విరుద్ధం అని అన్నారు. ఉపాధి పని చట్టానికి గాంధీ పేరు తొలగించడం దారుణమని మండిపడ్డారు. ఆనాడు ఆర్ఎస్ఎస్ వాది గాడ్సే గాంధీని చంపారు ఇప్పుడు పథకానికి గాంధీ పేరు తొలగించి మోడీ మళ్లీ గాంధీని చంపారని విమర్శించారు. మన్రేగా చట్టానికి, మోడీ తెచ్చిన కొత్త చట్టానికి నక్కకు నాగలోకానికి ఉన్నంత తేడా ఉంది అని అన్నారు. ఇప్పుడు పని గంటలు 6 గంటలు నుండి 12 గంటలకు పెంచడం దారుణమని అన్నారు. కొత్త చట్టంలో నిర్ణయాధికారం గ్రామసభల నుంచి తొలగించి ఉపాధి హామీ కింద ఏం పని చేయాలో కేంద్ర ప్రభుత్వమే చెప్తుందట ఉపాధి హామీ కూలీలను కాంట్రాక్టర్లకు పనికి వచ్చే లేబర్ కింద వాడుతున్నారు అని షర్మిల విమర్శించారు. బిజెపి బినామీలకు కమీషన్ల కింద నిధులను తరలించడానికి కొత్త పథకం తెచ్చారని, మోడీ తెచ్చిన కొత్త చట్టం రాష్ట్రానికి పెనుభారం అని ఆక్షేపించారు. ఇప్పటికే జగన్, బాబు కలిసి రాష్ట్రాన్ని అప్పుల కుప్ప చేశారు అని అన్నారు. ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తుంటే జగన్ సైతం నోరు విప్పటం లేదని, బిజెపి ఎదుట జగన్ సాగిల పట్టడని అన్నారు. రాష్ట్రంలో బాబు, జగన్, పవన్ ముగ్గురు బిజెపికి బానిసలే అని అన్నారు. ముగ్గురు కలిసి బిజెపికి బినామీలుగా మారారు అని విమర్శించారు. బిజెపి చేసే మత రాజకీయాలకు మద్దతు తెలపడమే వైసిపి పని అని రాష్ట్ర అభివృద్ధిపై ఈ ముగ్గురికి, కేంద్రంలో బిజెపికి పట్టింపు లేదు అని విమర్శించారు. రాష్ట్రంలో విభజన హామీలు నెరవేరాలి అంటే కాంగ్రెస్ అధికారంలో రావాలి అని కాంగ్రెస్ అధికారంలో ఉంటేనే రాష్ట్ర అభివృద్ధి అని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వంగల దాయలనాయుడు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ బత్తిన మోహన్ రావు, పార్టీ శ్రేణులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## తెలుగు సంప్రదాయాల్లోని శాస్త్రీయ విజ్ఞానాన్ని వివరించే పర్వదినం 'ఉగాది'

విజయవాడ, మార్చి 15 ప్రభాతవార్త ప్రతినిధి: తెలుగువారి సంప్రదాయాల్లో దాగిన వున్న శాస్త్రీయ విజ్ఞాన ఔనతికి వివరించే పర్వదినం 'ఉగాది' అని పలువురు వక్తలు అన్నారు. ఉగాది పచ్చడితో సహా పండుగ సందర్భంగా చేసే వంటకం, క్రతువు మనిషి మనస్సును ఆలుము కున్న చీకటి తొలిగించి శ్వాంతన కలిగిస్తాయ న్నారు.

చక్కటి ఆరోగ్యానికి బాట వేస్తాయ న్నారు. శ్రీ పరాభవ నామ తెలుగు సంవత్సర ఉగాది పర్వదినానికి స్వాగతం పలుకుతూ ఆది వారం విజయవాడ ఠాగూర్ స్మారక గ్రంథాల యం సభా వేదికపై సరస్వతి సామ్రాజ్యం అధ్యక్షులు అయ్యంకి మురళీకృష్ణ సౌజన్యంతో కవి సమ్మేళనం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా కాకాని తరుణ్, సుప్రసిద్ధ సాహిత్యవేత్తలు డా. గుమ్మా సాంబశివరావు, డా. జి.వి. పూర్ణచందు. గ్రంథాలయ అధికారిణి రమాదేవి మాట్లాడు తూ ఉగాది ఓ ఏడాది ఆరంభానికి తొలిరోజుగా అనుకున్నా, గత అనుభవాలు నేర్పిన పాఠాలను గమనించి. వర్తమానంలో బతుకు సవరించుకోవడానికి సహకరించే దిక్సూచి అన్నారు. ఈ కార్యక్రమంలో కవులు తమ కవితలను షడ్రుచుల సాక్షి గా విందుగా శ్రోతలకు వినిపించారు. ఇందులో మన సంస్కృతి, సంప్రదాయాలు, ప్రస్తుత యుద్ధ పరిస్థితులపై కవులు కప్పగంతుల రామకృష్ణ, చలపాక ప్రకాష్ వివరించారు.

ఈ కార్యక్రమంలో కవులను అభినందించి, ఘనంగా సన్మానించారు. సన్మానాలు అందుకున్న వారి పరాభవ నామ సంవత్సర నామాలు కావురి సత్యవతి, సిరిపురపు అన్నపూర్ణ, కొనేరు కల్పన, పెర్ల దాసు, వెలురి సుధారాణి, పాణిగ్రాహి రాజశేఖర్, గద్దం విజయరావు, యం. అంజయ్య, మంచిరాజు మీనా కుమారి, స్రినివసరవు వరలక్ష్మి, హర్షిత, మదాలి నిర్మల, సిమ్హాద్రి వాణి, కమతం సరళ, మంజుల, విజయ్ కుమార్, యశోద పూర్ణ, కొగిలి రాజశేఖర్, చిత్రంద కిశోర్ కుమార్, తుమ్మల స్నిగ్ధ మాధవి, పాటిబండ్ల కవిత, తోట పద్మాలయ, తిలక్, సెశమాంబ, రాజు, విజయ, గస్తీస్వర రావు, యస్ఆర్‌యస్ శర్మ, ఆంజనేయ కుమార్, సామినేని శైలజ, స్వర్ణ వాహిని, చిత్తలురి సత్యనారాయణ ఉన్నారు.

## ఉత్తరాంధ్రలో మూడ్రోజులు విభిన్న వాతావరణం

విజయవాడ, మార్చి 15 ప్రభాతవార్త ప్రతినిధి: ఉత్తరాంధ్ర జిల్లాల్లో రానున్న మూడు రోజుల్లో భారీ ఉష్ణోగ్రతలతో ఎండలు, మరోవైపు మేఘావృతమైన ఆకాశంతో విభిన్న వాతావరణం నెలకొంటుందని వాతావరణ శాఖ అంచనా వేసింది. ఈ నేపథ్యంలో ఆయా జిల్లాలకు అలర్ట్ జారీ అయ్యింది. నైరుతి దిశ నుంచి వీచే గాలుల ప్రభావంతో రేపు, శ్రీకాకుళం, విజయనగరం, మన్యం జిల్లాల్లో పలుచోట్ల పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది.

అల్లూరి, పోలవరం, విశాఖ, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, తూర్పు, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసేందుకు అవకాశం ఉంది.

ఇక ఆకస్మిక వర్షాలతో పడే పిడుగుపాటు విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, చెట్ల కింద నిలబడరాదని ఏపీ విపత్తు నిర్వహణ సంస్థ సూచించింది.



## నీలగిరి సంఘంలో కార్డన్ అండ్ సెర్చ్

- సరైన పత్రాలు లేని 22 బైకులు, 3 ఆటోలు స్వాధీనం

నెల్లూరు క్రైం, మార్చి 15, ప్రభాతవార్త: ఆపరేషన్ వజ్రప్రహార్‌లో భాగంగా దర్గామిట్ట పోలీస్ స్టేషన్ పరిధిలోని నీలగిరి సంఘంలో పోలీస్ అధికారులు ఆదివారం కార్డన్ అండ్ సెర్చ్ నిర్వ హించారు. జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల ఆదేశాల మేరకు దర్గామిట్ట సీఐ కళ్యాణ్ రాజు ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా, సంబంధిత నేరాలను అరికట్టడమే లక్ష్యంగా ఈ ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. పోలీసు అధికారులు, సిబ్బంది, స్పెషల్ టీమ్‌లు కలిసి గుర్తించిన హాట్‌స్పాట్ ప్రాంతాలలో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ముఖ్యంగా మాదకద్రవ్యాల వినియోగం జరుగుతున్నట్లు అనుమానం ఉన్న ప్రాంతాల లోనూ, పాత గంజాయి, నార్కోటిక్ కేసులలో ఉన్న ముద్దాయిలను పోలీసులు సోదాలు నిర్వ హించారు. ఈ కార్డన్ సెర్చ్ ఆపరేషన్‌లో భాగంగా మొత్తం 70 మంది పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలీసులు విస్తృతం గా తనిఖీలు నిర్వహించి ప్రజల వివరాలు, వాహనాల వివరాలు, అనుమానాస్పద వ్యక్తులపై పరిశీలన చేపట్టారు. ఈ ఆపరేషన్‌లో భాగంగా మొత్తం 250 ఇళ్లను తనిఖీ చేశారు. సరైన పత్రాలు లేని 22 బైకులు, 3 ఆటోలను స్వాధీనం చేసుకున్నారు. పాత కేసుల్లో ఇద్దరు వ్యక్తులను విచారించి వారికీ సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారు లు ప్రజలకు మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే ఆరోగ్య, సామాజిక, చట్టపరమైన దుష్పరిణా మాల గురించి అవగాహన కల్పించారు. గంజాయి, ఇతర మాదకద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తును నాశనం చేస్తుందని, కుటుంబ వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతుందని వివరిం చారు. ప్రజలు తమ పరిసర ప్రాంతాల్లో గంజాయి లేదా ఇతర మాదకద్రవ్యాలకు సంబంధించిన సమాచారం ఉంటే వెంటనే ఈగాల్ టోల్ ఫ్రీ నెంబర్ 1972కు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. సమాచారం ఇచ్చే వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని హామీ ఇచ్చారు.

## గ్యాస్ కొరతను సృష్టించింది పాలకులే

### - రైతు కూలీ సంఘం ఆరోపణ

విజయవాడ, మార్చి 15 ప్రభాతవార్త ప్రతినిధి: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు కానుకగా కేంద్ర ప్రభుత్వం సిలిండర్ కు వంద రూపాయలు ధరను ఏకకాలంలో పెంచడం ప్రజలను విస్మయానికి, ఆందోళనకు గురిచేసింది కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్ర అపభ్రంశం చెందుతున్న ఈ సమయంలో కేంద్ర ప్రభుత్వాన్ని కాపాడటం కోసం రాష్ట్ర ప్రభుత్వాలు కూడా కుమ్మక్కయి గ్యాస్ కొరతను సృష్టించటం ద్వారా ధరలు పెంపు అన్న అసలు సమస్య నుంచి ప్రజలను దృష్టిని మళ్లిస్తున్నారు అని రైతుకూలీ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రాంబాబు ఆరోపించారు ఇప్పటి వరకు రాష్ట్రంలో గ్యాస్ కొరతలేదు. ఇప్పటి వరకు లేని గ్యాస్ కొరత ఈ సందర్భంలోనే రావటం, గ్యాస్ అందకపోతే వంట చేయడం ఎలా అన్న ఆందోళనను పాలకులే ప్రజలలో కల్పించటం ద్వారా గ్యాస్ సిలిండర్ ధరలు పెరిగినా సరే సర్దుకుపోదాం! రోడ్డెక్కిఆందోళన ఇంకేం చేస్తాం! అన్న మానసిక స్థితిని ప్రజలలో పాలకులే కల్పించటం కోసమే గ్యాస్ స్పెక్యులేషన్ కొరతను విస్తృతంగా ప్రచారంలోకి తెచ్చారని అన్నారు. నిజానికి గ్యాస్ కొరత లేనప్పటికీ సిలిండర్ ధరలను పెంచడం వలన ప్రజలలో అసంతృప్తి నుంచి మళ్లించడానికి గ్యాస్ కొరత ఏర్పడినట్టు, ఏ కొరతలు లేకుండా ప్రజలకి గ్యాస్‌ను అందుబాటులోకి తీసుకురావడానికి మేము ఎంతో శ్రమ చేస్తున్నామనీ కాబట్టి ప్రజలు ఎవరూ గ్యాస్ దొరకటం లేదని ఆందోళన పడవద్దని రాష్ట్ర పాలకులందరూ మాట్లాడుతున్నారు. అంటే దీని అర్థం పెరిగిన ధరల నుంచి ప్రజల దృష్టిని మళ్లించడం కోసం అని స్పష్టమవుతోందని అన్నారు.. కనుక పాలకుల మోసపూరిత బుద్ధిని గ్రహించాలని కోరారు. ఇప్పటికైనా ప్రజలు గ్యాస్ ధరల పెంపుదలకు వ్యతిరేకంగా బలమైన ఆందోళనలకు సిద్ధం కావాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

## విద్యుత్ సమస్యలపై మాకు చెప్పండి

### నేడు డయల్ యువర్ ఎస్‌పిడిసిఎల్ సిఎండి

తిరుపతి, మార్చి 15 ప్రభాతవార్త ప్రతినిధి: తిరుపతి ఎస్‌పిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయం పరిధిలోని తొమ్మిదిజిల్లాల విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం నేటి ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12:30 వరకు "డయల్ యువర్ ఎస్‌పిడిసిఎల్ సిఎండి కార్యక్రమం" నిర్వహిస్తు న్నారు. ఈ కార్యక్రమాన్ని సంస్థ సిఎండి సిఎండి శివశంకర్ లోతేటి స్వయం గా పాల్గొని వినియోగదారుల సమస్యలపై పరిష్కారం చూపుతారు. ప్రతి సోమవారం నిర్వహించే డయల్ యువర్ సిఎండి కార్యక్రమం ద్వారా తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, కడప, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల నుంచి వినియోగదారులు 89777 16661కు కాల్ చేసి తమ విద్యుత్ సమస్యలను సిఎండి దృష్టికి తీసుకు రావచ్చని తెలిపారు. వినియోగదారులు తమ వద్ద విద్యుత్ సర్వీసు నంబరు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని కోరారు. సర్కిల్ స్థాయిలోనూ డయల్ యువర్ ఎస్ఈ సర్కిల్ స్థాయిలో కూడా ప్రతి సోమవారం ఉదయం 8.30 నుండి 9.30 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని సిఎండి తెలిపారు. జిల్లాస్థాయిలో తమ విద్యుత్ సమస్యలను సూపరింటెండింగ్ ఇంజనీర్ దృష్టికి తీసుకువచ్చేందుకు వీలుగా వినియోగదారులు తిరుపతి: 87126 52679, చిత్తూరు: 79931 47979, నెల్లూరు: 08612 320427, అన్నమయ్య: 94408 17449, కడప: 08562 242457, కర్నూలు: 73826 14308, నంద్యాల: 73826 18976, అనంతపురం: 91547 90350, శ్రీసత్యసాయి: 99637 07847 సదవకాశాన్ని విద్యుత్తు వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## విద్యార్థి ప్రాణం తీసిన పోలీసుల అత్యుత్సాహం

గన్నవరం(కృష్ణా), మార్చి 15, ప్రభాతవార్త: ట్రాఫిక్ పోలీసుల అతి ఇంజనీ రింగ్ విద్యార్థి నిండుప్రాణాన్ని బలిగొంది. సేకరించిన సమాచారం మేరకు గన్నవరం మండలం కేసరపల్లి గ్రామానికి చెందిన ఇంజనీరింగ్ చివరి సంవ త్సరం చదువుతున్న పలగాని ప్రణయ్, తన తమ్ముడు కౌషిక్‌ను ట్యూషన్‌లో దింపేందుకు శనివారం సాయంత్రం ఇంటి వద్ద నుండి ద్విచక్రవాహనంపై చిన్నఆవుటపల్లికి వెళుతుండగా, జాతీయ రహదారిపై గన్నవరం శివారు ఆర్‌టిఏ చెక్‌పోస్టు వద్ద ట్రాఫిక్ పోలీసులు వాహన తనిఖీలు చేస్తున్నారు. ఈక్రమంలో బైక్ నడుపుతన్న ప్రణయ్‌కు డ్రైవింగ్ లైసెన్స్ లేకపోవటం తోపాటు, హెల్మెట్ లేకపోవటంతో పోలీసుల్ని తప్పించుకునేందుకు ప్రయత్నిం చారు. ఇదే క్రమంలో వీరిద్దర్ని ఆపేందుకు ట్రాఫిక్ పోలీసు చేసిన ప్రయత్నం విఫలం కాగా వీరిద్దరూ ఎదురుగా వస్తున్న మినీవ్యాన్‌ను ఢీకొట్టారు. ఈప్రమాదంలో ప్రణయ్‌కు తీవ్రగాయాలు కాగా కౌషిక్‌కు గాయాల య్యాయి. వైద్యచికిత్స నిమిత్తం అన్నదమ్ములిద్దర్నీ చిన్నఆవుటపల్లి పిన్నమనేని సిద్ధార్థ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ ప్రణయ్ మృతి చెందాడు. ట్రాఫిక్ పోలీసు బైక్ హ్యాండిల్ పట్టుకుని ఆపేందుకు ప్రయత్నించటం వల్లే బైక్ అదుపుతప్పి ఈప్రమాదం జరిగిందని మృతుని కుటుంబసభ్యులు ఆరోపిస్తు న్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈప్రమాదంలో తమ తప్పేమిలేదంటూ ట్రాఫిక్ పోలీసులు ప్రమాదస్థలంలోని సిసి కెమెరా పుటేజిని మీడియాకు విడుదల చేసారు.



## జల్లేరు జలాశయంలో నీట మునిగి ఇద్దరు మృతి

బుట్టాయిగూడెం, మార్చి 15 ప్రభాతవార్త: బుట్టాయిగూడెం మండలం అలివేరు సమీపంలో ఉన్న జల్లేరు జలాశయంలో ఆదివారం ఘోర విషాదం చోటుచేసుకుంది. దేవరపల్లి మండలం యాదవోలు కు చెందిన తుమ్మల నాగరాజు (30), తుమ్మల రమణ(35 )లు కుటుంబ సభ్యులతో కలిసి బుట్టాయిగూడెం మండలంలోని కామవరం అటవీ సమీపంలో ఉన్న గుబ్బల మంగమ్మ తల్లి దర్శనానికి వచ్చారు. దర్శనం అనంతరం సమీప ప్రాంతం లోని జల్లేరు జలాశయానికి సరదాగా గడపడానికి బంధువులు, స్నేహితులతో కలిసి వెళ్లారు. అనంతరం స్నానానికి దిగిన నాగరాజు, రమణ లు ప్రమాదవశాత్తు నీట మునిగి గల్లంతయ్యారు. అది గమనించిన బంధువులు వారిని కాపాడేందుకు ప్రయత్నించినా, ప్రయత్నం విఫలం అవడంతో నీటిలో మునిగి మృత్యువాత పడ్డారు. సమాచారం తెలుసుకున్న స్థానిక పోలీసులు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని గల్లంతైన వారి కోసం స్థానికుల సహాయంతో జలాశయంలో తీవ్రంగా గాలించి నాగరాజు, రమణల మృతదేహాలను వెలికితీశారు. ఒక్కసారిగా ఇద్దరు వ్యక్తులు మృతి చెందడంతో ఆ ప్రాంతంలో విషాద ఛాయలు అలముకున్నాయి. మృతుల కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

## ట్రాన్స్‌పోర్ట్ అధికారుల సంఘం ఎన్నికలు ఏకగ్రీవం

గుంటూరు, మార్చి 15 ప్రభాతవార్త ప్రతినిధి: ఆంధ్రప్రదేశ్ ట్రాన్స్‌పోర్ట్ శాఖ జోన్-3 టెక్నికల్ అధికా రుల సంఘం ఎన్నికలు ఏకగ్రీవం అయినట్లు ఎన్నికల అధికారి, ఎపియన్‌జిజిఓ అసోసియేషన్ ఒంగోలు పట్టణ అధ్యక్షుడు కొత్తపల్లి మంజేష్ ప్రకటించారు. ఈ సందర్భంగా జరిగిన నామినేషన్ల ప్రక్రియ అనంతరం ఒక్కొక్క పోస్టుకు ఒక్కో అభ్యర్థి నామినేషన్ దాఖలు పరచగా ఎన్నికలు ఏకగ్రీవం గా జరిగినట్లు మొత్తం 9 మంది ఎన్నిక అయినట్లు ఎన్నికల అధికారి పేర్కొన్నారు. ఈ ఎన్నికలలో జోన్ 3 పరిధి లో నూతన కార్యవర్గానికి అధ్యక్షునిగా మంగళగిరి మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వి.బాలకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కె.జయప్రకాశ్, ట్రెజరర్‌గా కావలి అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కె కరుణాకరన్ ఎన్నిక అయ్యారు. గుంటూరు డిస్ట్రిక్ట్ రెప్రజెంటేటివ్స్‌గా మొత్తం ఆరుగురు ఏకగ్రీవం అయ్యారు. వీరిలో తెనాలి అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ జి.అమృత రాణి, నరసరావుపేట అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సిహెచ్ మనీషా, చీరాల అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కె.రవి నాయక్, ప్రకాశం జిల్లా అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ బి.భానుప్రకాష్, నెల్లూరు జిల్లా అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఏ.మల్లికార్జున్ రెడ్డి, మార్కాపురం జిల్లా అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కెఎల్ రావు ఏకగ్రీవం అయ్యారు. సహాయ ఎన్నికల అధికారిగా ఒంగోలు తాలూకా కార్యదర్శి మక్దూం షరీఫ్, ఎన్నికల పరిశీలకు లుగా జిల్లా కార్యనిర్వ హక కార్యదర్శి బి. కృష్ణకిషోర్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో జోన్-3 పరిధిలోని గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం, మార్కాపురం, నెల్లూరు జిల్లా కార్యవర్గ సభ్యులు, ఉద్యోగులు పాల్గొని నూతనంగా ఎన్నిక అయిన జోనల్ అధ్యక్ష, కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులను అభినందించారు.

## రూ.1.50 కోట్లు విలువ చేసే నగలు కొట్టేశాడు

### - ఘనంగా వివాహంతో గుమస్తా మోసం పెడనలో వెలుగులోకి

విజయవాడ, మార్చి 15 ప్రభాతవార్త ప్రతినిధి: కృష్ణా జిల్లా పెడనలోని ఓ ప్రముఖ నగల దుకాణంలో పనిచేసే గుమస్తా భారీ మోసానికి పాల్పడ్డాడు. యజమానుల నమ్మకాన్ని అవకాశంగా తీసుకుని సుమారు రూ.1.50 కోట్ల విలువైన బంగారం, వెండి ఆభరణాలను మాయం చేశాడు. ఇటీవల అతను చేసుకున్న ఘనమైన వివాహమే ఈ బాగోతాన్ని బయటపడింది. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

వివరాల్లోకి వెళితే.. పెడనకు చెందిన ఓ యువకుడు స్థానిక నగల దుకాణంలో ప్రధాన గుమస్తాగా పనిచేస్తున్నాడు. దుకాణ యజమానులు మరోచోట నివసిస్తుండటంతో, ఇదే అదనుగా కొంతకాలంగా దుకాణంలోని ఆభరణాలను పక్కదారి పట్టిస్తున్నాడు. సుమారు నెల రోజుల క్రితం ఆ యువకుడి వివాహం అంగరంగ వైభవంగా జరిగింది. తన స్థాయికి మించి అతడు ఖర్చు చేయడాన్ని గమనించిన యజమానులకు అనుమానం కలిగింది. వెంటనే వారు దుకాణానికి వచ్చి స్టాక్ లెక్కలు సరిచూసుకోగా, భారీగా తేడా ఉన్నట్లు గుర్తించారు. గుమస్తాను నిలదీయడంతో అసలు విషయం బయటపడింది.

యజమానులు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ, కేసు ఇంకా నమోదు కాలేదని, పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో యజమానులు యువకుడి ఇంటి నుంచి కొన్ని వెండి వస్తువులను, లక్షల్లో నగదును స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.

## డ్రగ్స్ పార్టీలో ఎంపి పట్టుబడటం సిగ్గుచేటు

### తక్షణమే పదవికి, పార్టీకి రాజీనామా చేయాలి

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య

విజయవాడ, మార్చి 15 ప్రభాతవార్త ప్రతినిధి: ఏలూరు టిడిపి ఎంపి పుట్టా పుట్టా మహేశ్‌కుమార్ యాదవ్ డ్రగ్స్ పార్టీలో పట్టబడి రాజ్యాంగబద్ధమైన తన పదిని దుర్వినియోగం చేశారని, తక్షణమే ఆయన పదవికి రాజీనామా చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. అలాగే టిడిపి అధినేత, సిఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్, హోంమంత్రి వంగలపూడి అనిత ఈ సంఘటనకు బాధ్యత వహించాలన్నారు. ఈ మేరకు ఆదివారం ఈశ్వరయ్య ఒక ప్రకటన విడుదల చేశారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో తమ కూటమి పార్టీ డ్రగ్స్ నియంత్రణ కోసం పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నదని సిఎం చంద్రబాబు నుంచి మంత్రి నారా లోకేశ్, హోం మంత్రి అనిత వరకు ఆర్భాటంగా ఉపన్యాసాలు చేశారన్నారు. ఇప్పుడు ఏకంగా తన టిడిపికి చెందిన ఎంపీనే డ్రగ్స్ పార్టీలో పట్టుబడటం సిగ్గుచేటని, ఎంపి డ్రగ్స్ సేవించినట్లు తెలంగాణ పోలీసులు నిర్ధారించడంతో దీనిపై చంద్రబాబు, లోకేశ్, అనిత రాష్ట్ర ప్రజలకు సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేశారు. బాధ్యతగల ఎంపి ఈ తరహా చర్యలకు పాల్పడి రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ చర్చానీయాంశమయ్యారని పేర్కొన్నారు. ఈ ఘటన ద్వారా రాజకీయ నేతలకు, డ్రగ్స్ మాఫియాకు సంబంధాలున్నాయని ఆరోపణలకు బలం చేకూరుతోందని స్పష్టం చేశారు. ఒక వైపు ఢిల్లీలో పార్లమెంట్ సమావేశాలు జరుగుతుండగా అక్కడకు వెళ్లి ప్రజా సమస్యలపై స్పందించాలిసిన ఎంపి ఇలా వీకెండ్ డ్రగ్స్ పార్టీలో పట్టుబడటం బాధ్యతా రాహిత్యమని, ఓట్లేసి గెలిపించిన ఎంపీ.. ప్రజలకు ఏం సమాధానం ఇస్తారని సూటిగా ప్రశ్నించారు. రాష్ట్రంలో డ్రగ్స్ నివారణపై సీఎం చంద్రబాబుకు చిత్తశుద్ధి ఉంటే ముందు తన పార్టీ ఎంపీపై చర్యలు తీసుకోవాలన్నారు. యువత భవిష్యత్తును దెబ్బతీసే ఈ ప్రమాదకరమైన పరిస్థితిని అరికట్టడానికి ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చంద్రబాబుకి ఏమాత్రం నైతిక విలువలున్నా మహేష్ యాదవ్‌ను తక్షణమే టిడిపి నుంచి సస్పెండ్ చేయాలన్నారు.

## మహేష్‌తో ఎంపి పదవికి రాజీనామా చేయించాలి

### - మాజీ ఎమ్మెల్యే టిజెఆర్ సుధాకర్‌బాబు డిమాండ్

విజయవాడ, మార్చి 15 ప్రభాతవార్త ప్రతినిధి: ఏలూరు ఎంపి పుట్టా మహేష్ యాదవ్‌తో పార్లమెంట్‌కి రాజీనామా చేయించడంతో పాటు ఆయన్ను తెలుగుదేశం పార్టీ నుంచి తక్షణం సస్పెండ్ చేయాలని వైయస్సార్సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే టిజెఆర్ సుధాకర్ బాబు డిమాండ్ చేశారు. తాడేపల్లిలోని వైయస్సార్సీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ "డ్రగ్స్ తీసుకుంటూ దొరికిన ఎంపీ పుట్టా మహేష్ యాదవ్‌కి ఎంపీగా కొనసాగే అర్హత ఏ మాత్రం లేదు. బాధ్యతాయుతమైన పదవిలో ఉండటానికి ఆయన అనర్హుడు. ఆయన తక్షణం తన పదవికి రాజీనామా చేయాలి. చంద్రబాబుకి ఏమాత్రం నైతిక విలువలున్నా మహేష్ యాదవ్‌ను తక్షణం తెలుగుదేశం పార్టీ నుంచి సస్పెండ్ చేయాలి. రాష్ట్ర యువతను పట్టిపీడిస్తున్న డ్రగ్స్ మహమ్మారిని లేకుండా చేయాలంటే నిందితులు ఎంతటి వారైనా వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. లేదంటే యువత ఇలాంటి వారిని చూసి పెడదోవ పట్టే ప్రమాదం ఉంది. అసలే వేళాపాలా లేకుండా రాష్ట్రంలో కల్తీ మద్యం ఏరులై పారిస్తూ యువతను సర్వనాశనం చేసిన చంద్రబాబు, ఇప్పుడు డ్రగ్స్ నిందితులను కూడా కాపాడితే ఆయన చరిత్ర హీనుడిగా మిగిలిపోతారు" అని తేల్చి చెప్పారు.

## విజయవాడలో రేపు 'లైఫ్ ఫర్ నేచర్' సదస్సు

విజయవాడ, మార్చి 15 ప్రభాతవార్త ప్రతినిధి: ఆంధ్రప్రదేశ్ లైఫ్ ఫర్ నేచర్ అనే అంశంపై రెండురోజుల సదస్సును విజయవాడలో నిర్వహిస్తున్నట్లు సి.ఆర్.మీడియా అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్‌కుమార్ తెలిపారు. విజయవాడ రామరప్పాడులోని ఒక ప్రయివేటు హోటల్‌లో ఆనెల 17, 18 తేదీల్లో జరిగే ఈసదస్సును దిహెబిటెట్ ట్రస్ట్, సియంఎస్ వాతావరణ్ (న్యూఢిల్లీ) సంస్థలు సంయుక్తంగా నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఈ సదస్సుకు నాలెడ్జ్ పార్టనర్‌గా సి.ఆర్.మీడియా అకాడమీ వ్యవహరిస్తున్నట్లు ఆయన వివరించారు.



## లోయలో పడిపోయిన బస్సు

### ఏడుగురు భారత్ యాత్రికులు దుర్మరణం

**కఠ్మాండు, మార్చి 15:** నేపాల్‌లో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. మనకమాన ఆలయాన్ని దర్శించుకుని తిరిగి వస్తున్న భారత యాత్రికుల బస్సు లోయలో పడిపోవడంతో ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. మరో ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ విషాద ఘటన గోర్ఖా జిల్లాలో జరిగింది. గోర్ఖా జిల్లాలోని షాహిద్ లఖన్ రూరల్ మున్సిపాలిటీ పరిధిలోని కాంతార్ ప్రాంతంలో బస్సు అదుపుతప్పి లోయలో పడిపోయిందని జిల్లా పోలీస్ అధికారి, డీఎస్పీ రాజ్ కుమార్ శ్రేష్ఠ తెలిపారు. ప్రమాద సమయంలో బస్సులో డజనుకు పైగా ప్రయాణికులు ఉన్నట్లు సమాచారం. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం భరత్‌పూర్‌లోని చిత్వాన్ మెడికల్ కాలేజీకి తరలించినట్లు ఆయన చెప్పారు. సహాయక చర్యలు కొనసాగుతున్నాయని వివరించారు. మనకమాన ఆలయం నుంచి తనాహు జిల్లాలోని అన్‌బుఖైరేని వైపు బస్సు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగిందని గోర్ఖా చీఫ్ డిస్ట్రిక్ట్ ఆఫీసర్ తులసి బహదూర్ శ్రేష్ఠ తెలిపారు. నిటారుగా ఉన్న రహదారిపై ఎలక్ట్రిక్ మైక్రోబస్సు అదుపు కోల్పోవడం వల్లే ప్రమాదం జరిగి ఉండవచ్చని పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. ప్రమాదానికి కారణాలు ఇంకా తెలియరాలేదు.




## పశ్చిమాసియా దేశాల్లో సిబిఎస్ఇ పరీక్షలు రద్దు

**న్యూఢిల్లీ, మార్చి 15:** పశ్చిమాసియా దేశాల్లో భారతీయ విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సిబిఎస్ఇ) ఒక కీలక నిర్ణయం తీసుకుంది. అనిశ్చిత పరిస్థితుల కారణంగా ఇప్పటికే పలు మార్లు వాయిదా పడిన పరీక్షలను బోర్డు ఇప్పుడు పూర్తిగా రద్దు చేస్తున్నట్లు అధికారికంగా ప్రకటించింది. గల్ఫ్ రీజియన్‌లోని ప్రధాన దేశాల్లో నివసిస్తున్న భారతీయ విద్యార్థులకు ఈ నిర్ణయం వర్తిస్తుంది. బహ్రెయిన్, ఇరాన్, కువైట్, ఒమన్, ఖతార్, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ దేశాల్లో ఈ పరీక్షలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈనెల 16 నుంచి ఏప్రిల్ 10 మధ్య జరగాల్సిన 12వ తరగతి ప్రధాన పరీక్షలతో పాటు, వాయిదా పడిన పది ఇతర పరీక్షలను కూడా రద్దు చేశారు. దాడుల కారణంగా నిర్వహించలేకపోయిన పదో తరగతి పరీక్షలను కూడా రద్దు చేసినట్లు బోర్డు స్పష్టం చేసింది. పరీక్షలు జరగని పక్షంలో విద్యార్థుల ప్రతిభను ఎలా అంచనా వేస్తారనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. దీనిపై సీబీఎస్ఈ స్పందిస్తూ ఫలితాల గణన ప్రక్రియను త్వరలోనే వెల్లడిస్తామని పేర్కొంది. విద్యా నిపుణుల అంచనా ప్రకారం ఈ క్రింది అంశాల ఆధారంగా గ్రేడింగ్ ఇచ్చే అవకాశం ఉంది. పాఠశాల స్థాయిలో నిర్వహించిన యూనిట్ టెస్టులు, బోర్డు పరీక్షలకు ముందు జరిగిన మాక్ ఎగ్జామ్స్ మార్కులు, విద్యార్థులు సమర్పించిన ప్రాజెక్ట్ వర్క్, ల్యాబ్ పరీక్షల పనితీరు, విద్యా సంవత్సరం పొడవునా విద్యార్థి చూపిన ప్రతిభ ఆధారంగా ఫలితాలను ఇవ్వనున్నారు.



పాశుపతేశ్వర ఆలయం పరిశీలిస్తున్న చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఇఓ వీకే శీనా నాయక్ తదితరులు



హైకోర్టు న్యాయమూర్తి దుర్గమ్మవారి చిత్రపటం అందజేస్తున్న దృశ్యం

# పాశుపతేశ్వర ఆలయ పునరుద్ధరణకు చర్యలు

### - 19నుండి 28 వరకు వసంత పుష్పార్చన

ఇంద్రకీలాద్రి, మార్చి 15 ప్రభాతవార్త: ఇంద్రకీలాద్రిపై పాశుపతేశ్వర ఆలయ పునరుద్ధరణకు సన్నాహాలు ప్రారంభమయ్యాయి. ఈ మేరకు చారిత్రక ఆధారాలను పరిశీలించిన అనంతరం శిథిలావస్థలో ఉన్న పాశు పతేశ్వర ఆలయాన్ని ఆదివారం చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఇఓ వీకే శీనా నాయక్, ట్రస్ట్ బోర్డు సభ్యులు సందర్శించారు. వారణాసి శైలిలో నాలుగు ద్వారాలతో నిర్మితమై, ప్రస్తుతం శిథిలావస్థలో ఉన్న ఈ చారిత్రక ఆలయాన్ని వారు పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఈవో శీనా నాయక్ మాట్లాడుతూ "పాశుపతేశ్వర ఆలయ పునరుద్ధరణ కోసం భక్తుల నుండి పెద్ద ఎత్తున విజ్ఞప్తులు వస్తున్నాయి. దీనిపై ఇప్పటికే ప్రభుత్వానికి నివేదిక పంపాము. కొండపైకి వెళ్లే దారిని సుగమం చేయడం, ఆలయ ప్రాంగణాన్ని శుభ్రపరచడం వంటి పనులపై దేవదాయ శాఖ మంత్రి, కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాము" అని పేర్కొన్నారు. ఈ పర్యటనలో ట్రస్ట్ బోర్డు సభ్యులు హరికృష్ణ, దేవస్థానం ఇంజినీరింగ్ సిబ్బంది మరియు ఆలయ అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

**ఆలయంలో గ్యాస్ కొరత లేదు:** ఇంద్రకీలాద్రిపై వేంచేసియున్న శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారి దేవస్థానానికి గ్యాస్ కొరత ఏమీ లేదని, గ్యాస్ ఏజెన్సీలు తగినన్ని సిలిండర్లను ఎప్పటికప్పుడు సరఫరా చేస్తున్నాయని ఇఓ వికె శీనా నాయక్ స్పష్టం చేశారు. భక్తులకు అందించే ప్రసాదాల తయారీ మరియు నిత్య అన్నదాన వితరణ యధావిధిగా సాగుతున్నాయన్నారు. రాబోయే పండుగలు, భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దేవస్థానం తగినన్ని గ్యాస్ నిల్వలను సిద్ధం చేసుకుందన్నారు. గ్యాస్ సరఫరా విషయంలో భక్తులు, ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రచారాలను నమ్మవద్దని తెలిపారు

**వేదోక్తంగా సూర్యఉపాసన:** శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో ఆదివారం సూర్యోపాసన పూజలు అత్యంత వైభవంగా నిర్వహించబడ్డాయి. ఆలయ వైదిక కమిటీ, వేద పండితులు లోక కళ్యాణం కోసం, భక్తుల ఆరోగ్య ప్రాప్తి కోసం వేద మంత్రోచ్చారణల మధ్య సూర్య భగవానుడికి ప్రత్యేక అర్చనలు, నమస్కారాలు నిర్వహించారు. భక్తులు విశేషంగా పాల్గొన్నారు.

**దుర్గమ్మవారి సేవలో హైకోర్టు జడ్జి:** దుర్గమ్మవారిని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బాలాజీ మెడమల్లి దంపతులు ఆదివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వేద పండితులు ఆయనకు వేదాశీర్వచనం అందజేశారు. అనంతరం ఆలయ అధికారులు అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదం మరియు చిత్రపటాన్ని బహుకరించారు.

**ఆలయ అభివృద్ధికి విరాళం:** శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో జరుగుతున్న అభివృద్ధి పనులకు అంబేద్కర్ కోనసీమ జిల్లా, కోమరిగిరిపట్నం గ్రామానికి చెందిన కొప్పాడి రమేష్, వారి కుటుంబ సభ్యులు రూ. 2,50,000 విరాళాన్ని అందజేశారు.



## ఫాస్టాగ్ వార్షిక పాస్ ధర రూ.3,075కి పెంపు



**న్యూఢిల్లీ, మార్చి 15:** దేశంలో నేషనల్ హైవేలపై ప్రయాణించే ప్రయాణికులకు ఏప్రిల్ 1 నుంచి ఫాస్టాగ్ వార్షిక పాస్ ధరలు పెరుగుతున్నాయి. జాతీయ రహదారులపై టోల్ చెల్లింపులను సులభతరం చేసే ఉద్దేశంతో ప్రవేశపెట్టిన ఫాస్టాగ్ వార్షిక పాస్ పథకం ఇప్పుడు కాస్త ప్రియం కానుంది. 2026-27 ఆర్థిక సంవత్సరానికి గానూ ఈ పాస్ ధరలో స్వల్ప పెంపును అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ జారీ చేసిన అధికారిక ఉత్తర్వు ప్రకారం, ఏప్రిల్ 1 నుండి, ప్రైవేట్ వాహనాల ఫాస్టాగ్ వార్షిక పాస్ ధరను రూ.3,075కు పెంచారు. ఇంతకుముందు, ఈ ధర రూ.3వేలుగా ఉండేది. ఈ పాస్ ప్రైవేట్ కార్లు, జీపులు, వ్యాన్‌ల వంటి వాణిజ్యేతర వాహనాలకు వర్తిస్తుంది. రహదారులపై పదే పదే టోల్ చెల్లించాల్సిన ఇబ్బందిని తొలగించడం, డిజిటల్ పద్ధతిలో టోల్ వసూళ్లను ప్రోత్సహించడం దీని ప్రధాన లక్ష్యం. ఫాస్టాగ్ కలిగిన ఏ ప్రైవేట్ వాహనమైనా ఈ పాస్‌ను కొనుగోలు చేయడానికి అర్హత కలిగి ఉంటుంది. ఒకసారి యాక్టివేట్ అయిన తర్వాత, ఈ వార్షిక పాస్ ఒక సంవత్సరం పాటు లేదా గరిష్టంగా 200 ప్రయాణాల వరకు చెల్లుబాటు అవుతుంది, ఈ రెండింటిలో ఏది ముందుగా పూర్తయితే అంతవరకు ఇది వర్తిస్తుం ది. ప్రస్తుతం, దేశవ్యా ప్తంగా 5 మిలియన్లకు పైగా వాహన యజమా నులు ఫాస్టాగ్ వార్షిక పాస్‌ను వినియోగి స్తున్నారు. జాతీయ రహదారులపై ప్రైవేట్ కార్లకు సంబంధించిన మొత్తం టోల్ లావాదేవీలలో సుమారు 28 శాతం ఇప్పుడు ఈ వార్షిక పాస్ ద్వారానే జరుగుతున్నాయి. నేషనల్ హైవేలపై తరుచుగా ప్రయాణించే వ్యక్తులు ఈ పథకంలో లబ్ధి పొందుతున్నారు. భారతదేశంలో ఫాస్టాగ్ విధానం తొలిసారిగా 2016లో ప్రవేశపెట్టారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం ఇప్పటి వరకు మారు 118.6 మిలియన్ల ఫాస్టాగ్స్ జారీ చేసారు. సుమారు 59 మిలియన్ల ఫాస్టాగ్స్ ప్రస్తుతం యాక్టీవ్‌గా ఉన్నాయి. ప్రస్తుతం జాతీయ రహదారులపై టోల్ ద్వారా వచ్చే ఆదాయంలో 98 శాతానికి పైగా వీటి ద్వారానే వసూలు అవుతుంది. మీరు జాతీయ రహదారులపై తరచుగా ప్రయాణించేవారై ఉండి, ఇంకా ఫాస్టాగ్ వార్షిక పాస్ లేకుంటే, మీరు దీనిని నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్ఎఐ), రోడ్డు రవాణా మరియు రహదారుల మంత్రిత్వ శాఖ అధికారిక వెబ్‌సైట్ల ద్వారా గానీ, లేదా రాజ్‌మార్గ్‌యాత్రె మొబైల్ అప్లికేషన్ ద్వారా గానీ కొనుగోలు చేయవచ్చు. ఇప్పటికే ఉన్న పాస్‌లను కూడా ఇదే పద్ధతులను ఉపయోగించి పునరుద్ధరించుకోవచ్చు. వినియోగదారులు తమ ఫాస్టాగ్‌కు లింక్ అయిన అకౌంట్‌లో లాగిన్ అవ్వాల్సి ఉంటుంది. వాహన రిజిస్ట్రేషన్ నంబర్, మొబైల్ నంబరును నమోదు చేయాల్సి ఉంటుంది. దీని తర్వాత యుపిఐ, డెబిట్ కార్డు, క్రెడిట్ కార్డు, నెట్ బ్యాంకింగ్ ద్వారా చెల్లింపు చేయవచ్చు. చెల్లింపు పూర్తయిన వెంటనే, ఆ పాస్ నేరుగా ఫాస్టాగ్‌కు లింక్ అవుతుంది. సాధారణంగా 24 గంటలలోపు యాక్టివేట్ అవుతుంది. వాహన యజమాని ఒక సంవత్సరం పాటు లేదా గరిష్టంగా 200 టోల్ ప్రయాణాల వరకు దీని ప్రయోజనాలను పొందవచ్చు.

## పిఎన్జీ కనెక్షన్ ఉంటే ఎల్పీజి వదులుకోవాల్సిందే!

### కేంద్ర పెట్రోలియం శాఖ నోటిఫికేషన్

**న్యూఢిల్లీ, మార్చి 15:** ఇరాన్‌పై యుద్ధం భారత్‌లో వంటగ్యాస్ (ఎల్పీజీ) ఆందోళనల్ని పెంచుతోంది. యుద్ధం వల్ల ఎల్పీజీ కొరత ఏర్పడుతుందనే భయంతో ప్రజలు పానిక్ బుకింగ్స్ చేస్తున్నారు. సాధారణం కన్నా ప్రతీ రోజు 25 లక్షల సిలిండర్లు ఎక్కువగా బుక్ అవుతున్నట్లు కేంద్ర ఇప్పటికే ప్రకటించింది. ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని, దేశంలో చమురు, గ్యాస్ కొరత లేదని చెబుతున్నా ప్రజల్లో భయాలు ఇంకా తగ్గడం లేదు. ఈ సంక్షోభం నేపథ్యంలో కేంద్రం కొందరికి షాక్ ఇచ్చింది. పైప్డ్ నేచురల్ గ్యాస్ పిఎన్జీకనెక్షన్, డొమెస్టిక్ లిక్విఫైడ్ పెట్రోలియం గ్యాస్ (ఎల్పీజీ) కనెక్షన్ రెండూ ఉన్నవారు రెండో దాన్ని సరెండర్ చేయాలని కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. ఏదైనా ప్రభుత్వ చమురు కంపెనీ లేదా పంపిణీదారుడు ద్వారా వారికి సిలిండర్ రీఫిల్ బుకింగ్స్ నిలిపేయాలని పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. నోటిఫికేషన్ ప్రకారం ఇంట్లో పైప్డ్ నేచురల్ గ్యాస్ (పీఎన్జీ) కనెక్షన్ ఉన్న కుటుంబాలు తమ వద్ద ఉన్న డొమెస్టిక్ ఎల్పీజీ కనెక్షన్‌ను వెంటనే సరెండర్ చేయాలని కేంద్ర పెట్రోలియం శాఖ ఆదేశించింది. పీఎన్జీ కనెక్షన్ ఉన్నవారు ఇకపై సిలిండర్ రీఫిల్స్ బుక్ చేయకూడదని, ప్రభుత్వ చమురు సంస్థల నుంచి కొత్త ఎల్పీజీ కనెక్షన్లు తీసుకోవడంపై కేంద్రం నిషేధించింది. ఈ నిబంధనలు తక్షణమే అమలులోకి వస్తాయని ప్రభుత్వం నోటిఫికేషన్ పేర్కొంది. ఇరాన్, ఇజ్రాయిల్‌అమెరికా యుద్ధం కారణంగా హోర్ముజ్ జలసంధిని ఇరాన్ మూసేసింది. దీంతో గల్ఫ్ ప్రాంతాల నుంచి చమురు, గ్యా సరఫరాలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. భారత్ తన ఎల్పీజీ అవసరాల్లో 60 శాతం దిగమతి చేసుకుంటుంది. ఇందులో 85 -90 శాతం సౌదీ, ఖతార్ వంటి గల్ఫ్ దేశాల నుంచి వస్తోంది. ఈ కారణంగా దేశంలో ఎల్పీజీ సంక్షోభం ఏర్పడింది.

## ఆస్తులు కొల్లగొట్టిన వ్యక్తిపై ఐఎఎస్ రాధికారస్తోగి ఫిర్యాదు

### ఐపిఎస్ తండ్రిని మోసం చేశాడని ఆరోపణ

### పోలీసులు కేసు నమోదు

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), మార్చి 15, ప్రభాతవార్త:** చిన్ననాటి నుంచి ఆశ్ర యం ఇచ్చిన వ్యక్తి తమ కుటుంబసభ్యులను నమ్మించి ఆర్థిక అక్రమాలకు పాల్పడ్డారంటూ ఒక విశ్రాంత ఐపిఎస్ కుమార్తె అయిన మహారాష్ట్ర కేడర్‌కు చెందిన ఐఎఎస్ రాధికారస్తోగి చేసిన ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీ సులు కేసు నమోదు చేశారు. ఈ వ్యవహారంపై ముంబైలోని కఫ్ఫ్ పెరేడ్ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన జీరో ఎఫ్ఐఆర్ బదలీ నేపథ్యంలో జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ఈ కేసు నమోదు చేశారు. జూబ్లీహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. జూబ్లీహిల్స్ ప్రశాసన్‌నగర్‌లో నివసించిన విశ్రాంత ఐపిఎస్ అధికారి పేరం వెంకయ్య 1995లో ప్రశాసన్‌నగర్‌లో ఇంటి నిర్మాణం చేపట్టే సమయంలో కూలీగా పనిచేసే ఓ వ్యక్తి కుమారుడు విజయ్‌కు మానవతా దృక్పథంతో ఆశ్రయమిచ్చి చదువు, జీవన వ్యయాలు భరిం చారు. ఈ క్రమంలోనే అతడు ఐపిఎస్ కుటుంబానికి చాలా నమ్మకస్తుడిగా మారాడు. దీంతో విజయ్‌కు వారే దగ్గరుండి క్రాంతి అనే మహిళతో వివా హం చేయడమే కాకుండా ఇంట్లోనే ఆశ్రయం ఇచ్చారు. అయితే 2015లో పేరం వెంకయ్య గాయపడటం, ఆయన ఆరోగ్యం క్షీణించడంతో విజయ్ కుటుంబ ఆర్థిక వ్యవహారాలపై పూర్తి నియంత్రణ సాధించినట్లు రాధికారస్తోగి తన ఫిర్యాదులో పేర్కొన్నారు. బ్యాంకు ఖాతాలు, ఎటిఎం కార్డులు, చెక్‌బుక్‌లను తన ఆధీనంలోకి తీసుకుని అనుమతి లేకుండా రూ.27,51,766 వరకు అనుమానాస్పదంగా ఉపసంహరించుకున్నట్లు గుర్తించారు. వెంకయ్య మరణానికి ఒకరోజు ముందు రూ.40 వేలను చెక్కును నగదుగా మార్చినట్లు గుర్తించారు. వెంకయ్య చివరిరోజుల్లో ఆయనకు సరైన వైద్యసంరక్షణ ఇవ్వకుండా నిర్లక్ష్యం చేశారని, ఆరోగ్యం క్షీణించిన విషయాన్ని పిల్లలమైన తమకు ఎవరికి తెలియజేయలేదని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. తమ తండ్రి మరణం తరువాత ఆయన వ్యక్తిగత డైరీలు, కొన్ని పత్రాలు, ఇంట్లోని నగదు, కొంత బంగారం కూడా కనిపించ లేదన్నారు. విజయ్ తనను వెంకయ్య దత్త పుత్రుడిగా పరిచయం చేసుకుంటూ వివిధ వ్యాపారాలు, ఆస్తులు కూడ బెట్టుకున్నట్లు అనుమానాలున్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. రాధికా రస్తోగి ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. సంపంగి విజయ్, అతని భార్య క్రాంతి వారి అను యాయులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## బెట్టింగ్ యాప్‌కు బానిసై యువకుడి ఆత్మహత్య

**హైదరాబాద్, మార్చి 15, ప్రభాతవార్త:** ఆన్‌లైన్ గేమింగ్, బెట్టింగ్‌కు బానిసగా మారిన ఓ యువకుడు అప్పుల ఊబీలో కూరుకుపోయి ఆత్మహత్యకు పాల్పడ్డ వైనం నిజామాబాద్ జిల్లాలో సంచలనం రేపింది. వివరాలు ఇలా వున్నాయి. డిచ్‌పల్లి మండలం నడిపల్లి తండాకు చెంఇన బదావత్ అరుణ్ అనే యువకుడు తెలంగాణ యూనివర్శిటీలో చిరుద్యోగిగా పని చేస్తున్నాడు. కొంతకాలంగా అరుణ్ ఆన్‌లైన్ గేమింగ్‌తో పాటు బెట్టింగ్‌కు బానిసగా మారాడు. ఈ క్రమంలో అందిన ప్రతీచోట అప్పులు చేసి, ఆఖరుకు తన బైక్‌ను కూడా తాకట్టుపెట్టాడు. అయినా అప్పులు తీరక పోవడంతో ఇంట్లో గొడవలకు దిగాడు. బైక్‌ను తనఖా పెట్టిన విషయమై అరుణ్‌ను తల్లి నిలదీసింది. దీంతో శనివారం రాత్రి తన ఇంట్లో ఎవరు లేని సమయంలో అరుణ్ ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనిపై సమాచారం అందిన వెంటనే అరుణ్ మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. డిచ్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఆరు నెలల క్రితమే అరుణ్ తండ్రి అనారోగ్యంతో చనిపోవడం, ఇప్పుడు అందివచ్చిన కుమారుడు కూడా ఆత్మహత్యకు పాల్పడడంతో అతని తల్లి ఆవేదన అందరిని కలచివేసింది.

# వాతావరణంలో అనూహ్య మార్పులు

### తెలంగాణలో బెంబేలెత్తిపోతున్న రైతులు

### ప్రస్తుతం కంకి ఈనె దశలో వరి పంట

### నేల రాలనున్న మామిడి.. నేల వాలనున్న మొక్కజొన్న

### కల్లాల్లో ఉన్న వేరుశనగ, మిర్చి పంట దిగుబడులు

### 20 వరకు పలు జిల్లాలకు వర్ష సూచన

**హైదరాబాద్, మార్చి 15, ప్రభాతవార్త:** వాతావరణంలో చోటు చేసుకుంటున్న అనూహ్య మార్పులతో రాష్ట్రంలోని అన్నదాతలు బెంబేళెత్తిపోతున్నారు. నిన్నమొన్నటి వరకు ఎండలు దంచికొట్టగా ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా ఉదయం నుంచే ఆకాశం మేఘావృతమై చల్లని గాలులువీచాయి. ఈ నేపథ్యంలో ఈ నెల 20 వరకు రాష్ట్ర వ్యాప్తంగా ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రంహెచ్చరించింది. ఉత్తర, పశ్చిమ జిల్లాల్లో 40 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. అయితే వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ సమాచారంతో ప్రజలు కాసింత ఉపశమనం పొందుతున్నా రైతులు మాత్రం బెంబేళెత్తిపోతున్నారు. ప్రస్తుతం రైతులు సాగు చేసిన యాసంగి పంటలు చేతికొచ్చే సమయం కావడంతో ఈ సమయంలో ఈదురుగాలులు, వర్షాలతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం పొంచి ఉంది. ప్రస్తుతం వేరుశనగ, మిర్చి, పసుపు తదితర పంటలు కొన్ని ప్రాంతాల్లో కోత దశలో ఉండగా మరికొన్ని ప్రాంతాల్లో కల్లాల్లో ఉన్నాయి. ఇలాంటి సమయంలో వర్షాలు పడితే రైతులకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. ప్రస్తుతం యాసంగి వరి పంట కంకి ఈనేద దశలో ఉంది. ఈ దశలో అకాల వర్షాలు,వ డగళ్లు కురిస్తే తాలు పోయే ప్రమాదముందని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.మామిడి, టమాట, కూరగాయలతోపాటు మొక్కజొన్న సాగు చేసిన రైతులకు కూడా తీవ్ర నష్టం వాటిల్లనుంది. ఈ నెల 17వరకు ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, మెదక్, సిద్దిపేట, సంగారెడ్డి, వికారాబాద్, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ అధికారులు హెచ్చరించింది.

పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, పిడుగులు, ఈదురు గాలులతో కూడిన వడగళ్ల వానలుకూడా పడే అవకాశం ఉందని రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేశారు.

ప్రధానంగా ఉత్తర, పశ్చిమ జిల్లాలైన నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. సోమవారం హైదరాబాద్, రంగారెడ్డి, వికారాబాద్, సంగారెడ్డి, మేడ్చల్, మహబూబ్‌నగర్ తదితర జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని పేర్కొంది. కేవలం వర్షమే కాకుండా, సెకనుకు 40 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో వీచే బలమైన గాలులు, భీకరమైన ఉరుములు, మెరుపులతో కూడిన వడగళ్ల వానలు ప్రజలను బెంబేలెత్తించనున్నట్టు తెలిపింది. ముఖ్యంగా మధ్యాహ్నం నుంచి అర్థరాత్రి వరకు ఈ వర్షాల ప్రభావం అత్యంత తీవ్రంగా ఉంటుందని వాతావరణశాఖ హెచ్చరిస్తోంది. అదేవిధంగా హైదరాబాద్‌లో మార్చి 18 19 తేదీల్లో మధ్యాహ్నం నుంచి తెల్లవారుజాము వరకు ఎడతెరిపి లేని భారీ వర్షం కురిసే అవకాశం ఉన్నందున, ట్రాఫిక్ ఇబ్బందులు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యే ముప్పు ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు. దాదాపు నెలన్న రోజులుగా తెలంగాణలో ఎండల తీవ్రత రోజురోజుకు పెరుగుతోంది. ఉదయం 9గంటల దాటితే బయటకు రావాలంటే ఎండ తీవ్రతతో ప్రజలు ఇబ్బందులు పడాల్సి పరిస్థితి నెలకొంది. మధ్యాహ్నం సమయంలో ప్రధాన రహదారులన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. సాయంత్రం సమయంలో ఉక్కపోతతో ఇబ్బందులు తప్పడం లేదు. ఈ నేపథ్యంలో ఈ నెల 20 వరకు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణశాఖ సమాచారంతో ప్రజలు ఊరట చెందుతున్నారు. అయితే ముఖ్యంగా వర్షాలు పడే సమయంలో పిడుగులు పడే అవకాశం ఉందని, ఈదురు గాలులు వీస్తాయని, ఆ సమయాల్లో ప్రజలు చెట్ల కింద, హోర్డింగ్‌లు, విద్యుత్ స్తంభాలు, విద్యుత్ తీగలు ఉండే ప్రాంతాల్లో ఉండొద్దని, సురక్షిత ప్రాంతాల్లోకి వెళ్లాలని వాతావరణశాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు.


సిన్నర్‌తో మెద్వదెవ్ టైటిల్ ఫైట్
అల్కరాజ్ వరుస 16 విజయాలకు బ్రేక్

# అల్కరాజ్ జైత్రయాత్రకు మెద్వదెవ్ బ్రేక్

**కాలిఫోర్నియా:** ప్రపంచ నంబర్‌వన్ కార్లోస్ అల్కరాజ్ వరుస విజయాలకు బ్రేక్ పడింది. ఇండియానా వెల్స్ ఓపెన్‌లో స్పెయిన్ స్టార్ అల్కరాజ్ జైత్రయాత్రకు రష్యా ప్లేయర్ డానిల్ మెద్వదెవ్ బ్రేక్ వేశాడు. పురుషుల సింగిల్స్ సెమీఫైనల్లో మెద్వదెవ్ 6-3, 7-6తో వరుస సెట్లలో అల్కరాజ్‌పై గెలుపొందాడు.నాలుగు ఏస్‌లు సంధించిన మెద్వదెవ్... తొలి సెట్‌ను సులువుగా కైవసం చేసుకున్నాడు. అయితే రెండో సెట్‌లో అల్కరాజ్ నుంచి గట్టిపోటీ ఎదురైంది. ఇద్దరూ పోటాపోటీగా తలపడడంతో రెండో సెట్ రసవత్తరంగా సాగింది. మ్యాచ్ టై బ్రేక్ వరకు వెళ్లింది. టై బ్రేక్‌లో అల్కరాజ్ ఒత్తిడికి గురై రెండు డబుల్ ఫాల్ట్‌లు చేయడంతో మెద్వదేవ్ ఖాతాలో రెండో సెట్ చేరింది. ఈ విజయంతో మెద్వదెవ్ ఫైనల్లో ప్రవేశించారు. ఇండియన్ వెల్స్ టోర్నీలో మెద్వదెవ్ ఫైనల్ చేరడం ఇది మూడోసారి. 2023, 2024లో ఫైనల్ చేరినా రన్నరప్‌తోనే సరిపెట్టాడు. అల్కరాజ్ వరుస 16 విజయాలకు బ్రేక్ పడింది.

మరో సెమీస్‌లో ప్రపంచ రెండో ర్యాంకర్ జానిక్ సిన్నర్ 6-2, 6-4తో నాలుగో సీడ్ అలెగ్జాండర్ జ్వెరెవ్‌ను ఓడించి టైటిల్ పోరుకు అర్హత సాధించాడు. సోమవారం జరగనున్న పురుషుల సింగిల్స్ ఫైనల్లో సిన్నర్‌తో మెద్వదెవ్ అమీతుమీ తేల్చుకోనున్నాడు.



తొలి కప్ ముద్దాడిన వేళ ఆంటోనెల్లి భావోద్వేగం

# చైనా గ్రాండ్ ప్రి విజేత ఆంటోనెల్లి

**షాంఘై:** 19 ఏళ్ల ఇటాలియన్ కిమి ఆంటోనెల్లి తొలిసారి ఫార్ములా వన్ నెగ్గాడు. గ్రాండ్ ప్రి నెగ్గిన రెండో అతిపిన్న వయస్కుడిగా నిలిచాడు. షాంఘై వేదికగా జరిగిన చైనా గ్రాండ్ ప్రి పార్ములాను పోల్ టాప్‌తో ప్రారంభించినఆంటోనెల్లి ఆరంభంలో వెనకబడ్డాడు.మధ్య ల్యాప్‌లలో వేగంగా దూసుకుపోయాడు. మెర్సిడెస్ సహచరుడు జార్జ్ రస్సెల్ కంటే 5 సెకన్ల ముందు పూర్తి చేసి విజేతగా ఆవిర్భవించాడు. మెర్సిడెస్ డ్రైర్ జార్స్ రస్సెల్ రెండో స్థానంలో, ఫెరారీ డ్రైవర్ లూయిస్ హామిల్టన్ మూడో స్థానంలో నిలిచారు.తొలి రెండు స్థానాలు మెర్సిడేస్‌కు దక్కగా, లూయిస్ హామిల్టన్ ఫెరారీ కోసం తన తొలి పోడియం దక్కించుకున్నాడు.477రోజుల తర్వాత లూయిస్ హామిల్టన్ పోడియంపై నిలిచాడు. 2024లో లాస్‌వేగాస్ గ్రాండ్ ప్రి తర్వాత హామిల్టన్‌కు ఇది మొదటి పోడియం.చైనా గ్రాండ్ ప్రి నెగ్గిన తర్వాత కిమి ఆంటోనెల్లి భావోద్వేగానికి గురయ్యాడు. అనంతరం షాంపెన్‌తో విజయ సంబరాలు చేసుకున్నాడు.మెర్సిడేస్ సహచరులు అతన్ని అభినందించారు.గెలిచిన తర్వాత మాటలురాలేదని ఆంటోనెల్లి అన్నాడు. ఈ కలను సాధించడంతో తనకు సహాయం చేసిన జట్టుకు ధన్యవాదాలు తెలిపాడు. ఛాంపియన్ రస్సెల్.. యువ సహచరుడు ఆంటోనెల్లిని ఛాంపియన్ రేసులో ముందున్న రస్సెల్ పత్రం సలతో ముంచెత్తాడు. మొదటి రేసును గెలవడం ఎల్లప్పుడూ చాలా ప్రత్యేకమైందన్నాడు.

# బహ్రెయిన్, యుఎఇ ఫార్ములావన్ రద్దు

**అబుదాబి:** పశ్చిమాసియా నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో 2026 సీజన్‌లో జరగాల్సిన బహ్రెయిన్, సౌదీ గ్రాండ్ ప్రి రేసులను రద్దు చేస్తున్నట్లు ఫార్ములా వన్ యాజమాన్యం అధికారికంగా ప్రకటించింది. క్రీడాకారులు, సిబ్బంది భద్రత దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం.. ఏప్రిల్ 12న బహ్రెయిన్ గ్రాండ్ ప్రి, ఏప్రిల్ 19న సౌదీ అరేబియా గ్రాండ్ ప్రి రేసులు జరగాలి ఉంది. ఈ రద్దు వల్ల 2026 ఫార్ములా వన్ ఛాంపియన్‌షిప్ రేసుల సంఖ్య 24 నుంచి 22 కి పడిపోయాయి. ఇప్పటికే బిజీగా ఉన్న షెడ్యూల్ కారణంగా, ఈ రేసులను మళ్ళీ నిర్వహించే అవకాశం లేదని తెలుస్తోంది. ఇక, మార్చి 29న జరగనున్న జపాన్ గ్రాండ్ ప్రి తర్వాత, నేరుగా మే 3న మయామి గ్రాండ్ ప్రిక్స్ జరగనుంది. దీంతో సీజన్ మధ్యలో ఐదు వారాల గ్యాప్ ఏర్పడింది.



# డ్రామాలు చేస్తే కుదరదు: జైషా

## పాక్, బంగ్లాకు వార్నింగ్



**ముంబై:** క్రికెట్‌లో ఐసీసీనే సుప్రీం అని పరోక్షంగా పాకిస్థాన్, బంగ్లాదేశ్‌లు చురకలంటించాడు ఐసీసీ ఛైర్మన్ జైషా. భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమిచ్చిన టీ20 ప్రపంచకప్‌లో పాకిస్థాన్, బంగ్లాదేశ్ నాటకాలపై ఎట్టకేలకు జైషా మౌనం వీడారు. భారత్‌లో ఆడేందుకు నిరాకరించిన బంగ్లా దేశ్ టోర్నీ నుంచి తప్పుకుంది. బంగ్లాదేశ్‌కు సంఘీ భావంగా పాకిస్థాన్ కూడా టీ20 ప్రపంచకప్‌లో టీమిండియాతో జరిగే మ్యాచ్‌ను బాయ్‌కాట్ చేస్తానని బెదిరించింది. చివరకు యూటర్న్ తీసుకుని మ్యాచ్ ఆడింది. టీ20 ప్రపంచకప్ ముగిసిన వారం రోజులకు జైషా దీనిపై స్పందించాడు. ముంబైలో జరిగిన ఇండియన్ బిజినెస్ లీడర్ అవార్డులలో మాట్లాడుతూ.. కొన్ని జట్ల డ్రామాలతో టోర్నమెంట్ ఎలా ప్రమాదంలో పడిందో వెల్లడించారు. కొన్ని జట్లు పాల్గొన బోమని బెదిరింపులకు దిగినా, వాటన్నింటినీ అధిగమించి విజయవంతంగా మెగా టోర్నీ నిర్వహించినట్లు చెప్పారు. ఐసీసీ కంటే ఏ జట్టు గొప్పది కాదని స్పష్టం చేశారు.

### పాక్‌పై బంగ్లాదే సిరీస్

**మిర్పూర్:** బంగ్లాదేశ్ సొంతగడ్డపై పాకిస్థాన్‌ను ఓడించి మూడు వన్డేల సిరీస్‌ను 2-1తో కైవసం చేసుకుంది. మిర్పూర్ వేదికగా జరిగిన మూడో, చివరి వన్డేలో పాకిస్తాన్‌ను11రన్స్‌తో ఓడించింది. టాంజిద్ హాసన్(107 బంతుల్లో 107 రన్స్) శతకంకు తోడు లిటన్ దాస్(41), తౌహిద్48) రాణించడంతో బంగ్లాదేశ్ 50ఓవర్లలో 5 వికెట్లకు 290 రన్స్ చేసింది. అనంతరం లక్ష్య చేధనలో విఫలమైన పాక్ 279 రన్స్‌కు ఆలౌటైంది.కెప్టెన్ సల్మాన్ అఘా(98బంతుల్లో 106 రన్స్) సెంచరీతో ఒంటరిపోరాటం చేశాడు. బంగ్లాదేశ్ బౌలర్లలో టస్కిన్ 4, ముస్తాఫిజుర్ 3 వికెట్లు తీశారు.

# సౌతాఫ్రికా దెబ్బకు కివీస్ విలవిల



**మౌంట్ మంగన్యూ:** న్యూజిలాండ్ పర్యటనను దక్షిణాఫ్రికా ఘనంగా ఆరంభించింది. అయిదు టీ20ల సిరీస్‌లో భాగంగా మౌంట్ మంగన్యూ వేదికగా జరిగిన తొలి టీ20లో న్యూజిలాండ్‌పై 7 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన కివీస్.. సౌతాఫ్రికా బౌలర్ల ధాటికి 14.3 ఓవర్లలో 91 పరుగులకే కుప్పకూలింది. ఓపెనర్లఉ కాన్వే(1), లాథమ్(7), రాబిన్సన్(6),నిక్ కెల్లీ(2) సింగిల్ డిజిట్‌కే అవుటై నిరాశపరిచారు. దీంతో 21 పరుగులకే నాలుగు టాప్ ఆర్డర్ వికెట్లు కోల్పోయి కివీస్ కష్టాల్లో పడింది. మధ్యలో జేమ్స్ నిషమ్(26), మికెల్ సాంట్నర్(15) ఆదుకునే ప్రయత్నం చేసినా.. ఆ వెంటనే వేగంగా వికెట్లు కోల్పోయింది. నలుగురు బ్యాట్స్‌మన్ మాత్రమే డబుల్ డిజిట్ దాటారు. సౌతాఫ్రికా బౌలర్లలో కొబాని 3 వికెట్లు... గెరాల్డ్, బార్ట్‌మన్, కేశవ్ మహారాజ్ తలా రెండేసి వికెట్లు పడగొట్టారు.

92 పరుగుల లక్ష్యాన్ని సౌతాఫ్రికా మూడు వికెట్లు మాత్రమే కోల్పోయి 16.4ఓవర్లలో చేధించింది. టోనీ, రూబిన్ హెర్మాన్ వికెట్లను 28 పరుగులకే కోల్పోయినా.. మరో ఓపెనర్ ఎస్టర్ హ్యూజెన్ ధాటిగా ఆడుతూ 48 బంతుల్లో 45 పరుగులతో అజేయంగానిలిచి సౌతాఫ్రికాకు గెలుపందించాడు. ఇరు జట్ల మధ్య రెండో టీ20 హామిల్టన్ వేదికగా మార్చి 17న జరగనుంది.

# కార్యదర్శిగా జీవన్ రెడ్డి, ట్రెజరర్‌గా అనిల్ ఎన్నిక

**హైదరాబాద్, మార్చి 15(వార్త క్రీడా ప్రతినిధి)**

హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శిగా మన్నె జీవన్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నిక కాగా, ఉత్కంఠ రేపిన కోశాధికారి పదవిలో అనిలల్ కుమార్ గెలుపొందారు. రెండు పోస్టులకు మధ్యంతర ఎన్నికలు నిర్వహించారు. కార్యదర్శి పదవికి మన్నె జీవన్ రెడ్డి ఒక్కరే నామినేషన్ వేయడంతో అతని ఎన్నిక ఏకగ్రీవమైంది.

ఆదివారం ఉప్పల్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో కోశాధికారి పదవికి ఎన్నికలు జరిగాయి.పెద్దసంఖ్యలో సభ్యులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. సాయంత్రం జరిగిన ఓట్ల లెక్కింపు ట్రెజరర్ పదవికి హోరాహోరీ పోరు సాగింది. ఈ ఎన్నికల్లో అనిల్ కుమార్ తన సమీప ప్రత్యర్థి డాక్టర్ హరినారాయణ్‌పై రెండు ఓట్ల స్వల్ప మెజారిటీతో విజయం సాధించారు. మొత్తం పోలైన ఓట్లలో అనిల్ కుమార్‌కు 61 ఓట్లు రాగా, హరినారాయణ్‌కు 59 ఓట్లు లభించాయి. ట్రెజరర్ బరిలో నిలిచిన ఇతర అభ్యర్థులలో ఆగం రావుకు 26 ఓట్లు, బాబూ రావుకు 6 ఓట్లు వచ్చాయి. గెలుపొందిన అభ్యర్థులు మన్నె జీవన్ రెడ్డి, అనిల్ కుమార్‌లకు ఎన్నికల అధికారిగా వ్యవహించిన సంపత్ కుమార్ ధృవీకరణ పత్రాలను అందజేశారు.

హెచ్‌సీఏ అభివృద్ధికి, క్రికెట్ కార్యకలాపాల మెరుగుదలకు కృషి చేస్తామని ఈ సందర్భంగా మన్నె జీవన్ రెడ్డి, అనిల్ కుమార్ పేర్కొన్నారు.గతంలో లాగా కాకుండా క్రికెట్ వ్యవహారాలను పారదర్శకుండా నిర్వహిస్తామని జీవన్ రెడ్డి చెప్పారు. హైదరాబాద్‌కే క్రికెట్‌ను పరిమితం చేయకుండా తెలంగాణలోని అన్ని జిల్లాల్లో క్రికెట్ స్టేడియాలు, మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామన్నారు. తద్వారా హెచ్‌సీఏ లీగ్‌లను జిల్లాల్లోనూ నిర్వహించే ప్రణాళిక చేయనున్నట్లు మన్నె జీవన్ రెడ్డి, అనిల్ కుమార్ వెల్లడించారు.


గెలుపొందిన వారికి ధృవీకరణ పత్రాలను అందజేస్తున్న ఎన్నికల అధికారి సంపత్ కుమార్

# ఈవారం మార్కెట్లకు మూడు ఐపిఓలు




**ముంబయి, మార్చి 15:** దేశీయ స్టాక్ మార్కెట్లో పబ్లిక్ ఇష్యూల సందడి కొనసాగుతోంది. ఈ వారం ప్రైమరీ మార్కెట్లో మూడు ఐపిఒలు సబ్‌స్క్రిప్షన్ కోసం ఓపెన్ అవుతున్నాయి. ఇందులో రెండు మెయిన్‌బోర్డ్ నుంచి వస్తున్నాయి. అదనంగా మూడు కంపెనీల స్టాక్స్ ఈ వారమే మార్కెట్లో లిస్టింగ్ అవుతున్నాయి. ప్రస్తుతం స్టాక్ మార్కెట్లో తీవ్ర అనిశ్చితి నెలకొంది. ఇరాన్, ఇజ్రాయెల్, అమెరికా యుద్ధం కారణంగా చమురు ధరలు పెరిగి మార్కెట్లు తీవ్ర ఒత్తిడికిలోనవుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో పలు కంపెనీలు పబ్లిక్ ఇష్యూకు వస్తున్నాయి. అతిపెద్ద ఐపీఓగా ఆగ్రోకెమికల్ తయారీ కంపెనీ జీఎస్‌పీ క్రాప్ సైన్స్ మార్కెట్ నుంచి రూ.400 కోట్లు సమీకరించనుంది. ఈ ఐపీఓ సబ్‌స్క్రిప్షన్ కోసం సోమవారం 16వ తేదీన వస్తుండగా 18వ తేదీ వరకు కొనసాగుతుంది ఇష్యూ ప్రైస్ బ్యాండ్ రూ.304 నుంచి రూ.320గా నిర్ణయించారు. ఫ్రెష్ ఇష్యూ ద్వారా రూ.240 కోట్ల విలువైన షేర్లు, రూ.160 కోట్లు విలువైన షేర్లను ఆఫర్ ఫర్ సేల్ ద్వారా విక్రయిస్తోంది. కనీసం 46 షేర్లు కొనుగోలు చేయాల్సి ఉంటుంది. మెయిన్ బోర్డ్ నుంచి వస్తున్న రెండో కంపెనీ సీఎంపీడీఐ అనే కంపెనీ ఐపీఓకు వస్తోంది. ప్రభుత్వ రంగ కంపెనీ అయిన కోల్ ఇండియా అనుబంధ కన్సల్టెన్సీ సర్వీసెస్ సంస్థ ఇది. ఈ ఐపీఓ సబ్‌స్క్రిప్షన్ 20వ తేదీన ప్రారంభమయి 24వ తేదీ వరకు కొనసాగుతుంది. పూర్తి ఆఫర్ ఫర్ సేల్ ద్వారా 10.71 కోట్ల షేర్లను విక్రయిస్తోంది. ప్రభుత్వం, కోల్ ఇండియా కంపెనీలు తమ వాటాను విక్రయిస్తున్నాయి. ఈ కంపెనీ బీఎస్ఈ, ఎన్ఎస్ఈల్లో మార్చి 30న లిస్టింగ్ కానుంది. ఎస్ఎంఈ సెగ్మెంట్ నుంచి ఈ కంపెనీ ఈ వారం పబ్లిక్ ఇష్యూకు వస్తోంది. నోవస్ లాయల్టీ లిమిటెడ్ ఈ ఐపీఓ సబ్‌స్క్రిప్షన్ 17వ తేదీన ప్రారంభమయి 20వ తేదీ వరకు కొనసాగుతుంది. ప్రైస్ బ్యాండ్ రూ.139 నుంచి రూ.146గానిర్ణయించారు. మొత్తం రూ.60.15 కోట్లు సమీకరించనుంది. ఈ వారం మూడు కంపెనీలు స్టాక్ మార్కెట్లో లిస్టింగ్ కానున్నాయి. రాజ్‌పుతన స్టెయన్ లెస్, అప్సిస్ ఏయిరోకామ్, రాజ్‌మార్క్ ఇన్‌ఫ్రా ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్ కంపెనీలు ఉన్నాయి.

# ఫ్లిప్‌కార్ట్‌పై బమూల్ సిసిఐకి ఫిర్యాదులు

**బెంగళూరు, మార్చి 15:** ప్రముఖ ఈకామర్స్ సంస్థ ఫ్లిప్‌కార్ట్ ప్రకటించిన రూపాయికే లీటర్ పాలు ఆఫర్ కర్ణాటకలో పెద్ద దుమారం రేపింది. ఈ చర్య రైతులను తీవ్రంగా దెబ్బతీస్తుందని ఆరోపిస్తూ బెంగుళూరు మిల్క్ యూనియన్ లిమిటెడ్ (బమూల్) తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. జోక్యం చేసుకోవాలని ప్రధాని నరేంద్ర మోదీని కోరతామని, కాంపిటిషన్ కమిషన్ ఆఫ్ ఇండియాకు (సీసీఐ) ఫిర్యాదు చేస్తామని హెచ్చరించింది. బమూల్ అధ్యక్షుడు డీకే సురేశ్ మీడియాతో మాట్లాడుతూ మార్కెట్‌ను చేజిక్కించుకునేందుకు ఫ్లిప్‌కార్ట్ ఇలాంటి అనైతిక పోటీకి తెరలేపిందన్నారు. డబ్బు సంపాదించాలనే ఆత్రుతతో ఫ్లిప్‌కార్ట్ లీటర్ పాలను రూపాయికే అమ్ముతోంది. ఇది రైతాంగాన్ని నాశనం చేసే చర్య. దీనిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించాలి. లేదంటే దేశవ్యాప్తంగా ఆందోళనలు తప్పవని ఆయన హెచ్చరించారు. స్వాతంత్ర్యానికి పూర్వం నుంచి ఉన్న సహకార పాల యూనియన్లను బలహీనపరిచే కుట్ర ఇది అని ఆరోపించారు. ఈ పథకం కోసం ఫ్లిప్‌కార్ట్ సుమారు రూ. 2వేల కోట్లు ఖర్చు చేసిందని, ఇప్పటికే 14.5 లక్షల లీటర్ల పాలను విక్రయించిందని సురేశ్ తెలిపారు. ఈ ఆఫర్ కారణంగా తమ యూనియన్ పాల అమ్మకాలు రోజుకు 40 వేల నుంచి 50 వుల లీటర్ల వరకు పడిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు లీటర్‌కు రూ. 38 నుంచి రూ. 40 చెల్లిస్తుంటే, రూపాయికే ఎలా అమ్ముతారని ఆయన ప్రశ్నించారు. ఫ్లిప్‌కార్ట్ ఎక్కడి నుంచి పాలను సేకరిస్తోందో తెలి యదని, పాల నాణ్యతను పరీక్షించేందుకు శాంపిల్స్‌ను ల్యాబ్‌కు పంపుతామని తెలిపారు. రైతుల ప్రయోజనాలను దెబ్బతీసే ఈ చర్యను ఫ్లిప్‌కార్ట్ వెంటనే వెనక్కి తీసుకోవాల్సిందేనని ఆయన డిమాండ్‌చేసారు.







# టాప్ పది కంపెనీల్లో రూ.4.48 లక్షల కోట్లు పతనం

**ముంబయి, మార్చి 15:** స్టాక్ మార్కెట్లలో చోటుచేసుకున్న గతవారం భారీ పతనం దేశంలోని అగ్రశ్రేణి కంపెనీలను తీవ్రంగా నష్టపరిచింది. ప్రభుత్వ రంగ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) అత్యధికంగా నష్టపోయింది. ఒక్కవారంలోనే ఎస్ బీఐ మార్కెట్ క్యాపిటలైజేషన్ (ఎంక్యాప్) రూ. 89,306.22 కోట్లు తగ్గి రూ.9,66,261.05 కోట్లకు పడిపోయింది. మొత్తంగా దేశంలోని టాప్10 కంపెనీలు కలిపి రూ.4.48 లక్షల కోట్ల సంపదను కోల్పోయాయి. పశ్చిమాసియాలో పెరుగుతున్న ఉద్రిక్తతలు, ముడి చమురు ధరల పెరుగుదల, ద్రవ్యోల్బణంపై ఆందోళనలు ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. దీంతో అన్ని రంగాల్లో అమ్మకాల వెల్లువ కొనసాగింది. ఈ వారంలో బీఎస్ఈ సెన్సెక్స్ 4,354 పాయింట్లు, నిఫ్టీ 1,299 పాయింట్లు నష్టపో యాయి. ఎస్‌బీఐ తర్వాత హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ భారీగా నష్టపోయింది.ఈబ్యాంక్ మార్కెట్ విలువ రూ. 61,715కోట్లు తగ్గి రూ. 12,57,391 కోట్లకు చేరింది.బజాజ్ ఫైనాన్స్ రూ.59,082 కోట్లు, టీసీఎస్ రూ.53,312 కోట్లు, ఐసీఐసీఐ బ్యాంక్ రూ.42,205 కోట్ల చొప్పున తమ మార్కెట్ విలువను కోల్పో యాయి. భారతీ ఎయిర్‌టెల్, రిలయన్స్ ఇండస్ట్రీస్, ఎల్ఐసీ, ఇన్ఫోసిస్, హిందుస్థాన్ యూనిలీవర్ వంటి కంపెనీలు కూడా వేల కోట్ల రూపాయల నష్టాలను చవిచూశాయి. రూ. 33,289 కోట్ల నష్టం ఎదురైనప్పటికీ, రిలయన్స్ ఇండస్ట్రీస్ దేశంలోనే అత్యంత విలువైన కంపెనీగా తన అగ్రస్థానాన్ని నిలబెట్టుకుంది.

# భారత్‌లో 229 మంది బిలియనీర్లు



**ముంబయి, మార్చి 15:** ప్రముఖ మ్యాగజైన్ ఫోర్బ్స్ 2026 సంవత్సరానికి గాను ప్రపంచ కుబేరుల జాబితాను విడుదల చేసింది. ఈ జాబితాలో అత్యధిక బిలియనీర్లు ఉన్న దేశంగా అమెరికా తన అగ్రస్థానాన్ని నిలబెట్టుకోగా, చైనా రెండో స్థానంలో కొనసాగుతోంది. 229 మంది బిలియనీర్లతో భారత్ మూడో స్థానంలో నిలిచి తన సత్తాను చాటింది. ఫోర్బ్స్ నివేదిక ప్రకారం అమెరికాలో 989 మంది, చైనాలో 610 మంది కుబేరులు ఉన్నట్లు వెల్లడైంది. గత ఏడాదితో పోలిస్తే ప్రపంచవ్యాప్తంగా బిలియనీర్ల సంఖ్య గణనీయంగా పెరిగింది. కొత్తగా 390 మంది ఈ జాబితాలో చేరడంతో మొత్తం కుబేరుల సంఖ్య 3,400 దాటింది. సగటున రోజుకు ఒకరు బిలియనీర్‌గా మారారన్నమాట. భారత్ తర్వాత జర్మనీ (212), రష్యా (147) దేశాలు తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ఈ ఏడాది జాబితాలో ఆఫ్ఘనిస్థాన్, పాకిస్థాన్ దేశాల నుంచి కూడా తొలిసారిగా బిలియనీర్లు చోటు దక్కించుకోవడం విశేషం. ఈ జాబితాలో యువత సత్తా చాటడం మరో ముఖ్యమైన అంశం. భారత సంతతికి చెందిన 22 ఏళ్ల సూర్య మిధా, స్వశక్తితో అత్యంత పిన్న వయస్కుడైన బిలియనీర్‌గా రికార్డు సృష్టించారు. తన స్నేహితులతో కలిసి స్థాపించిన మెర్కార్ అనే ఏఐ రిక్రూటింగ్ టూల్ అతడిని ఈ స్థాయికి చేర్చింది. బ్రెజిల్‌కు చెందిన 20 ఏళ్ల అమెలీ వోయిగ్ట్ ట్రెజెస్ వారసత్వ సంపదతో ప్రపంచంలోనే అత్యంత పిన్నవయస్కురాలైన బిలియనీర్‌గా నిలిచారు. వీరితో పాటు పలువురు ప్రముఖ సెలబ్రిటీలు కూడా 2026లో బిలియనీర్ల క్లబ్‌లో అడు గుపెట్టారు. వీరిలో అమెరికన్ పాప్ సింగర్ బెయాన్సే, టెన్నిస్ దిగ్గజం రోజర్ ఫెదరర్, ర్యాపర్ డాక్టర్ డ్రే, హాలీవుడ్ దిగ్గజ దర్శకుడు జేమ్స్ కామెరాన్ వంటి వారు ఉన్నారు.

### ఎయిరిండియాలో ఉద్యోగుల కుంభకోణం

# నాలుగువేలమంది సిబ్బందిపై వేటు

**న్యూఢిల్లీ, మార్చి 15:** ప్రముఖ విమానయాన సంస్థ ఎయిర్ ఇండియా ఉద్యోగుల భారీ కుం భకోణం బయటపడింది. సంస్థ తన ఉద్యో గులకు కల్పించే ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని వేలాది మంది సిబ్బంది దుర్వినియోగం చేసినట్లు అంతర్గత విచారణలో తేలింది. ఈ కుంభకోణంలో సుమారు 4వేల మందికి పైగా ఉద్యోగులు భాగస్వాములైనట్లు గుర్తించిన యాజమాన్యం, వారిపై కఠిన చర్యలకు సిద్ధమైనట్లు తెలుస్తుంది. ఎయిర్ ఇండియా పాలసీ ప్రకారం, ప్రతి ఉద్యోగికి ఏడాదికి 14 ఉచిత రిటర్న్ టిక్కెట్లు లభిస్తాయి. వీటిని ఉద్యోగి లేదా వారి కుటుంబసభ్యులు (తల్లిదండ్రులు, భార్యాపిల్లలు) మాత్రమే వాడుకోవాలి. దర్యాప్తులో వెల్లడైన నిజాలు యాజమాన్యాన్ని షాక్‌కు గురిచేశాయి. వేలాది మంది ఉద్యోగులు తమకు ఏమాత్రం సంబంధం లేని వ్యక్తులను బంధువులుగా చూపి ఉచిత టిక్కెట్లు పొందారు. మరికొందరు ఉద్యోగులు ఒకడుగు ముందుకు వేసి, ఉచితంగా పొందిన టిక్కెట్లను బయటి వ్యక్తులకు భారీ ధరలకు అమ్ముకుని సొమ్ము చేసుకున్నారు. మొత్తం 24 వేల మంది సిబ్బందిలో దాదాపు 4,000 మంది ఈ అక్రమాలకు పాల్పడ్డారు. ఈ కుంభకోణంలో చిక్కుకున్న వారిలో మెజారిటీ ఉద్యోగులు ఎయిర్ ఇండియా ప్రైవేటీకరణ తర్వాత, టాటా గ్రూప్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత చేరిన వారే కావడం గమనార్హం. ఈ వ్యవహారాన్ని తీవ్రంగా పరిగణించిన టాటా యాజమాన్యం రికవరీ చర్యలు ప్రారంభించింది. మోసపూరితంగా వాడిన టిక్కెట్ల విలువను ఉద్యోగుల జీతాల నుంచి వసూలు చేస్తున్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై భారీగా జరిమానాలు విధించడమే కాకుండా, వారి ప్రయాణ సౌకర్యాలను రద్దు చేస్తున్నారు. ఇకపై నామినీలను చేర్చుకోవాలంటే చట్టపరమైన ఆధారాలు, రక్త సంబంధ నిరూపణ పత్రాలు సమర్పించడం తప్పనిసరి చేశారు. నష్టాల నుంచి గట్టెక్కి, సంస్థను ప్రపంచ స్థాయికి తీసుకెళ్లాలని టాటా గ్రూప్ ప్రయత్నిస్తుంటే, ఉద్యోగులే ఇలాంటి అక్రమాలకు పాల్పడటం సంస్థ ప్రతిష్టను దెబ్బతీస్తోందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.ఇది కేవలం ఆర్థిక నష్టమే కాదని, ఉద్యోగుల నైతికతకు సంబంధించిన సమస్య అని ఎయిర్ ఇండియా వర్గాలు స్పష్టం చేశాయి.



# దుబాయ్, అబుదాబీలకు విమాన సర్వీసులు నిలిపివేత

**న్యూఢిల్లీ, మార్చి 15:** పశ్చిమాసియా యుద్ధంలో ఇరాన్ అమెరికామిత్రదేశాల ఎయిర్‌పోర్టులు, మిలిటరీబేస్‌లే లక్ష్యంగా దాడులుచేస్తుండటంతో ఎయిర్‌పోర్టులు మూతపడుతున్నాయి. ఎయిర్ ఇండియా, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ సంస్థలు పశ్చిమాసియాలోని నగరాలకు వెళ్లాల్సిన పలు విమానాలను రద్దు చేశాయి. దుబాయ్, అబుదాబి,ఇతర గల్ఫ్‌ప్రాంతాలకు వెళ్లే ప్రయా ణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇండిగో సంస్థ కూడా దుబాయ్‌కు నడిపే తన సర్వీసులను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. యుద్ధం కారణంగా గగనతలంలో నెలకొన్న అస్థిరత దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు సంస్థలు తెలిపాయి. విమానాలు రద్దయిన నేపథ్యంలో ప్రయాణికులకు పూర్తి రిఫండ్ లేదా తదుపరి అందుబాటులో ఉన్న విమానాల్లో ఉచితంగా టికెట్ మార్చుకునే సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు ఎయిర్ ఇండియా తెలి పింది. ప్రయాణానికి సిద్ధమయ్యే ముందు విమా నయాన సంస్థల అధికారిక వెబ్‌సైట్లు లేదా మొబైల్ యాప్‌ల ద్వారా తమ ఫ్లైట్ స్టేటస్‌ను సరిచూసుకోవాలని అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు.ఇరాన్‌అమెరికా మధ్య క్షిపణి దాడులు జరు గుతున్న తరుణంలో యూఏఈ ప్రభుత్వం తమ గగనతలం, విమానాశ్రయాలపై కఠిన ఆం క్షలు విధించింది. క్షిపణుల ముప్పు పొంచి ఉన్నందున అంతర్జాతీయ విమానాల రాకపోకలను పరిమితం చేశారు.



Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 5-69, 7Pratipadu, Pentapadu (M), West Godavari Dist., Tadepalligudem-534101. Telefax: 08818-220791, 225046, RNI?No. ARTEL 2004/13724 Editer: "Damerla Saibaba responsible for selection of new under the PRB Act. Read: No H/SD/337/12-14. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

పశ్చిమగోదావరి,ఏలూరు వార్త

# రాష్ట్రంలో పాడిపరిశ్రమ అభివృద్ధికి చర్యలు

## పోస్టర్లు ఆవిష్కరించిన తణుకు ఎమ్మెల్యే రాధాకృష్ణ



తణుకు, మార్చి 15 ( ప్రభాత వార్త) : రాష్ట్రంలో పాడిపరిశ్రమ అభివృద్ధి చేసి కూటమి ప్రభుత్వం రైతులకు అండగా ఉంటోందని తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. జాతీయ గాలికుంటు వ్యాధి నివారణ పథకంలో భాగంగా తణుకు నియోజకవర్గంలో దాదాపు 20 వేలకు పైగా పశువులకు టీకాలు వేసే కార్యక్రమం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ మేరకు ఆదివారం స్థానిక కూటమి కార్యాలయంలో వాల్‌పోస్టర్లు ఆవిష్కరించి మాట్లాడారు. నాలుగు నెలలు దాటిన పశువులకు టీకాలు ఇవ్వడం ద్వారా వాటిలో వ్యాధినిరోధక శక్తి పెరగడంతో పాటు పాల ఉత్పత్తి పెరిగేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. తణుకు నియోజకవర్గంలో ఈనెల 16 నుంచి వచ్చే నెల 29 వరకు ఈ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. రాష్ట్రంలో పశుసంవర్ధక శాఖకు సంబంధించి కూటమి ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించి పశుపోషకులకు అండగా ఉండేందుకు చర్యలు తీసుకుంటోందన్నారు. పశువైద్య శాలలను అభివృద్ధిచేయడంతోపాటు పాడిపరిశ్రమను విస్తరించేందుకు మరిన్ని ప్రణాళికలు చేస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, పశు వైద్యాధికారులు పాల్గొన్నారు.

## నేడు జిల్లా, డివిజన్, మండల కేంద్రాలలో

## పి జి ఆర్ ఎస్ కార్యక్రమం నిర్వహణ - జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి



భీమవరం మర్చి 15 ప్రభాతవార్త : మార్చి 16 సోమవారం జిల్లా కలెక్టరేట్ తో పాటు డివిజన్, మండల కేంద్రాలలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ పి జి ఆర్ ఎస్ సమావేశ మందిరం నందు సోమవారం ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు మండల, డివిజనల్ స్థాయిలో కూడా నిర్వహించినట్లు తెలిపారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలను మీకోసం . ఏపీ .గవర్నమెంట్ .ఇన్ (మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) వెబ్సైట్ నందు కూడా నమోదు చేసుకోవచ్చునని, అలాగే వారి యొక్క అర్జీల నమోదు మరియు నమోదైన అర్జీల గురించి వాటి యొక్క స్థితి దానికి సంబంధించి సమాచారం తెలుసుకోవాలంటే 1100 కి నేరుగా కాల్ చేయవచ్చని కలెక్టర్ తెలిపారు.

# పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలి

## - జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

భీమవరం మర్చి 15 ప్రభాతవార్త :జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి చేతుల మీదుగా గాలికుంటు వ్యాధి నివారణ టీకా ప్రచార గోడపత్రికను పశుసంవర్ధక శాఖ అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మార్చి 15 నుండి ఏప్రిల్ 15 వరకు ఒక నెల రోజులపాటు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను ఉచితంగా అందించడం జరుగుతుందని తెలిపారు. పశువులలో తీవ్రంగా వ్యాపించే గాలికుంటు వ్యాధి ఒక ప్రమాదకరమైన అంటువ్యాధి అని, ఈ వ్యాధి ముఖ్యంగా గేదెలు, ఆవులు, ఎద్దులు మరియు ఇతర కరువు పశువులలో కనిపిస్తుందని చెప్పారు. ఈ వ్యాధి వల్ల చిన్న దూడలలో మరణాలు సంభవించే అవకాశం ఉందని, అలాగే పెద్ద పశువులలో పాల ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోతుందని తెలిపారు. ఈ వ్యాధి వైరస్ ద్వారా వ్యాపిస్తుందని, గాలిలో కూడా సుమారు 30 కిలోమీటర్ల వరకు వ్యాపించే సామర్థ్యం ఈ వైరస్‌కు ఉందని చెప్పారు. దీనివల్ల పశుసంవర్ధక శాఖ ఈ వ్యాధి నివారణకు ప్రత్యేక టీకా కార్యక్రమాన్ని అమలు చేస్తోందని తెలిపారు. ప్రతి సంవత్సరం రెండు సార్లు పశువులకు టీకాలు వేయడం జరుగుతుందని, ఈ టీకాలు వేయడం ద్వారా పశువులను గాలికుంటు వ్యాధి నుండి రక్షించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని పశువులలో కనీసం 90 శాతం పశువులకు టీకాలు వేయడం లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. మూడు నెలల పైబడిన దూడలకు కూడా ఈ టీకాలు వేయడానికి ఏర్పాట్లు చేశామని, అన్ని పశువుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడం జరుగుతుందని చెప్పారు. ప్రతి డోస్ టీకా ధర సుమారు రూ.20 కాగా, జిల్లాలో మొత్తం సుమారు 1,70,000 పశువులకు టీకాలు వేయడానికి లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. కావున రైతులు తమ గ్రామాలకు వచ్చే పశుసంవర్ధక



శాఖ సిబ్బందికి సహకరించి, తమ పశువులకు తప్పనిసరిగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ ఆర్.కోటిలింగరాజు, సహాయ సంచాలకులు డాక్టర్ పి.జయకర్ జాన్సన్, డాక్టర్ హేమ, డా.బార్గవిసత్య, జూనియర్ వీటీ అధికారి హరిప్రసాద్ పాల్గొన్నారు.

# జిల్లా వ్యాప్తంగా అక్షరాంధ్ర పరీక్షలకు 99.9 శాతం హాజరు.

## - 60,865 మంది అభ్యర్థులకు గాను 60,829 మంది పరీక్షలకు హాజరు

భీమవరం మార్చి 15,ప్రభాతవార్త :పశ్చిమ గోదావరి జిల్లాలో అక్షరాంధ్ర ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ అసెస్మెంట్ టెస్ట్ పరీక్షను ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా నిర్వహించినట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. సహజంగా విద్యార్థులు పరీక్షలకు ప్రిపేర్ అయ్యి ఫైనల్ పరీక్షల్లో ఎంతో ఉత్సాహంగా రాయడం సాధారణంగా ప్రతి ఒక్కరు చూసేదే. నేడు అంతకుమించి అన్నట్లుగా అక్షరాంధ్ర అభ్యాసకులు ఫైనల్ పరీక్షల్లో పాల్గొనడం అందర్నీ ఆశ్చర్యపరిచింది. జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన పరీక్షలను జిల్లా కలెక్టర్ సమీక్షిస్తూ పరీక్షలు సజావుగా నిర్వహించడం జరిగిందని వెల్లడించారు. పరీక్షా కేంద్రాలలో ఏర్పాట్లు, పరీక్ష రాసే వయోజనుల హాజరు, మరియు పరీక్షా నిర్వహణ విధానంపై అధికారులతో కలెక్టర్ చర్చించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అక్షరాంధ్ర కార్యక్రమం ద్వారా జిల్లాలో నిరక్షరాస్యులైన మహిళలు మరియు పురుషులకు ప్రాథమిక చదువు నేర్పించి, వారికి ఈరోజు ఫైనల్ పరీక్షలను నిర్వహించినట్లు తెలిపారు. జిల్లాలోని అన్ని గ్రామాలలో పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించేందుకు సంబంధిత శాఖల అధికారులు ముందస్తు ప్రణాళికతో చర్యలు



తీసుకున్నట్లు ఆమె తెలిపారు. జిల్లాలో మొత్తం 60,865 మంది అభ్యర్థులు పరీక్షలకు నమోదు కాగా, వారిలో 60,829 మంది పరీక్షకు హాజరయ్యారని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 99.9 శాతం హాజరు నమోదైనట్లు వెల్లడించారు. పరీక్షల నిర్వహణలో గ్రామ స్థాయి సిబ్బంది, వలంటీర్లు, మరియు విద్యా శాఖ సిబ్బంది సమన్వయంతో పనిచేసినట్లు పేర్కొన్నారు. అక్షరాంధ్ర కార్యక్రమం ద్వారా వయోజనులకు ప్రాథమిక చదువు, వ్రాత మరియు గణిత నైపుణ్యాలను అందించి వారిని సాక్షరులుగా తీర్చిదిద్దడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతున్నందుకు జిల్లా స్థాయి అధికారులు, ఉపాధ్యాయులు, వాలంటీర్లు మరియు సహకరించిన ప్రతి ఒక్కరికి జిల్లా కలెక్టర్ అభినందనలు తెలిపారు.

# శ్రీ వాసవి కళ్యాణ మండపం ప్రారంభించిన మంత్రి టిజి భరత్

కైకలూరు,మార్చి,15(ప్రభాతవార్త): నియోజకవర్గ కేంద్రమైన కైకలూరు పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆర్యవైశ్య కళ్యాణ మండప నిర్మాణాన్ని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఆహార శుద్ధి శాఖామాత్యులు టి. జి భరత్ ఆదివారం ప్రారంభించారు. ముందుగా ఆర్యవైశ్య కళ్యాణ మండప నిర్మాణ కమిటీ మరియు రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ పి జె ఎస్ మాల్యాద్రి ఆధ్వర్యంలో స్థానిక సిఎన్ఆర్ గార్డెన్స్ ఫంక్షన్ హాల్ నుండి మంత్రి టీజీ భరత్ కు ఘన స్వాగతం పలికి ర్యాలీగా నూతన కళ్యాణమండపం వద్దకు చేరుకున్నారు. ఈ కార్యక్రమానికి మంత్రి టీజీ భరత్ తోపాటు కైకలూరు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్, జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్, ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ, చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విట్టల్ రావులు ముఖ్య అతిథులుగా



హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి భరత్ మాట్లాడుతూ ఆర్యవైశ్యులు అన్ని రంగాల్లో రాణించాలని, రాజకీయంగా ఎదగాలని ఆకాంక్షించారు. సమాజ సేవలో కీలకపాత్ర వహించాలన్నారు. ఆర్యవైశ్యుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుందని వివరించారు. ఇంత పెద్ద ఎత్తున దాతల సహకారంతో కళ్యాణ మండపం నిర్మించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నాగబాబుకు "క్రీడా రత్న" పురస్కారం

భీమవరం టౌన్, మార్చి 15 : ప్రభాతవార్త : పశ్చిమగోదావరి జిల్లా కేంద్రమయిన భీమవరంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో జిల్లా ఉప మలేరియా అధికారిగా పనిచేస్తున్న యాతం నాగబాబు ఆదివారం విజయవాడ ప్రెస్ క్లబ్ లో జరిగిన ఉగాది పురస్కార వేడుకలో "క్రీడా రత్న" పుర స్కారం అందుకున్నారు. విశాఖప ట్నానికి చెందిన మదర్ థెరిసా స్వచ్ఛంద సేవా సంస్థ నాగ బాబును ఉగాది జీవిత సాఫల్య పురస్కారం 2026 "క్రీడా రత్న" తో సత్క రించింది. అంతేగాక గ్లోబల్ ఫౌండేషన్ వారిచే "భారత్ గౌరవ్" ఉగాది జీవిత సాఫల్య పురస్కారం 2026 ఉగాదికే అందుకోవడం విశేషం. 2013 – 2026 మధ్యకాలంలో జాతీయ రాష్ట్రీయ స్థాయి లలో 15 బంగారు పతకాలు 19 రజిత పతకాలు 26 కాంస్య మొత్తం 60 పతకాలు నాగబాబు అందుకున్నారు. ఫిబ్రవరి 2026 లోనే మధ్యప్రదేశ్ లో జరిగిన జాతీయ స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ ఓపెన్ ఛాంపి యన్షిప్ నందు పాల్గొని 2 బంగారు 2 వెండి 1 కాంస్య మొత్తం ఐదు పతకాలు సాధిం చారు అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించే సత్తా కలిగిన నాగబాబుకు పాల్గొనేందుకు ఆర్థిక సత్తా లేకపోవడంతో 2015 లో ఆస్ట్రేలియా, 2017 లో న్యూజిలాండ్, 2018 లో థాయిలాండ్ అంతర్జాతీయ



మాస్టర్ అథ్లెటిక్స్ లో పాల్గొనలేక పోవడం క్రీడాకారునిగా దురదృష్టకరం. క్రీడాకారులకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల తరపున ఎటువంటి ప్రోత్సాహాలు, కనీస గుర్తింపు లభించకపో వడం నిరుత్సాహం కలిగించే విషయం. ఉద్యోగులైన క్రీడాకారులకు ముఖ్యంగా కావాల్సింది ప్రభుత్వ జీవోలకు అనుగు ణంగా సెలవు మంజూరు, ప్రయాణ సౌకర్యాలు, తగిన వసతులు కల్పిస్తే ఎంతోమంది అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధిస్తూ దేశానికి తగిన గుర్తింపు, గౌరవం సాధిస్తారనటంలో సందేహం లేదు. 2026 "ఉగాది పురస్కారం" అందుకున్న యాతం నాగబాబుకు పలువురు అధికారులు, ప్రజా ప్రతినిధులు, బంధుమిత్రులు అభినందనలు తెలియజేశారు.

# శ్రమదానంతో స్మశాన వాటిక అభివృద్ధి.

## అగర్తిపాలెం గ్రామస్తులతో కలిసి పని చేసిన మంత్రి రామానాయుడు

పాలకొల్లు ప్రభాతవార్త : పాలకొల్లు నియోజకవర్గంలోని ఆగర్తిపాలెం గ్రామ స్మశాన వాటిక అభివృద్ధి పనుల్లో రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు గ్రామస్తులతో కలిసి పాల్గొన్నారు. ఆదివారం సెలవు రోజైనా మండుటెండను లెక్కచేయకుండా రోజంతా శ్రమదానంలో పాల్గొని గ్రామస్తులకు స్ఫూర్తినిచ్చారు. గ్రామంలోని ప్రతి ఇంటి నుండి యువతతో పాటు పెద్దలు కూడా శ్రమదానంలో పాల్గొని స్మశాన వాటిక అభివృద్ధి పనుల్లో భాగమయ్యారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన పనుల్లో స్మశాన వాటిక ప్రహరీ గోడ పూర్తి చేయడంతో పాటు మరికొన్ని సుంద్రీకరణకు అవసరమైన గోడలు, కాంక్రీట్ వంటివి పూర్తయ్యాయి. పనుల్లో భాగస్వాములైన గ్రామస్తుల్లో మంత్రి రామానాయుడు ఉత్సాహాన్ని నింపుతూ ఆయా పనులు వేగవంతంగా జరిగేలా కలయ తిరిగారు. మండుటెండలో చెమటలు కారుతున్న తీసుకోకుండా కనీసం ఒక్క నిమిషం కూడా విశ్రాంతి తీసుకోకుండా కష్టపడ్డారు. మధ్యాహ్నం అందరికీ ఏర్పాటుచేసిన భోజనాలను స్వయంగా వడ్డించి కలిసి తిన్నారు మధ్య మధ్యలో శితల పానీయాలను కూడా రప్పించారు. గత ఇరవై, ముప్పై ఏళ్ల క్రితం గ్రామాల్లో కనిపించిన ఐక్యతా భావం, సేవా స్ఫూర్తిని మళ్లీ తీసుకురావడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు మంత్రి తెలిపారు. పాలకొల్లు నియోజకవర్గంలోని అన్ని స్మశాన వాటికలను సుందరీకరణ చేసి రోల్ మోడల్‌గా తీర్చిదిద్దడమే తన లక్ష్యమన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి కొంత ఇబ్బందిగా ఉన్నప్పటికీ సిఎస్ఆర్ నిధులతో పాటు గ్రామస్తుల భాగస్వామ్యంతో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని మంత్రి తెలిపారు. మనిషి పుట్టుక ఎంత ముఖ్యమో, మరణించిన తరువాత చివరి మజిలీ అయిన స్మశాన వాటిక కూడా అంతే ముఖ్యమని మంత్రి



నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో పాలుగున్న నాయకులు కావలి నాయుడు శ్రీ రెడ్డి బాబులు, గిడుగు కిరణ్,నున్న బోయిన ప్రసాద్,ఉంగరాల నరసింహ రావు, దేవర పల్లి రామ కృష్ణ, కావలి శ్రీను, నున్న బోయి న సత్య నారాయణ, బొక్క రామరావు, మేక బుల్లి శేషు, ఉంగరాల సూర్య నారాయణ, ఇనుకొండ వెంకటేష్, కోరా వాసు, గ్రామ ప్రజలు తదితర నాయకులు పాలుగున్నారు

# అనుదీప్ ఆత్మహత్య కాదు హత్యే

- వెలుగు చూస్తున్న ఆధారాలు
- విచారణలో నిమగ్నమైన పోలీసులు



చాట్రాయి, మార్చి 15, ప్రభాతవార్త : మండల కేంద్రమైన చాట్రాయికి చెందిన అంబటి అనుదీప్ అనుమానాస్పద మృతిగా నమోదు చేసినప్పటికీ హత్యే అనే అందుకు అనే ఆధారాలు వెలుగులోకి వస్తున్నాయి. మృతుడు సాయంత్రం వరకు కుటుంబ సభ్యులతోనే కలిసి ఉండటం ఆ తర్వాత దీప చెరువు వైపు వెళ్లడం అక్కడ చెరువులోకి దూకినట్లు ఉండగా పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. కానీ బయట పడుతున్న ఆధారాలు ప్రకారం పథకం ప్రకారం రచ్చ చేసిన తర్వాతే చెరువులోకి తోసేసారు అనేది కుటుంబ సభ్యులు వాదన కాగా దీనికి బలం చేకూర్చే విధంగా కొన్ని ఆధారాలు బయటపడుతున్నాయి. అనుదీప్ ఆత్మహత్య చేసుకుంటే చెరువులో దూకిన తర్వాత పొట్టనిండా నీళ్లు వచ్చే అవకాశం ఉందని కానీ చుక్క నీళ్లు కూడా తాగకపోవడంపై కూడా ఉండటం కూడా పలు అనుమానాలకు తావిస్తోంది. అంతేకాకుండా మృతుడు అనుదీప్ ఫోను చెరువు గట్టుపై ఉండగా ఆ తరువాత పోలవరం గ్రామానికి చెందిన కొందరు వ్యక్తుల చేతిలోకి రావటం పై కూడా అనుమానానికి బలం చేకూరుతోంది. దీనిపై చాట్రాయి ఎస్సై రామకృష్ణ గత నాలుగు రోజుల నుండి తీవ్రస్థాయిలో విచారణ జరుపుతుండగా ఇప్పటికే కొంత క్లూ లాగినట్లు తెలుస్తోంది. చాట్రాయికి చెందిన అతని స్నేహితులను వాడితో పాటు ఫోను దొరికిందని చెబుతున్న వారిపై కూడా దృష్టి పెట్టి విచారణ జరుపుతున్నట్టు తెలుస్తోంది. ప్రియురాలు కుటుంబీకులు పథకం ప్రకారం మాట్లాడదామని చెప్పి చెరువు వద్దకు రమ్మని బలంగా కొట్టడంతో తగలరానిచోట తగిలటంతో మృతి చెంది ఉండొచ్చని పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మృతి చెందిన వ్యక్తినే చెరువులోకి తోసేసి ఉంటారని ఆ తర్వాత ఫోన్ డేటా బయటపడుతుందని ఉద్దేశంతోనే ఫోను దొంగిలించి ఉంటారని అనుమానం షికార్లు కొడుతోంది. ఏది ఏమైనా గత నాలుగు రోజుల నుండి చాట్రాయి ఎస్ఐ పూర్తి స్థాయిలో విచారణ జరుగుతున్నందున అసలు విషయం బయటపడే అవకాశాలు ఉన్నట్టు తెలుస్తోంది.

# తాబేళ్ల రక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

## పర్యావరణానికి అవే కీలకం - ఎమ్మెల్యే నాయకర్



నరసాపురం రూరల్ మార్చి 15 ప్రభాతవార్త : బంగాళాఖాతం నర్సాపురం తీర ప్రాంతానికి వస్తున్న ఆలివ్ రెడ్లీ తాబేలను సంరక్షించవలసిన అవసరం ఎంతో ఉందని ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్ అన్నారు. ఆదివారం మండలంలోని పెదమైన వానిలంక గ్రామంలో సముద్రం ఒడ్డున తాబేళ్ల రక్షణకు ఆయన కృషి చేశారు. అటవీ శాఖ అధికారులు తెలుగుదేశం నాయకులతో కలిసి ఒడ్డుకు వచ్చిన తాబేళ్లను సేకరించి సముద్రంలోకి వదిలారు. ఈ సందర్భంగా నాయకర్ మాట్లాడుతూ తాబేలు సంరక్షణ అనేది ప్రకృతి సిద్ధంగా ప్రతి ఒక్కరూ బాధ్యతగా చేపట్టాలని కోరారు. నవంబర్ నెల నుండి వీటి జాడ ఎక్కువగా తెలుస్తోందని కొన్ని సందర్భాల్లో వాతావరణ పరిస్థితులను బట్టి చనిపోతున్నాయని అందువల్ల వాటిని కాపాడుకోవాల్సిన అవసరం మానవాళికి ఎంతో ఉందన్నారు. సముద్రంలో ఉంటూ పర్యావరణ సంరక్షణకు ఎంతో పాటుపడుతున్నాయని టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి పొ త్తూరు రామరాజు అన్నారు. వీటి ఉనికి పట్ల ఎప్పటికప్పుడు అధికారులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ప్రభుత్వం నుంచి ఎటువంటి సాయం కావాల్సి వచ్చినా ముందు ఉంటామని తెలిపారు. నరసాపురం మండలం పెద మైనవాని లంక గ్రామంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో సముద్ర తాబేళ్లను నీటిలోకి విడుదల చేసే కార్యక్రమంలో జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ మరియు నరసాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్, తెలుగు దేశం పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ పొత్తూరి రామరాజు, రాష్ట్ర మత్స్యకార అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ కొల్లు పెద్దిరాజు , అగ్నికుల క్షత్రియ కన్వీనర్ కొప్పాడి రవీంద్రనాథ్ ఠాగూర్, నరసాపురం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వాతడి ఉమామహేశ్వరరావు, వేములదీవి సర్పంచ్ ఒడుగు ఏసు, శంకరాపు వెంకటేశ్వర్లు, కూటమి నాయకులు కార్యకర్తలు, మరియు స్థానిక గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మత్స్యకార అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ కొల్లు పెద్దిరాజు గారు, అగ్నికుల క్షత్రియ కన్వీనర్ కొప్పాడి రవీంద్రనాథ్ ఠాగూర్, నరసాపురం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వాతడి ఉమామహేశ్వరరావు, వేములదీవి సర్పంచ్ ఒడుగు ఏసు, శంకరాపు వెంకటేశ్వర్లు, కూటమి నాయకులు కార్యకర్తలు, మరియు స్థానిక గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పదవ తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

## -మండల విద్యాశాఖ అధికారులు

ఆగిరిపల్లి మార్చి 15 ప్రభాతవార్త : అగిరిపల్లి మండలంలో పదవ తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలు రాయడానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు మండల విద్యాశాఖాధికారులు శిలారపు హేబేలు, కొవ్వలి ఆనంద్ కుమార్ లు తెలిపారు. మండలంలో మొత్తం 600 మంది రెగ్యులర్ విద్యార్థులు, 12 మంది ప్రైవేట్ విద్యార్థులు రాస్తున్నట్టు వారు తెలిపారు. అగిరిపల్లి లోని జిల్లా పరిషత్ హై స్కూల్, ఎస్ ఎఫ్ ఎస్ స్కూల్, ఎస్ వి స్కూల్స్ లో పదవ తరగతి పరీక్షా కేంద్రాలుగా ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలియచేసారు. పరీక్షలు ఉదయం 9:30 నుంచి 12:45 వరకు మార్చి 16 నుంచి ఏప్రిల్ 1 వరకు జరుగుతాయి కావున విద్యార్థులు గంట ముందుగానే పరీక్షా కేంద్రాలకి చేరుకోవాలని, ఎలాంటి మాల్ ప్రాక్టీసెస్ కి పాల్గొకుండా విజయవంతంగా పరీక్షలు రాయాలని వారు సూచించారు. విద్యార్థులకి ఏమైనా సమస్యలు ఉంటే జిల్లా కమాండ్ అండ్ కంట్రోల్ రూమ్ 9491395377 కి కాల్ చేయవచ్చని వారు తెలియచేసారు. విద్యార్థులు మంచిగా పరీక్షలు రాసి అగిరిపల్లి మండలని కి మంచి పేరు తీసుకురావల్సిందిగా వారు ఆకాంక్షించారు.

# మత సామరస్యాన్ని కాపాడే రంజాన్

- 1500 కుటుంబాలకు రంజాన్తోఫా
- నియోజవర్గ ముస్లిం సోదరులకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు

తణుకు, మార్చి 15 (ప్రభాత వార్త): మత సామరస్యాన్ని కాపాడుతూ అకుంఠితమైన దీక్షతో ముస్లింలు ఉపవాసం ఉండి అల్లా ఆశీస్సులు సమాజానికి తోడుగా ఉండాలని ముస్లిం సోదరులు కోరుకుంటారని తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ఆకాంక్షించారు. ఆదివారం అత్తిలిలో నిర్వహించిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొని మాట్లాడారు. ముస్లింల అభివృద్ధి, సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ఎప్పుడు ముందు ఉంటుందని అన్నారు. రాష్ట్రంలో అనేక సంస్కరణలు తీసుకువచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లు నేతృత్వంలో షాదీఖానాలు నిర్మాణాలకు ప్రాధాన్యత ఇస్తున్నారని చెప్పారు. అత్తిలి షాదీఖానా పునర్నిర్మాణానికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గత టిడిపి ప్రభుత్వ హాయంలో హైదరాబాదులో మక్కా భవనం నిర్మించి ప్రస్తుతం గుంటూరులో నూతనంగా మక్కా భవనం నిర్మించారని గుర్తు చేశారు. మక్కా వెళ్లే ముస్లిం సోదరులకు రూ. లక్ష ఆర్థిక సాయం చేస్తున్నట్లు చెప్పారు. తణుకు నియోజకవర్గంలో ప్రతి ఏటా అందిస్తున్నట్లుగానే దాదాపు 1500 కుటుంబాలకు రంజాన్ తోఫాను ఈ ఏడాది కూడా అందించడానికి ప్రణాళికలు



చేస్తున్నట్లు తెలిపారు. స్థానికంగా తన సొంత ఖర్చుల నుంచి రంజాన్ తోఫాను ప్రతి కుంటుంబానికి అందజేస్తానని ఎమ్మెల్యే రాధాకృష్ణ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముస్లిం సోదరులతో పాటు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# తెదేపా మహిళా కార్యకర్త మృతి

చాట్రాయి, మార్చి 15,ప్రభాతవార్త : మండలంలోని చిన్నంపేట గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ మహిళా కార్యకర్త బోట్ల కృష్ణకుమారి గుండెపోటుతో మరణించారు. తెలుగుదేశం పార్టీలో చురుగ్గా తిరిగిన మహిళా కార్యకర్త మృతి చెందటం పట్ల పలువురు సంతాపం వ్యక్తం చేశారు. మండలాలు లీగల్ సెల్ అధ్యక్షుడు అత్తులూరి శ్రీనివాసరావు మృతదేహానికి నివాళులర్పించారు.

## రంగాపురం గ్రామంలో 13వ జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం.

లింగపాలెం మండలం మార్చి 15 ప్రభాతవార్త : లింగపాలెం మండలం రంగాపురం గ్రామంలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో చింతలపూడి నియోజకవర్గ ఇన్చార్జ్ మేక ఈశ్వరయ్య ఆదేశాల మేరకు మండల పార్టీ అధ్యక్షులు పంది మహేష్ బాబు గారు పర్యవేక్షణలో రంగాపురం గ్రామంలో 13ఆవిర్భావ దినోత్సవం మండల ప్రధాన కార్యదర్శి మునికొండ వంశీ గోపి ఆధ్వర్యంలో ఘనంగా జరిగినాయి ఈ కార్యక్రమానికి మండల కమిటీ సభ్యులు రంగాపురం యువత పెద్ద ఎత్తులో పాల్గొన్నారు ఈ కార్యక్రమాన్ని విజయవంతం అయ్యేందుకు సహకరించిన చేసిన



జనసేనగోపి అన్నకు ధన్యవాదాలు

## ద్వారకాతిరుమలలో భక్తులకు నూతన సౌకర్యం - కియోస్క్ మెషిన్ల ఏర్పాటు

ద్వారకాతిరుమల మార్చి 15 ప్రభాతవార్త : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ప్రముఖ దేవాలయాల్లో భక్తుల సౌకర్యార్థం కియోస్క్ మెషిన్లను ఏర్పాటు చేస్తోంది. ఈ కార్యక్రమంలో భాగంగా మొత్తం 100 కియోస్క్ మెషిన్లను కరూర్ వైశ్యా బ్యాంకు సహకారంతో వివిధ ఆలయాల్లో అందుబాటులోకి తీసుకువస్తున్నారు. ఈ నేపథ్యంలో ఏలూరు జిల్లా ద్వారకాతిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో కూడా భక్తుల కోసం కొత్త డిజిటల్ సౌకర్యాన్ని ప్రారంభం కానున్నకియోస్క్ మెషిన్ల. ఆలయానికి వచ్చే భక్తులు ఇకపై కియోస్క్ మెషిన్ల ద్వారా సులభంగా దర్శన టికెట్లు, సేవల టికెట్లు మరియు ప్రసాద టికెట్లు పొందే వీలును కల్పించనున్నారు. భక్తులు చేతిలో నగదు లేకపోయినా డిజిటల్ చెల్లింపులు చేసి ఈ మెషిన్ల ద్వారా వెంటనే టికెట్లు పొందవచ్చు. దీంతో క్యూలైన్లలో ఎక్కువసేపు నిలబడే అవసరం లేకుండా సులభంగా టికెట్లు తీసుకునే అవకాశం కలుగుతుంది. ఈ కియోస్క్ మెషిన్లను ఆలయంలోని పలు ముఖ్య ప్రదేశాల్లో ఏర్పాటు చేశారు. కొండ దిగువ సమాచార కేంద్రం, కేశఖండన శాల, శ్రీ ధర్మ అప్పారాయ నిలయం, ప్రసాదం కౌంటర్ల సముదాయం, అనివేటి మండపం,



పీఆర్వో కార్యాలయం వద్ద, అలాగే నిత్య కళ్యాణ మండపం వద్ద కూడా ఈ మెషిన్లు ఏర్పాటు చేసినట్లు దేవస్థానం అధికారులు తెలిపారు.

## పదవ తరగతి విద్యార్థులకు బెస్ట్ ఆఫ్ లక్ ఎమ్మెల్యే సొంగ రోషన్ కుమార్.

లింగపాలెం మండలం మార్చ్ 15 ప్రభాతవార్త : చింతలపూడి నియోజకవర్గ శాసనసభ్యులుబి అభివృద్ధి ప్రధాత శ్రీ సొంగా రోషన్ కుమార్ గారి అడుగుజాడల్లో మనం కూడా అంటూ విద్యార్థులకు పెన్నులు,ప్యాడ్ కిట్స్ పంపిణీ చేసిన రాష్ట్ర గ్రీనింగ్ ఒ బ్యూటిఫికేషన్ డవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పల్లి శ్రీను,నీటి సంఘం అధ్యక్షులు ఒ యువ నాయకులు మోరంపూడి వర ప్రసాద్ ధర్మాజీగూడెం లింగపాలెం మండలంలోని ధర్మాజీగూడెం లేడీస్,బాయ్స్ హాస్టల్లో 10వ తరగతి విద్యార్థిని విద్యార్థులకు ప్యాడ్ లు,పెన్నుల కిట్స్ అందించటం జరిగింది. విద్యార్థిని, విద్యార్థులకు పరీక్షలు జరగనున్న తరుణంలో ప్రోత్సాహం కల్పించటం ద్వారా మంచి మెరిట్ సంపాదించి భవిష్యత్తులో మంచి మంచి స్థానంలో ఉండి తల్లిదండ్రులకు,ఉపాధ్యాయులకు మంచి పేరు తేవాలని కోరటం జరిగింది . విద్యార్థులందరు కష్టపడి చదువుకోవాలని, విద్యార్థికి జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని అనుకుంటే ఇదే తొలిమెట్టు




అని మంచి మార్కులు సాధించాలని విద్యార్థిని విద్యార్థులను ఆశీస్సులు అందించారు ఈకార్యక్రమంలో గర్ల్స్ హాస్టల్ వార్డెన్ సునీత,బాయ్స్ హాస్టల్ రాధాకృష్ణ రావు,ఐదీ=జ కో ఆర్డినేటర్ ఝాన్సీ, బూత్ ఇంచార్జి పొదిల రాజు,యువ నాయకులు ముళ్ళపూడి పండు, జాలాది మధు, లింగాల సందీప్ తదితరులు పాల్గొన్నారు

## గోపాల స్వామి వారి ఆలయంలో అనగాష్టమి వ్రతం



అత్తిలి, మార్చి 15( ప్రభాతవార్త )అత్తిలి లోని రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయం లో మత్త్రయ ఏకాదశి సందర్భంగా గో పూజ , భూమి సుపోషణా పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉచిత సామూహిక అనఘా వ్రతాలు, మొగల్తూరు కు చెందిన మోహన్ స్వామీజీ ఆధ్వర్యంలో నిర్వహించారు. పూజా సామాగ్రిని స్వామీజీ సమకూర్చారు. ఆలయ అర్చకులు వాడపల్లి సత్యనారాయణ చార్యులు, వల్లి వెంకటేష్,సూర్య తేజ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

### కుట్రతోనే ఎంపీ పుట్టాను ఇరికించారు యాదవ సంఘం అధ్యక్షుడు నాలి శ్రీను ఖండన

జీలుగుమిల్లి, మార్చి 16 (ప్రభాతవార్త): అభివృద్ధిని చూసి ఓర్వలేకే ఏలూరు పార్లమెంట్ సభ్యుడు పుట్టా మహేష్ కుమార్ యాదవ్‌ను డ్రగ్స్ కేసులో అన్యాయంగా ఇరికించారని పోలవరం నియోజకవర్గ యాదవ సంఘం అధ్యక్షుడు నాలి శ్రీను ఆరోపించారు. ఆదివారం జీలుగుమిల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్ పార్టీ కార్యక్రమం నిమిత్తమే వెళ్లారని తెలిపారు. ఈ కేసులో మొదట నిర్వహించిన వైద్య పరీక్షల్లో ఫలితం నెగెటివ్‌గా వచ్చిందని, అనంతరం జరిగిన పరీక్షల్లో పాజిటివ్ రావడం పలు అనుమానాలకు తావిస్తోందని పేర్కొన్నారు. పుట్టా కుటుంబం టీడీపీకి ప్రారంభం నుంచే అంకితభావంతో పనిచేస్తోందని చెప్పారు. ఏలూరు ఎంపీగా బాధ్యతలు చేపట్టిన తర్వాత నియోజకవర్గంలో ఇంతకు



ముందెన్నడూ లేని విధంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారని అన్నారు. ఈ నేపథ్యంలో రాజకీయ ప్రత్యర్థులు కుట్రపూరితంగా ఎంపీ పుట్టాను ఇరికించి అరెస్ట్ చేయించడం దురదృష్టకరమని, దీనిని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు పేరుబోయిన దాము, కూరాకుల రవీంద్ర, తోట బాలు, జగదీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## పది విద్యార్థులకు వాటర్ బాటిళ్లు, ప్యాడ్లు పంపిణీ

జీలుగుమిల్లి, మార్చి 15, (ప్రభాతవార్త) : మండలంలోని ములగలంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు టిడిపి నాయకులు వాటర్ బాటిళ్లు, ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. విద్యార్థులు పరీక్షలను సులభంగా ఎదుర్కొనేందుకు ఈ సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విద్యార్థులు ధైర్యంగా పరీక్షలు రాసి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఎస్ఎంసి చైర్మన్ మరీదు పండు, పోలవరం నియోజకవర్గం ఎస్టీ సెల్ అధ్యక్షుడు చేప రవి, మండల



సెక్రెటరీ అక్కిరెడ్డి ప్రసాద్, గ్రామ పార్టీ అధ్యక్షుడు ఓడ వెంకటేశ్వరరావు, కాకిరెడ్డి ప్రభాకర్, కొప్పుల నాగు, మిడత నాగు, సయ్యద్ బాజీ తదితరులు పాల్గొన్నారు.

## కాలభైరవ స్వామి ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన

పెనుమంట్ర, మార్చి 15, (ప్రభాతవార్త): మండలంలోని నత్తా రామేశ్వరం గ్రామంలో ఉన్న శ్రీ రామేశ్వర స్వామి దేవస్థానానికి అనుబంధంగా ఉన్న శ్రీ కాలభైరవ స్వామి ఆలయం శిథిలావస్థకు చేరుకోవడంతో దానిని తొలగించి పునః నిర్మించేందుకు ఆదివారం శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. నత్తా రామేశ్వరం గ్రామానికి చెందిన తాడి వెంకటరెడ్డి కుమారుడు తాడి హేమంత్ రెడ్డి దాతగా ముందుకు వచ్చి ఆలయ నిర్మాణానికి సహకరిస్తున్నట్లు దేవస్థానం కార్యనిర్వహణాధికారి పులగం వేణుగోపాలరావు తెలిపారు. అధికారుల అనుమతులతో



ఆలయాన్ని పునర్నిర్మించనున్నట్లు ఆయన వెల్లడించారు.

## జల్లేరు జలాశయంలో నీట మునిగి ఇద్దరు వ్యక్తులు మృతి....

ప్రభాత వార్త – బుట్టాయిగూడెం : మండలంలోని అలివేరు సమీపంలో ఉన్న జల్లేరు జలాశయంలో ఆదివారం ఘోర విషాదం చోటుచేసుకుంది. దేవరపల్లి మండలం యాదవోలు కు చెందిన తుమ్మల నాగరాజు (30), తుమ్మల రమణ(35 )లు కుటుంబ సభ్యులతో కలిసి బుట్టాయిగూడెం మండలంలోని కామవరం అటవీ సమీపంలో ఉన్న గుబ్బల మంగమ్మ తల్లి దర్శనానికి వచ్చారు. దర్శనం అనంతరం సమీప ప్రాంతంలోని జల్లేరు జలాశయానికి సరదాగా గడపడానికి బంధువులు, స్నేహితులతో కలిసి వెళ్లారు. అనంతరం స్నానానికి దిగిన నాగరాజు, రమణ లు ప్రమాదవశాత్తు నీట మునిగి గల్లంతయ్యారు. అది గమనించిన బంధువులు వారిని కాపాడేందుకు ప్రయత్నించినా, ప్రయత్నం విఫలం అవడంతో నీటిలో మునిగి మృత్యువాత పడ్డారు. సమాచారం తెలుసుకున్న స్థానిక పోలీసులు హుటాహుటిన సంఘటన స్థలానికి



చేరుకొని గల్లంతైన వారి కోసం స్థానికుల సహాయంతో జలాశయంలో తీవ్రంగా గాలించి నాగరాజు, రమణల మృతదేహాలను వెలికితీశారు. ఒక్కసారిగా ఇద్దరు వ్యక్తులు మృతి చెందడంతో ఆ ప్రాంతంలో విషాద ఛాయలు అలముకున్నాయి. మృతుల కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

## రైతన్న మీకోసం వారోత్సవాలు



పెనుమంట్ర, మార్చి 15, (ప్రభాతవార్త) : మండలంలోని నేటి నుండి 18వ తేదీ వరకు, ఈ నెల 23వ తేదీ నుండి 25వ తేదీ వరకు రైతన్న మీకోసం వారోత్సవాలు జరుగునని మండల వ్యవసాయ అధికారి దేవి స్వరూప తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతన్న మీకోసం వారోత్సవాల గురించి వ్యవసాయ, అనుబంధ శాఖలు గ్రామాలలో రైతు కుటుంబాల యొక్క గృహాలకు వెళ్లి వ్యవసాయ మరియు అనుబంధ రంగాల లక్ష్యాలను, రైతులు యొక్క సూచనలను వారి యొక్క సమస్యలను తెలుసుకుని వాటి వివరాలను యావ్ లో పొందుపరచడం జరుగుతుందన్నారు.

## టెన్త్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

అత్తిలి, మార్చి 15( ప్రభాతవార్త) నేటి నుంచి ప్రారంభమయ్యే పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించి మండలంలో 5 పరీక్షా కేంద్రాలలో అన్ని ఏర్పాట్లు చేశామని మండల విద్యాశాఖాధికారి ఎన్. రమేష్ తెలిపారు. అత్తిలి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 190 మంది, అత్తిలి బాలికల జడ్పీ ఉన్నత పాఠశాలలో 149 మంది, ఆరవల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో 131 మంది, కొమ్మర జడ్పీ ఉన్నత పాఠశాలలో 75 మంది, బల్లిపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో 101 మంది పదవ తరగతి పరీక్షలకు హాజరుకానున్నారని చెప్పారు. మండలంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలనుంచి మొత్తం 646 మంది విద్యార్థులకు టెన్త్ పరీక్షలు వ్రాస్తున్నారని తెలిపారు. పరీక్షా కేంద్రాలలో విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. టెన్త్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసామని వివరించారు. పరీక్షల నిర్వహణకు 35 మంది ఇన్విజిలేర్లను నియమించామని వివరించారు.

### ఘనంగా వీరేశ్వర స్వామి వారి కళ్యాణం



అత్తిలి/ పెంటపాడు, మార్చి 15( ప్రభాతవార్త) పెంటపాడు మండలం మీనవిల్లూరు గ్రామంలోని భద్రకాళి సమేత వీర స్వామి వారి వార్షిక కళ్యాణోత్సవం శనివారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ అనువంశిక ధర్మకర్త పెమ్మరాజు సూర్య నరేంద్ర దంపతులు కళ్యాణం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఈ కళ్యాణోత్సవాన్ని తిలకించారు. ఐదు రోజులపాటు జరిగే కార్యక్రమాల్లో భాగంగా రాత్రి సప్పా భారతి భాగవతారిణి హరికథ కార్యక్రమాన్ని నిర్వహించారు.

### నేటి నుండే పదో తరగతి పరీక్షలు

చాట్రాయి, మార్చి 15, ప్రభాతవార్త : పదవ తరగతి పరీక్షలు సోమవారం నుండి ప్రారంభం అవుతుండగా మండల కేంద్రమైన చాట్రాయి లో 372 మంది విద్యార్థులు రెండు సెంటర్లలో పరీక్షలు రాయనున్నట్లు మండల విద్యాశాఖ అధికారి 1 ఎం శ్రీనివాస్ చెప్పారు. చాట్రాయి జిల్లా



పరిషత్ హై స్కూల్ లో 252 మంది, ఆర్.సి.యం స్కూల్ నందు 120 మంది పరీక్షలు రాయనున్నట్లు ఆయన తెలిపారు. పరీక్షలు పగడ్బందీగా నిర్వహించేందుకు 18 మంది ఇన్విజిలేటర్లను నియమించినట్లు ఆయన వివరించారు. విద్యార్థుల పరీక్షల నిర్వహణ కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆయన చెప్పారు. రెండు పరీక్షల కేంద్రాల వద్ద చాట్రాయి తహసిల్దార్ 144 సెక్షన్ విధించారని సెంటర్ కు 100 మీటర్ల దూరంలో ఎవరూ సంచరించకూడదని ఆంక్షలు విధించినట్లు అయన తెలియజేశారు. విద్యార్థులందరూ ఎటువంటి మానసిక ఒత్తిడికి గురి అవ్వకుండా పరీక్షలు రాయాలని ఉత్తమ మార్కులు సాధించి మండలానికి మంచి పేరు తీసుకురావాలని ఆయన కోరారు. పరీక్ష కేంద్రానికి గంట ముందే రావాలని ఆయన సూచించారు.

## అనాధను గృహస్థురాలుని చేసిన హీల్ సంస్థ

ఆగిరిపల్లి మార్చి 15 ప్రభాతవార్త :పెంచిన తల్లితండ్రులు ఇరువురూ మరణనించడంతో అనాధగా మారిన దొడ్డగళ్ల నాగశ్రీ అనే బాలికను 2016 వ సంవత్సరంలో విజయవాడ డిప్యూటీ మేయర్ గోగుల రమణ హీల్ పారడైజ్ లో చేర్పించారు. అనాధ బాలికను అక్కున చేర్చుకున్న హీల్ సంస్థ ఆమెను హార్టికల్చర్



పాలిటెక్నిక్ చదివించింది. బ్యూటిషియన్ కోర్సు నేర్పించింది. అంతే కాక డిగ్రీ కూడా పూర్తి చేయించింది. పెళ్ళి వయస్సుకు వచ్చిన ఆమెకు ఆదివారంఆగిరిపల్లి శ్రీ శోభనాచల లక్ష్మీ నరసింహ స్వామి సన్నిధిలో ఘనంగా వివాహం జరిపించింది. తాను ఇష్టపడిన తెలంగాణ రాష్ట్రం, మహబూబ్ నగర్ కు చెందిన కుమ్మరి ఆంజనేయులు కి ఇచ్చి ఘనంగా వివాహం జరిపించారు. ఈ వివాహన్ని హీల్ వ్యవస్థాపక అధ్యక్షులు డా. కోనేరు సత్యప్రసాద్, డా. కోనేరు ఉష ల ఆశీర్వాదంతో హీల్ కార్యదర్శి తాతినేని లక్ష్మి, హీల్ డైరెక్టర్లు పిన్నమనేని ధనప్రకాష్, మలినేని రంగప్రసాద్, యలమంచిలి బాలాజీ, హీల్ సిఈఓ కూరపాటి అజయ్ కుమార్, అమెరికా కు చెందిన ప్రముఖ వైద్యులు చుండూరి కృష్ణబాబు, ప్రముఖ సంఘ సేవకులు కాకర్ల శంకర రావు, కృష్ణమోహన్, చుండూరి మధుసూదనరావు, తోటపల్లి సర్పంచ్ అరేపల్లి శ్రీనివాసరావు తదితరులు వధూవరులను ఆశీర్వదించారు. 15 మందికి కృత్రిమ కాళ్లుఅందజేత. హీల్ కృత్రిమ అవయవ కేంద్రంలో వివిధ జిల్లాలకు చెందిన 15 మంది దివ్యాంగులకు కృత్రిమ కాళ్ళను ఆదివారం అమరచడం జరిగిందని హీల్ సీఈవో కూరపాటి అజయ్ కుమార్ తెలిపారు. చుండూరు కోటయ్య రామశేషమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆర్థిక సహకారంతో అవయవాలు కోల్పోయిన ఈ దివ్యాంగులకు అందజేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ చుందూరు కృష్ణ బాబు ప్రముఖ సంఘ సేవకులు కాకర్ల శంకర్రావు కృష్ణమోహన్ కార్యదర్శి సాతినేని లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

### హక్కుల సాధనకు కార్మికులు పోరాటాలకు సమాయత్తం కావాలి

## ఏఐటీయుసి జిల్లా అధ్యక్షుడు కోనాల

పెనుమంట్ర, మార్చి 15, (ప్రభాతవార్త): కార్మికులు తమ హక్కుల సాధనకు, సమస్యల పరిష్కారానికి సంఘటిత పోరాటాలకు సిద్ధంగా ఉండాలని ఏఐటీయుసి జిల్లా అధ్యక్షుడు కోనాల భీమారావు పిలుపునిచ్చారు. ఆదివారం పెనుగొండ పార్క్ వద్ద జరిగిన ఏఐటీయుసి పెనుగొండ ఏరియా సమావేశంలో మాట్లాడారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 36 కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేసి, కార్మికులకు నష్టం కలిగించే విధంగా నాలుగు లేబర్ కోడ్స్‌ను తీసుకువచ్చిందన్నారు. ఈ కోడ్స్ వల్ల కార్మికులకు యూనియన్ ఏర్పాటు చేసుకునే హక్కు, వేతనాల కోసం అడిగే హక్కులు దెబ్బతింటాయని పేర్కొన్నారు. అలాగే 8 గంటల పని స్థానంలో 12 గంటల పని విధానం అమలులోకి వచ్చే ప్రమాదం ఉందన్నారు. కార్మికులను కట్టుబానిసలుగా మార్చే ఈ లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని, ఇందుకోసం నిరంతర పోరాటాలకు కార్మికులు



సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఏఐటీయుసి పెనుగొండ ఏరియా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షునిగా సిద్దాబత్తుల పరబ్రహ్మం, అధ్యక్షునిగా పెచ్చెటి శ్రీను, ప్రధాన కార్యదర్శిగా మాదాసు నాగేశ్వరావు, ఉపాధ్యక్షునిగా ఎస్. మాణిక్యాల రెడ్డి, సహాయ కార్యదర్శిగా బాలం నాగేంద్ర ఎన్నికయ్యారు.

### అక్షర ఆంధ్ర ఉల్లాస్ వయోజన విద్యా పరీక్షలు విజయవంతం

ఆగిరిపల్లి మార్చి 15 ప్రభాతవార్త. ఆగిరిపల్లి మండలంలో 2,400 మంది అభ్యాసకులు అక్షరాంధ్ర ఉల్లాస్ వయోజన విద్య పరీక్షలు రాశారని ఏపియందయాల రాజశేఖర్ తెలిపారు. ఆదివారం మండల పరిధిలో వట్టిగుడిపాడు,ఈదులగూడెం గ్రామాలలో ఎంపీపీ ఎస్ స్కూల్స్ లో ఫైనల్ పరీక్షలు రాస్తుండగా స్కూల్స్ జరుగుతున్నపరీక్షల ను పరిశీలించారు. ఈ సందర్భంగాఏపిఎం దయాల రాజశేఖర్ మాట్లాడుతూ ఆగిరిపల్లి మండలంలో అక్షరాంధ్ర ఉల్లాస్ వయోజన విద్య కార్యక్రమం కింద అక్షరాస్యత శిక్షణ పూర్తి చేసిన 2400 మంది డిఆర్డిఏ మహిళలు ఈ పరీక్షలు రాస్తున్నారని అందుకోసం 19 సచివాలయం లలో 19 ఎంపీపీ ఎస్ పాఠశాలలు గుర్తించి,పరీక్షా కేంద్రాలుగా ఏర్పాటు చేయడం జరిగిందని,ఈ పరీక్షలను నిర్వహించేందుకు ఇన్విజిలేటర్స్ గా అంగన్వాడి టీచర్లను జిల్లా కలెక్టర్ గారు ఎంపిక చేయడం జరిగిందని తెలియజేశారు. ఈ పరీక్షలు ఆదివారం ఉదయం పది గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు జరిగాయని 2400 మంది కి 2391 మంది డిఆర్డిఏ మహిళ లెర్నర్స్ పరీక్షలు రాశారని తెలియజేశారు. పరీక్ష మొత్తం 150 మార్కులకు జరిగిందని తెలియజేశారు. 50 మార్కులు చదవడం,50 మార్కులు రాయడం,50 మార్కులు గణితం కలిపి మొత్తం 150 మార్కులకు పరీక్ష ప్రశ్నాపత్రంలో ఉంటాయని తెలియజేశారు ఈ పరీక్షల్లో ఒక్కొక్క విభాగంలో 17 మార్కులు పాస్ మార్కులుగా నిర్ణయించడం జరిగింది అని తెలియజేశారు.



వీరితోపాటు డ్వామా ద్వారా 1109 మంది పురుషులకు కూడా పరీక్షలు నిర్వహించినట్లు,99.62% హాజరు నమోదైనట్లు ఏపీఎం దయాల రాజశేఖర్ తెలిపారు. అగిరిపల్లి ఎంఈఓ 2 ఆనంద్ బాబు పరీక్షా కేంద్రాలను విసిట్ చేసి, పరీక్షల విధానాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఈదులగూడెం వెల్ఫేర్ అసిస్టెంట్ రామకృష్ణ, ఒట్టిగుడిపాడు వెల్ఫేర్ అసిస్టెంట్ బి గోవింద్, అంగన్వాడీ టీచర్లు ముల్లంగి వనజాక్షి, దేవరపల్లి సుభాషిని, ఎం రత్నకుమారి,కె లలిత కుమారి, ఎన్ మమతారాణి,బి ప్రశాంతి మరియు వట్టిగుడుపాడు గ్రామ సమైక్య అధ్యక్షురాలు శ్రీమతి ఎం దుర్గా కళ్యాణి,వివోఏలు సుప్రజ,అనంతలక్ష్మి,మల్లేశ్వరి ఫీల్డ్ అసిస్టెంట్లు పి.నాగేశ్వరరావు ఎన్.ఆదికేశవులు తదితరు లు పాల్గొన్నారు.

## ఆరోగ్య వర్షిణి ట్రస్ట్ సేవలు ఆదర్శనీయం

### కూటమి నాయకులు ప్రశంస

నరసాపురం రూరల్ మార్చి 15 ప్రభాతవార్త :నరసాపురం మండలం పెద్దమైనవానిలంక గ్రామంలో ఆరోగ్య వర్షిణి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ప్రభుత్వ విప్ మరియు నరసాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్, టీడీపీ నియోజకవర్గ ఇన్చార్జ్ పొత్తూరి రామరాజు, రాష్ట్ర మత్స్యకార అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ కొల్లు పెద్దిరాజు కలిసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సమాజంలో ఆరోగ్య వర్షిణి ట్రస్ట్ అందిస్తున్న సేవలు ఎంతో ఆదర్శనీయమని కొనియాడారు. ఇటువంటి ఉచిత వైద్య శిబిరాలు పేదల పాలిట వరంగా నిలుస్తాయని, ప్రతి ఒక్కరూ సేవా భావంతో ముందుకు సాగాలని ఆశించారు. ఈ శిబిరం తీర గ్రామ ప్రజలకు ఎంతో ఉపయోగపడిందన్నారు. అన్ని విభాగాలను తెచ్చి పరీక్షలు జరిపించి మందులు ఇవ్వడం అభినందినీయమని పేర్కొన్నారు.



ఈ కార్యక్రమంలో అగ్నికుల క్షత్రియ కన్వీనర్ కొప్పాడి రవీంద్రనాథ్ ఠాగూర్, నరసాపురం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వాతడి ఉమామహేశ్వరరావు, నాగిడి రాంబాబు, గ్రామ సర్పంచ్ మైల శివ, వేములదీవి సర్పంచ్ ఒడుగు ఏసు, దొంగ మురళి, శంకరాపు వెంకటేశ్వర్లు, కూటమి నాయకులు కార్యకర్తలు, మరియు స్థానిక గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జరిమానా లేదు హెల్మెట్ లు కొనండి

టీ నర్సాపురం మార్చి 15 ప్రభాతవార్త :హెల్మెట్ ధరించకుండారించకుండాద్విచక్రవాహనాలునడిపేటువంటి వారికి చలానా వద్దు – ప్రాణం ముద్దు స్లోగన్ తో టీ. నర్సాపురంలో ఎస్ఐ జయ బాబు వారి యొక్క సిబ్బంది తో కలిసి ఆదివారం వినూత్న కార్యక్రమమును నిర్వహించారు. రహదారి భద్రతపై వాహనదారు ల్లో మార్పు తీసుకు రావడమే లక్ష్యంగా ఏలూరు జిల్లా పోలీస్ యంత్రాంగం సరికొత్త ఒరవడికి శ్రీకారం చుట్టింది. జిల్లా ఎస్పీ శ్రీ కె. ప్రతాప్ శివ కిషోర్, ఐపీఎస్ వారు, పోలవరం డీఎస్పీ శ్రీ ఎం. వెంకటేశ్వరరావు యొక్క ఆదేశాలపై జీలుగుమిల్లి ఇన్స్పెక్టర్ శ్రీ వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో టీ. నర్సాపురం ఎస్సై శ్రీ జయ బాబు తన సిబ్బందితో కలిసి నో ఫైన్ – బై హెల్మెట్ అనే వినూత్న కార్యక్రమాన్ని నిర్వహించారు.సాధారణంగా హెల్మెట్ లేని వాహనదారులకు జరిమానా విధించడం సహజం. కానీ, ఈ కార్యక్రమంలో ఎస్సై జయ బాబు హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న వాహనదారులను ఆపి, వారికి జరిమానా వేయడానికి బదులుగా,



అక్కడికక్కడే హెల్మెట్ కొనుగోలు చేసేలా ప్రోత్సహించారు. హెల్మెట్ ధరించక పోవడం వల్ల జరిగే ప్రాణాపాయం గురించివాహనదారులకు అవగాహన కల్పించారు.పోలీసుల లక్ష్యం జరిమానాలు వసూలు చేయడం కాదు. వాహనదారులు సురక్షితంగా ఇళ్లకు చేరడం అని ఈ సందర్భంగా ఎస్సై పేర్కొన్నారు.

## పదో తరగతి విద్యార్థులకు బస్సులో ఉచిత ప్రయాణం



భీమవరం టౌన్ మార్చి 15 : ప్రభాతవార్త :పదో తరగతి విద్యార్థులకు మార్చి 16 నుంచి 28 వ తేదీ వరకూ జరిగే పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు పశ్చిమ గోదావరి జిల్లాలోని భీమవరం, నర్సాపురం, తణుకు,తాడేపల్లిగూడెం డిపోల బస్సులలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నట్లు పశ్చిమ గోదావరి జిల్లా ప్రజా రవాణాధికారి ఎస్ గిరిధర్ కుమార్ తెలియజేశారు. పరీక్ష హాల్ టికెట్ చూపించి ఇంటి వద్ద నుండి పరీక్షా కేంద్రాలకు ఉచితంగా వెళ్లి రావొచ్చని తెలిపారు. పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు బస్సుల్లో ఈ సదుపాయం కల్పిస్తున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని పదవ తరగతి పరీక్షలు రాసే విద్యార్థులందరూ వినియోగించుకోవాలని డిపిటిఓ గిరిధర్ కుమార్ సూచించారు.

## 75 ఏళ్ళైనా చెక్కు చెదరని అద్భుత చిత్రం పాతాళ భైరవి

### -పలువురు కళాకారులు

భీమవరం మార్చి 15 ప్రభాతవార్త : తెలుగు చిత్రసీమలో ఈనాటికీ ఏనాటికీ వన్నె తరగని అద్భుత చిత్రం 'పాతాళ భైరవి' అని, 75 ఏళ్ళైనా చెక్కు చెదరని అద్భుత చిత్రం పాతాళ భైరవి అని ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక నాటక కేంద్ర అధ్యక్షులు బుద్దాల వెంకట రామారావు (తాడేపల్లిగూడెం) అన్నారు. పాతాళ భైరవి చిత్రం 75 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా భీమవరం వెంకట్రామ థియేటర్లో ఆదివారం శ్రీవిజ్ఞానవేదిక, పట్టణ కళా సంస్థలు అభిమాన సంఘాల ఆధ్వర్యంలో వేడుకల కార్యక్రమాన్ని నిర్వహించారు. రామారావు మాట్లాడుతూ పాతాళ భైరవి ఈ సినిమా పేరు వినగానే– 'సాహసం సేయరా డింభకా..' డైలాగ్ అప్రయత్నంగా గుర్తుకొస్తుందని, వెండితెర జానపద అద్భుతం – పాతాళ భైరవి అని అన్నారు. కళా రంజని నాటక పరిషత్ అధ్యక్షులు జవ్వాది శ్రీనివాస్, శోభన్ బాబు కల్చరల్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షులు భట్టిప్రోలు శ్రీనివాసరావు మాట్లాడుతూ పాతాళభైరవికి సంబంధించిన విశేషాలు వందల కొలది ఉంటాయని, మళ్లీ అలాంటి సినిమా తీయగలమా అనే ప్రశ్న అప్పుడప్పుడు తలెత్తుతూ ఉంటాయన్నారు. జానపద కథలతో రూపొందిన ఈ చిత్రం తెలుగు సినిమాకు కొత్త దిశ చూపిన క్లాసిక్‌గా నిలిచిందన్నారు. కార్యక్రమ నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ దశాబ్దాలు గడిచినా 'పాతాళ భైరవి' ప్రేక్షకుల మనసుల్లో చిరస్థాయిగా నిలిచే ఉందని, తెలుగు సినిమా చరిత్రలో ఎన్నో అద్భుత చిత్రాలు వచ్చినప్పటికీ కాలాన్ని జయించి



చిరస్థాయిగా నిలిచిపోయిన సినిమాల్లో 'పాతాళ భైరవి ' అగ్రస్థానంలో నిలుస్తుందన్నారు. త్వరలో జిల్లాలోని ఒక థియేటర్ లో ఈ చిత్రాన్ని ప్రదర్శించడానికి ప్రయత్నాలు చేస్తున్నామని అన్నారు. సూపర్ స్టార్ కృష్ణ అభిమాన సంఘం నాయకులు లింగంపల్లి గాంధీ (తాడేపల్లిగూడెం), ఎన్ టిఆర్ ఫ్యాన్స్ అసోసియేషన్ సభ్యులు విజ్జురోతి రాఘవులు మాట్లాడుతూ పాతాళ భైరవి చిత్రం విడుదలై దశాబ్దాలు గడిచినా ఇప్పటికీ ఈ చిత్రం ప్రేక్షకులను అలరిస్తూనే ఉందని, 1951, మార్చి 15న విడుదలై నేటితో 75 వసంతాలు పూర్తి చేసుకుందన్నారు. కార్యక్రమంలో డా ఎస్ సత్యనారాయణ రాజు, సత్య సుధామి, పి రాజబాబు, కొండ్రు శ్రీనివాస్, కే రామ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.